బుధవారం
3•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50

# నమస్తే తెలంగాణ


మన రాష్ట్రం • మన పత్రిక

• సంపుటి 9 • సంచిక 8
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



రోహిత్ ధనాధన్


అభిమానుల ఆనందహేల

# సెమీస్‌లో భారత్

## బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం

### రోహిత్ సూపర్ సెంచరీ • బుమ్రా, హార్దిక్ విజృంభణ

**ప్రతిష్ఠాత్మక** ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ టైటిల్ వేటలో మరో ముందడుగు వేసింది. మంగళవారం బంగ్లాదేశ్‌తో ఆఖరివరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 28 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. రోహిత్‌శర్మ (104) రికార్డు సెంచరీకి తోడు రాహుల్ (77) రాణింపుతో పోరాడే స్కోరు అందుకున్న భారత్.. బంగ్లా పనిపట్టింది. బుమ్రా (4/55), హార్దిక్ (3/60) విజృంభణతో మరో మ్యాచ్ మిగిలుండగానే నాకౌట్ బెర్తు దక్కించుకున్నది. బంగ్లా ఆటగాళ్లు షకీబ్ (66), సైఫుద్దీన్ (51 నాటౌట్) పోరాటం వృథా అయ్యింది.

వివరాలు 'ఆట'లో

# స్తంభించిన ముంబై

## కుండపోతతో నీరుగారిన నగరం

### ఎక్కడికక్కడ నిలిచిపోయిన లోకల్ రైళ్లు • మలాడ్‌లో గోడకూలి 21 మంది దుర్మరణం

**కుండపోత** వర్షాలు ముంబై నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రెండ్రోజులుగా తెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షాలతో దేశ వాణిజ్య రాజధాని చిగురుటాకులా వణుకుతున్నది. రోడ్లు, రైలు మార్గాలు చెరువులను తలపిస్తుండటం, ముంబైకి జీవనాధారంగా పేర్కొనే లోకల్ రైళ్లు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో ప్రజారవాణా స్తంభించిపోయింది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన రైళ్లను కూడా రద్దుచేయడంతో ప్రయాణికులు నానా కష్టాలు పడుతున్నారు. ముంబైనుంచి దాదాపు 203 విమానాల రాకపోకలను రద్దుచేశారు. పలు విమానాలను దారి మళ్లించారు. రోడ్లపై వాహనదారులు పలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఎటుచూసినా నడుములోతు నీళ్లే కనిపించాయి. పలుచోట్ల వర్షం నీటి ధాటికి కార్లు కొట్టుకుపోయాయి. ప్రత్యేకించి మురికివాడల్లో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. మలాడ్ ప్రాంతంలో ఓ గోడ కూలి 21 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 78 మంది గాయపడ్డారు. ఇదే ప్రాంతంలో ఓ సబ్‌వే కిందికి కారులో వెళ్లి వరద నీటిలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులు వాహనంలోనే మరణించారు. వర్షాల కారణంగా మహారాష్ట్ర అంతటా మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 35 మంది మృతి చెందారు. మరో రెండురోజులపాటు వర్షాలు ఇదే రీతిలో కొనసాగుతాయన్న వాతావరణ విభాగం హెచ్చరిక నేపథ్యంలో నగర ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.


మంగళ వారం ముంబైలోని తిలక్‌నగర్ రైల్వే స్టేషన్‌వద్ద మొలలోతు నీళ్లలో నడిచివెళ్తున్న స్థానికులు

వివరాలు 9వ పేజీలో

## ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం

# నేటితో పూర్తి

- రేపు మండలాల్లో కొలువుదీరనున్న కొత్తపాలకవర్గాలు
- కొత్త పీఆర్ చట్టం వచ్చిన తర్వాత తొలి పాలకవర్గంగా గుర్తింపు
- 112 మండలాల్లో మొదటిసారిగా ఎంపీపీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం బుధవారంతో ముగియనున్నది. 427 మంది ఎంపీపీలు, 6,473 మంది ఎంపీటీసీలు తమ ఐదేండ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. గురువారం మండలాల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. పాత సభ్యుల పదవీకాలం ఉండగానే.. రాష్ట్రప్రభుత్వం పరిషత్ ఎన్నికలు నిర్వహించింది. గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నాలుగు పర్యాయాలు జరిగినప్పటికీ.. పదవీకాలం ముగియకముందే ఎన్నికలు నిర్వహించిన సందర్భాలు లేవు. పదవీ కాలం ముగిశాక ఆర్నెళ్లకో, ఏడాదికో ఎన్నికలు జరిగేవి. కానీ, తెలంగాణ ప్రభుత్వం ముందుగానే ఎన్నికలు నిర్వహించి చరిత్ర సృష్టించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చాక మండలాల్లో కొలువుదీరనున్న తొలి పాలకవర్గాలుగా గురువారం బాధ్యతలు స్వీకరించేవారు రికార్డులకెక్కనున్నారు. మండలాల పునర్విభజన తరువాత రాష్ట్రంలో మండల పరిషత్‌ల సంఖ్య పెరుగగా.. మండల ప్రాదేశిక సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గతంలో చిన్న గ్రామపంచాయతీకి ఒకరు, పెద్ద పంచాయతీల్లో ఇద్దరు చొప్పున ఎంపీటీసీలు ఉండగా.. ఈసారి సరాసరి 3వేల ఓటర్లకు ఒక సభ్యుడిని ఎన్నుకున్నారు. దీంతో ఎంపీటీసీల సంఖ్య తగ్గింది. పాత రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 6,473 మండల పరిషత్ ప్రాదేశిక సెగ్మెంట్లు ఉండగా.. కొత్త చట్టం ప్రకారం 5,857 స్థానాలకు తగ్గాయి. వీటిలో కోర్టు కేసులు, ఇతర కారణాలతో 40 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించలేదు. మిగిలిన 5,817 ఎంపీటీసీ స్థానాల్లో కొత్త సభ్యులను ఎన్నుకున్నారు. మండలాల సంఖ్య 427 నుంచి 539కి పెరిగింది. గత నెల 7న ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. కో-ఆప్షన్ సభ్యులను సైతం నామినేట్ చేశారు.

**పాత సభ్యులకు ఘనంగా వీడ్కోలు**

ఐదేండ్ల పదవీకాలాన్ని బుధవారంతో పూర్తిచేసుకుంటున్న ఎంపీటీసీలు, ఎంపీపీలను గ్రామాల్లో ఘనంగా సన్మానించారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు వారిని సగౌరవంగా సాగనంపుతున్నారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. పలు గ్రామాల్లో పదవీ నుంచి దిగిపోతున్న ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ

మిగతా 2వ పేజీలో


మంగళవారం కరీంనగర్ జిల్లా వీణవంక మండలం గంగారంలో ఎంపీపీ రేణుకకు టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి ఈటల రాజేందర్




## స్వచ్ఛందంగా సభ్యత్వాల నమోదు

గులాబీ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు

ప్రభుత్వ పథకాల వల్లే టీఆర్ఎస్‌కు ఆదరణ: మంత్రులు

7

# మన ప్రతిపాదనలు రెడీ!

## విభజన సమస్యలపై రెండ్రోజులుగా సీఎస్ జోషి సమీక్షలు

- వాటి ఆధారంగా సమగ్ర నివేదిక తయారు
- గవర్నర్ వద్ద జరిగే భేటీకి ప్రతిపాదనలు
- షెడ్యూల్ ప్రకారం నేడే సీఎస్‌ల సమావేశం
- ఆంధ్రప్రదేశ్ అధికారుల విజ్ఞప్తితో వాయిదా
- తదుపరి సమావేశం తేదీ త్వరలో ఖరారు
- ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మతో సమావేశంకానున్న తెలంగాణ అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సమక్షంలో జరిగే సమావేశానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సిద్ధమైంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి గత రెండ్రోజులుగా ఆయాశాఖల కార్యదర్శులు, సంస్థల సీఎండీలు, ఎండీలతో సమీక్షించి నిర్దిష్ట ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని త్వరలో నిర్వహించే సమావేశంలో గవర్నర్ ముందుంచుతారు. వాస్తవానికి బుధవారం ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశం జరుగాల్సి ఉన్నది. అయితే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తిమేరకు బుధవారంనాటి సమావేశాన్ని వాయిదావేశారు. తదుపరి సమావేశం తేదీని త్వరలోనే ఖరారుచేయనున్నారు. గవర్నర్ వద్ద భేటీ రద్దయిన నేపథ్యంలో తెలంగాణ ఉన్నతాధికారులు ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మతో సమావేశం కానున్నారు. ప్రధానంగా 9, 10 షెడ్యూలు సంస్థల విభజనపై చర్చించనున్నారు.

**పరిష్కారాలపై పట్టుదలతో ఇరు రాష్ట్రాల సీఎంలు**

తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో విభజన సమస్యలన్నీ పరిష్కరించుకోవాలనే దృఢ నిర్ణయంతో ఉన్నారు. జూన్ 28న ప్రగతిభవన్‌లో జరిగిన సమావేశంలో నీటిపారుదల అంశంతోపాటు అన్ని సమస్యలను ఏ విధంగా

మిగతా 2వ పేజీలో

## అటవీ సిబ్బందిపై

# పోడు రైతుల దాడి


ఒంటిపై ఉన్న దెబ్బలను చూపుతున్న ఫారెస్టు అధికారి

### ఆరుగురు అధికారులకు గాయాలు

న్యూడెమోక్రసీ ప్రోద్బలంతోనే దాడి • పోలీసులకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫిర్యాదు

పన్నెండుమంది గిరిజనులపై కేసు నమోదు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ ములకలపల్లి:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాలలో అటవీశాఖ అధికారులపై దాడి ఘటన ఒకవైపు సంచలనం సృష్టిస్తుండగానే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో దాడి చోటుచేసుకున్నది. సోమవారం అర్ధరాత్రి ములకలపల్లి మండలం తిమ్మంపేట శివారు గుండాలపాడు పంచాయతీలో పోడు భూములు దున్నుతున్న గిరిజనులను అటవీశాఖ సిబ్బంది అడ్డుకోవటంతో ఘర్షణ తలెత్తింది. ఈ దాడిలో ఆరుగురు అటవీ అధికారులు, సిబ్బందికి గాయాలయ్యాయి. ములకలపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గుండాలపాడు పంచాయతీ పరిధిలోని చింతపాడు, గుండాలపాడు, చలమన్ననగర్ గ్రామాలకు చెందిన కొందరు గిరిజన పోడు రైతులు కొంతకాలంగా కంపార్ట్‌మెంట్ నంబర్ 344లో సుమారు వెయ్యి ఎకరాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. సోమవారం రాత్రి కొందరు రైతులు ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు దున్నుతుండగా, సమాచారం అందుకున్న స్థానిక సెక్షన్ ఆఫీసర్ ఈసం నీలమయ్య తన సిబ్బందితో సహా అక్కడకు వెళ్లి, దుక్కులు దున్నుతున్న ట్రాక్టర్లను అడ్డుకుని, ఫారెస్టు ఆఫీసుకు తీసుకురావాలని కోరారు. తాము 2005కు పూర్వంనుంచి ఈ భూములను సాగుచేసుకుంటున్నామని, ట్రాక్టర్లను తీసుకువెళ్లితే ఊరుకోబోమని పోడు సాగుదారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు, పోడుసాగుదార్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో విషయం తెలుసుకున్న మరికొంత మంది గిరిజనులు అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ట్రాక్టర్లను ఫారెస్టు ఆఫీసుకు తరలించాల్సిందేనని అధికారులు

మిగతా 3వ పేజీలో

## కొత్త పాస్‌పుస్తకానికి

# రూ.20 లక్షలు!


ధర్మగంట

పత్రాలు అన్నీ ఉన్నా బీ క్యాటగిరీలోకి భూమి

కాటారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ లీలలు

మద్దతుగా తాసిల్దార్ దత్తుప్రసాద్

భూపాలపల్లి జిల్లా కాటారం రైతుకు చుక్కలు చూపిస్తున్న అధికారులు


భూమి పత్రాలు చూపుతున్న బాధితురాలు ఉమాదేవి కొడుకు రాజనర్సింహరావు

4

**అక్కడంతా** రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌దే హవా! తాసిల్దార్‌కు తెలిసినా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తారు. దీంతో ఆర్ఐదే ఇష్టారాజ్యంగా సాగుతుంది. రెవెన్యూ ఆఫీసులో పని జరగాలంటే.. ఆయనగారికి అడిగినంత ముట్టజెప్పాల్సిందే. ఉన్న భూమిని బట్టి.. దాని మార్కెట్ విలువను బట్టి టారిఫ్ ఫిక్స్ చేస్తారు. అడిగినంత ఇవ్వకపోతే పని జరుగదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, సుందర్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు రాజేశ్వర్‌రావు.. ఈ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బారిన పడ్డారు. రాజేశ్వర్‌రావు భార్య ఉమాదేవి పేరిట ఉన్న 10.11 ఎకరాలకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం కావాలంటే రూ. 20 లక్షలు చెల్లించాలని సదరు ఆర్ఐ డిమాండ్‌చేశారు. ఏం చేయాలో తోచని ఆ రైతు కుమారుడు 'ధర్మగంట'ను ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకొన్నారు.

## విస్తారంగా వర్షాలు

8

నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షం

ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వానలు

రైతన్నల హర్షం.. ముమ్మరమవుతున్న వ్యవసాయపనులు

### జూలై, ఆగస్టులో వర్షాలకు లోటుండదు

సగటులో 97% వరకు కురుస్తాయి

రెండ్రోజులు ఓ మోస్తరు వానలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి వెల్లడి

5




# గోదారమ్మను తరలించేదెలా?

శ్రీశైలానికి గోదావరి మళ్లింపుపై మథనం • ఇంజినీర్ల కమిటీ విస్తృత అధ్యయనం

2

నేడు, రేపు మిగిలిన ప్రతిపాదనలపై భేటీ • కొలిక్కిరాగానే ఏపీ ఇంజినీర్లతో సమావేశం

# తగ్గిన భూగర్భజలాలు

## గత ఏడాది జూన్‌తో పోలిస్తే 2.31 మీటర్లు తగ్గుదల

### నాలుగు జిల్లాల్లో పెరుగుదల • 33% లోటు వర్షపాతం • భూగర్భజలశాఖ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జూన్‌లో లోటు వర్షపాతం రికార్డయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 69.7 మి.మీ. సాధారణ వర్షపాతానికిగాను 83.8 మి.మీ.లు నమోదుకాగా, మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణం కంటే 1 మి.మీ. అధికంగా, రంగారెడ్డి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. మరోవైపు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, వికారాబాద్ జిల్లాల్లో 50 శాతానికిపైగా లోటువర్షపాతం రికార్డయింది. భూగర్భజలశాఖ జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 589 మండలాల్లోని 941 బావుల భూగర్భజల మట్టాలను పరిశీలించింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 129.2 మిల్లీ మీటర్లకుగాను 87.1 మి.మీ. నమోదైంది. గతేడాది జూన్‌లో రాష్ట్ర సరాసరి నీటిమట్టం 12.27 మీటర్లు ఉండగా, ఈ ఏడాది జూన్‌లో 14.40 మీటర్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే సగటున 2.13 మీటర్ల భూగర్భ జలమట్టం తగ్గింది. గతేడాది జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది నాలుగు జిల్లాల్లో మాత్రమే భూగర్భజలాలు పెరుగగా, మిగతా జిల్లాల్లో తగ్గాయి. మే నెలతో పోలిస్తే జూన్‌లో భూగర్భ జలమట్టం 0.16 మీటర్లు పెరిగినట్టు భూగర్భజలశాఖ వెల్లడించింది. రాష్ట్రంలో కనిష్ఠ భూగర్భ జలమట్టం వనపర్తిలో 7.82 మీటర్లుగా నమోదుకాగా, మెదక్ జిల్లాలో అత్యధికంగా 26.51 మీటర్లుగా నమోదైంది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలమట్టం అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 1.03 మీటర్లు పెరిగితే, అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 0.12 మీటర్లు నమోదైంది. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 0.24, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 0.87 మీటర్లు పెరిగినట్టు భూగర్భజలశాఖ వెల్లడించింది.





వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారు

## నేటి నుంచి శాకాంబరి ఉత్సవాలు

భద్రకాళి అమ్మవారికి 16 వరకు ప్రత్యేక అలంకరణలు

**మట్టెవాడ (వరంగల్):** రాష్ట్రంలో చారిత్రకంగా ప్రసిద్ధిగాంచిన వరంగల్‌లోని భద్రకాళి ఆమ్మవారి ఆలయం శాకాంబరి ఉత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 16 వరకు ప్రతీరోజు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనిమిచ్చేలా ఆలయ అధికారులు కార్యక్రమాలను రూపొందించారు. బుధవారం నిర్వహించనున్న సహస్రకలశాభిషేకానికి మంగళవారం ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు 1000 కలశాలను అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఆర్ సునీత తెలిపారు.

## సర్పంచ్‌కే హరితహారం బాధ్యత

- ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటేలా చర్యలు
- తేడా వస్తే కొత్త చట్టం ప్రకారం చర్యలు
- స్పష్టమైన ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన హరిత హారం బాధ్యత మొత్తం గ్రామ సర్పంచ్‌లపైనే వేసింది. నూతన పంచాయతీరాజ్ చట్టంలో తీసుకొన్న నిర్ణయాలను మరోసారి వివరిస్తూ పంచాయతీరాజ్‌శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్‌లు తొలి టాస్క్‌గా హరితహారాన్ని నిర్వహించాలని సూచించింది. ప్రతీ ఇంటి ముందు మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా సర్పంచ్‌లదేనని పేర్కొన్నారు. వానలు పడుతుండటంతో హరితహారం కార్యక్రమం త్వరలో మొదలుకానున్నది. గ్రామాల్లోని నర్సరీల నుంచి మొక్కలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధంచేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల ప్రథమ పౌరుల బాధ్యతలను మరోసారి గుర్తుచేస్తూ ఆదేశాలిచ్చారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అధికారాలతోపాటు బాధ్యతలు కూడా పెంచిన విషయం తెలిసిందే. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోనున్నారు. నిర్దేశిత బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించకపోయినా, నిధులను సక్రమంగా వినియోగించకున్నా సర్పంచ్‌ను తొలగించడమే కాకుండా.. పాలకవర్గాన్నే రద్దుచేసే అవకాశాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులను కూడా భాగస్వాములను చేస్తూ కొత్త చట్టాన్ని రూపొందించారు. పచ్చదనాన్ని పరిరక్షించడం, హరితహారంలో మొక్కలు నాటడం, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు వంటివి ప్రధాన బాధ్యతలుగా పేర్కొన్నారు. ఒక్కో కుటుంబం ఆరు మొక్కలు నాటాలని, వాటిలో కనీసం మూడు మొక్కలను సంరక్షించాలని.. లేనిపక్షంలో సంబంధిత ఇంటి యజమాని నుంచి రెండింతల ఆస్తిపన్ను వసూలుచేసే అవకాశాన్ని కొత్త చట్టంలో కల్పించారు.



# గోదారమ్మను తరలించేదెలా?

### శ్రీశైలానికి గోదావరి మళ్లింపుపై మథనం

- జలసౌధలో ఇంజినీర్ల కమిటీ విస్తృత అధ్యయనం
- మిగిలిన ప్రతిపాదనలపై నేడు, రేపు భేటీ
- కొలిక్కిరాగానే ఏపీ ఇంజినీర్లతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరిని కృష్ణమ్మ మజిలీకి ఎలా చేర్చాలనే అంశంపై ఇంజినీర్ల మథనం ముమ్మరంగా కొనసాగుతున్నది. రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున గోదావరి జలాలను కృష్ణాబేసిన్‌కు తరలించేలా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఇద్దరు ముఖ్యమంత్రులు ఆదేశించిన దరిమిలా.. దుమ్ముగూడెంనుంచిగానీ, మరో పాయింట్‌నుంచిగానీ గోదావరిజలాల్ని నాగార్జునసాగర్, శ్రీశైలానికి తరలించే అలైన్‌మెంట్లపై తెలంగాణ ఇంజినీర్లు కసరత్తులో నిమగ్నమయ్యారు. పోలవరం నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలానికి జలాల తరలింపుపై ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లు కూడా మథనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ ఇంజినీర్ల కమిటీ జలసౌధలో తొలిసారి సమావేశమైంది. అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజినీర్ నర్సింహారావు ఢిల్లీలో బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో అందుబాటులో లేకపోగా.. మిగిలినవారు సమావేశమై జలాల తరలింపు అలైన్‌మెంట్లపై చర్చించారు. బుధవారం రెండు రాష్ట్రాల ఇంజినీర్ల సంయుక్త సమావేశం ఉంటుందని భావించినప్పటికీ.. తమ అధ్యయనం కొలిక్కి వచ్చిన తర్వాతనే ఇరు రాష్ట్రాల ఇంజినీర్ల సమావేశం నిర్వహిస్తామని తెలంగాణ ఇంజినీర్లు చెప్తున్నారు.

#### కొల్లాపూర్ మీదుగా

మంగళవారంనాటి సమావేశంలో ప్రధానంగా ములుగు జిల్లా పరిధిలోని ఒక పాయింట్ దగ్గర నుంచి గోదావరి జలాలను శ్రీశైలం రిజర్వాయర్‌కు తరలించడంపై ఇంజినీర్లు టోపోషీట్ల ఆధారంగా ప్రాథమికంగా అధ్యయనంచేశారు. శ్రీశైలానికి జలాల తరలింపు అలైన్‌మెంట్‌లో అటవీ ప్రాంతం లేకుండా చూడటంపై లోతుగా కసరత్తు చేసినట్లు తెలిసింది. ములుగు జిల్లా పరిధిలోని గోదావరి నుంచి నేరుగా శ్రీశైలానికి తరలించాలంటే మధ్యలో చాలాభాగం టైగర్ రిజర్వు ఫారెస్టుజోన్ వచ్చే అవకాశముంది. దీంతో అటవీప్రాంతాన్ని తప్పిస్తూ అలైన్‌మెంట్‌ను రూపొందించే పనిలో ఇంజినీర్లు ఉన్నారు. ప్రాథమిక అంచనామేరకు దాదాపు 380 కిలోమీటర్ల మేర జలాల తరలింపు చేపడితేగానీ అటవీప్రాంతాన్ని తప్పించే అవకాశం ఉండదని ఇంజినీర్లు గుర్తించినట్లు సమాచారం. సుమారు 50 కిలోమీటర్లకు పైగా సొరంగమార్గం నిర్మాణాన్ని కూడా చేపట్టాల్సి ఉంటుందనే అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఈ అలైన్‌మెంట్ ద్వారా ములుగు, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని నార్కట్‌పల్లి.. అటునుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో కొల్లాపూర్ మీదుగా శ్రీశైలం జలాశయంలో గోదావరిజలాల్ని ఎత్తిపోయాల్సి వస్తుందని గుర్తించారు. ఇందుకోసం ఐదారుచోట్ల ఎత్తిపోతల తప్పేలాలేదని సమాచారం. ప్రస్తుతానికి ఈ ఒక్క అలైన్‌మెంట్‌పైనే దృష్టిసారించిన ఇంజినీర్లు దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నారు. ఇంకా తక్కువవ్యయం, కొన్నిచోట్ల వచ్చే అటవీప్రాంతాన్ని కూడా తప్పించేలా మెరుగైన అలైన్‌మెంట్‌ను తీసుకువచ్చేందుకు ఇంజినీర్లు కృషిచేస్తున్నారు. బుధవారం మరోసారి సమావేశమై ఎత్తిపోతలు, వ్యయం తదితర అంశాలతోపాటు ఈ అలైన్‌మెంట్‌ను ఒక కొలిక్కి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిసింది.



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి (ఫైల్ ఫొటో)

#### మిగిలిన ప్రత్యామ్నాయాలపై నేడు, రేపు

**బుధ,** గురువారాల్లో జరిగే సమావేశాల్లో ములుగు జిల్లా పరిధిలోని గోదావరి నుంచి జలాల్ని నాగార్జునసాగర్‌కు తరలించడం, దుమ్ముగూడెం నుంచి నాగార్జునసాగర్‌కు తరలించడం అనే మిగిలిన ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేయనున్నారు. వీటన్నింటిపైనా అధ్యయనాన్ని ముగించి.. అలైన్‌మెంట్, అంచనా వ్యయం అంశాలు కొలిక్కి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లతో సమావేశం కానున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీలో ఈ నెల 15వరకు గడువు విధించిన దరిమిలా నాలుగైదురోజులపాటు తెలంగాణ ఇంజినీర్లు ప్రత్యేకంగానే సమావేశమై.. వచ్చే వారం ఏపీ ఇంజినీర్లతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించే సూచనలు కనిపిస్తున్నాయి.

## మమ్మల్ని ఏపీకి పంపండి!

### సీఎస్ ఎస్కే జోషికి విన్నవించిన ఏపీకి చెందిన కానిస్టేబుళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికేతరులుగా మారిన తమకు మానవతా దృక్పథంతో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు స్వచ్ఛందంగా అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం ఇవ్వాలని తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ ప్రాంతానికి చెందిన కానిస్టేబుళ్లు సీఎస్ ఎస్కే జోషిని కోరారు. ఈ మేరకు వారు మంగళవారం సీఎస్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాన్‌లోకల్, ఓపెన్ కోటాలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు వివిధ జిల్లాల్లో ఏపీ ప్రాంతానికి చెందినవారు కానిస్టేబుళ్లుగా ఎంపికై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు సొంత రాష్ట్రమైన ఏపీకి వెళ్లేందుకు సముఖంగా ఉన్నారు. నాన్‌లోకల్ కోటాలో మొత్తం 1,500 మంది పనిచేస్తుండగా, దాదాపు 400 మంది స్వచ్ఛందంగా వెళ్లేందుకు సుముఖంగా ఉన్నారు. వీరంతా తమ బదిలీకి అవకాశం కల్పించాలని సోమవారం పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి ఆధ్వర్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. డీజీపీ సుముఖత వ్యక్తం చేయడంతో మంగళవారం సీఎస్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామని, సీఎస్ సానుకూలంగా స్పందించారని తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కానిస్టేబుల్ మురళీకృష్ణ తెలిపారు.

## ఏపీ ఎంసెట్ వెబ్ఆప్షన్ల ఎంపిక 8కి వాయిదా

16న ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన వెబ్ఆప్షన్ల ఎంపిక ఈ నెల 8కి వాయిదా పడింది. ఈ ప్రక్రియ 13 వరకు నిర్వహించనున్నారు. 8, 9 తేదీల్లో ఎంసెట్‌లో 1 నుంచి 30 వేల ర్యాంకులోపు, 10, 11 తేదీల్లో 30,001 నుంచి 75 వేల ర్యాంకు వరకు, 12, 13 తేదీల్లో 75,001 నుంచి చివరి ర్యాంకు వరకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఏపీ ఎంసెట్ కన్వీనర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇస్తూ.. 16న సాయంత్రం 6 గంటలకు సీట్ల కేటాయింపు చేస్తామని కన్వీనర్ వెల్లడించారు.

#### ముహూర్తం

సూర్యోదయం: 5.50 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, పాడ్యమి రాత్రి 10.06 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఆరుద్ర ఉదయం 6.37 వరకు, తదుపరి పునర్వసు, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.20 నుంచి 1.58 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.54 నుంచి మధ్యాహ్నం 12.46 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.38 నుంచి రాత్రి 7.14 వరకు.

## బోధనాపద్ధతులు పటిష్ఠపరుచండి

తగిన ప్రణాళికలు రూపొందించండి

- తెలంగాణలో రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ విధానం భేష్
- రాష్ట్ర విద్యావిధానంపై సర్వే నివేదికను మాజీ ఎంపీ వినోద్‌తో కలిసి విద్యాశాఖ కార్యదర్శికి అందజేసిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్ శాంతాసిన్హా
- విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాథమిక విద్యావిధానంలోని బోధనాపద్ధతుల్లో కొన్ని లోపాలున్నాయని, వాటిని సరిదిద్ది పటిష్ఠపరుచాల్సిన అవసరం ఉన్నదని జాతీయ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రొఫెసర్ శాంతాసిన్హా చెప్పారు. విద్యార్థులు విద్యలో ఎందుకు వెనుకబడుతున్నారనే అంశాలపై చర్చించడంతోపాటు వారికి పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆమె సూచించారు. తెలంగాణలో విద్యావిధానంపై చేసిన సర్వే నివేదికను మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి ఆమె విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. ప్రాథమిక విద్యావిధానంలో పది శాతం మంది మాత్రమే పురోగతి సాధిస్తున్నారని, మిగిలిన 90 శాతం విద్యార్థులు ఎందుకు పెద్దగా విద్యలో అభివృద్ధి చెందలేకపోతున్నారనే అంశాలపై ఆమె చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువురాని తల్లిదండ్రులు ఉండటం వల్ల వారికి ఇంటి వద్ద విద్యాబోధన అందడం లేదని, దానివల్ల విద్యలో మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నారనే అంశాన్ని విద్యాశాఖ కార్యదర్శి వద్ద శాంతాసిన్హా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టారని, అందులోభాగంగా రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. అయినా నాణ్యమైన విద్య కోసం మరిన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. రాజ్యాంగం ప్రకారం విద్యావిధానాన్ని పంచాయతీరాజ్ చట్టం పరిధిలోకి తీసుకురావవాల్సి ఉన్నదని, ఈ విధానాన్ని ఇప్పటికే కేరళ, కర్ణాటక, తమిళనాడులో అమలుపరుస్తున్నారని, దానివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల బోధన పద్ధతుల్లో మార్పు తీసుకురావడంలో భాగంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని సూచించారు.



విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డితో భేటీ అయిన జాతీయ బాలల హక్కుల చైర్‌పర్సన్ శాంతాసిన్హా. చిత్రంలో మాజీ ఎంపీ వినోద్ కూడా ఉన్నారు.

## అక్రమ పర్మిట్లను ఉపేక్షించం

- లారీలకు సింగిల్ పర్మిట్‌పై ఏపీతో చర్చలు
- రవాణాశాఖలో మరిన్ని సేవలందించే అంశంపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఆర్టీఏలో రెండువారాల్లో తీరనున్న కార్డుల సమస్య
- రవాణాశాఖ ఆదాయంలో దేశంలోనే నాలుగోస్థానం
- సమీక్షా సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడి



ఖైరతాబాద్ ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో మొక్కనాటి నీరుపోస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పర్మిట్లు లేకుండా, అనుమతి తీసుకోకుండా తిరిగే వాహనాలపై కఠినచర్యలు తప్పవని.. అక్రమ పర్మిట్ల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య తిరిగే లారీలకు సింగిల్ పర్మిట్ అమలుచేసే అంశంపై ఏపీ రవాణాశాఖ మంత్రి పేర్ని నానితో చర్చించినట్టు తెలిపారు. సింగిల్ పర్మిట్ అంశాన్ని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల విభజన అంశాల్లో చేర్చాలని నిర్ణయించినట్టు చెప్పారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో రవాణాశాఖ ఉన్నతాధికారులు, డీటీసీ, ఆర్టీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మరింత పారదర్శకంగా, మరిన్ని సేవలు అందించేందుకు ఎలాంటి మార్పులు చేపట్టాలనే అంశాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేస్తున్నామని, ఈ కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇస్తుందని చెప్పారు. ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేకసెల్ ఏర్పాటుచేసి తన కార్యాలయంతో అనుసంధానం చేస్తామని.. అలాగే ప్రత్యేక మెయిల్‌ను, మొబైల్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. ఆర్టీఏ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తామని చెప్పారు.

#### ఆదాయంలో నాలుగోస్థానం

రవాణాశాఖ ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నాలుగోస్థానంలో నిలిచిందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకస్మిక దాడులతో గతేడాది కంటే ఈ సంవత్సరం త్రైమాసికంలోనే రూ.ఏడు కోట్ల ఆదాయం పెరిగిందని వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీసీ పాపారావు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారని, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని అభినందించారు. ఆర్టీఏ కార్యాలయాల్లో కార్డుల కొరత కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయని, ఇప్పటివరకు 2.30 లక్షల కార్డులు జారీచేయాల్సి ఉన్నదని, 15 రోజుల్లో వీటిని ప్రింట్ చేసి పంపిణీచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రవాణాశాఖ కమిషనర్ సునీల్‌శర్మ, జేటీసీలు రమేష్, మమతాప్రసాద్, పాండురంగ నాయక్, అధికారులు పాపారావు, ప్రవీణ్‌రావు, ఎం కిషన్, శ్రీనివాస్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కౌంటర్ల వద్ద వినియోగదారులతో మాట్లాడి, ఫీడ్‌బ్యాక్ సేకరించారు. రవాణాశాఖలో సేవల లోపం లేదని, సిబ్బంది సహకరిస్తున్నారని వినియోగదారులు చెప్పడంతో మంత్రి అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న డ్రైవింగ్ సిమ్యులేటర్‌ను మంత్రి డ్రైవ్‌చేశారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## 61 మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

- 26 మంది కలెక్టర్లు, నలుగురు జేసీలు, 20 మంది ఆర్డీవోలకు బాధ్యతలు
- తుది జాబితాలో కమిషనర్లు, సీడీఎంఏ డైరెక్టర్లకు స్థానం
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. 61 మున్సిపాలిటీలను స్పెషలాఫీసర్ల పాలనలోకి ప్రభుత్వం తీసుకొస్తూ నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ ఉత్తర్వులు విడుదల చేశారు. 53 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీకాలం మంగళవారం ముగిసింది. వీటితోపాటు బోడుప్పల్, జల్‌పల్లి, మీర్‌పేట, జిల్లెల్లగూడ, తెల్లాపూర్ వంటి కొత్త మున్సిపాలిటీల్లో కూడా పరిపాలనను కొనసాగించడానికి స్పెషలాఫీసర్లను నియమించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి ప్రభుత్వాన్ని కోరారు. దాంతో ఈ అంశానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం 61 మున్సిపాలిటీలకు స్పెషలాఫీసర్లను నియమిస్తూ నిర్ణయం తీసుకొన్నది. ప్రభుత్వం నియమించిన స్పెషలాఫీసర్లలో 26 మంది కలెక్టర్లు, నలుగురు జాయింట్ కలెక్టర్లు, ఇరవై మంది ఆర్‌డీవోలు ఉన్నారు. వీరితోపాటు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు, వివిధస్థాయిలో కమిషనర్లు, సీడీఎంఏ డిప్యూటీ డైరెక్టర్, అదనపు డైరెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) తదితరులను నియమిస్తూ ఆదేశాలిచ్చింది. జనాభా ప్రాతిపదికన చైర్మన్ రిజర్వేషన్లు రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇప్పటికే వార్డుల విభజన ప్రక్రియను పురపాలకశాఖ పూర్తిచేసింది. ఓటర్ల జాబితా లెక్కతేల్చిన తర్వాత మున్సిపల్ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఆయా మున్సిపాలిటీల్లోని జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొంటుంది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి తుది జాబితా అందగానే మున్సిపాలిటీల్లో ఎన్నికలకు శంఖం పూరిస్తారు.

#### లోకం పోకడ





వర్షాలు లేవని నీ బాధేంటయ్యా.. జీఎస్టీ వసూళ్లు లేవని మేం బాధపడుతుంటే..!

## మన ప్రతిపాదనలు రెడీ!

మొదటిపేజీ తరువాయి...

పరిష్కరించాలో ఇద్దరు సీఎంలు ఒక భూమికను సిద్ధంచేశారు. ఆ భేటీ వెలుగులోనే మరుసటిరోజు ఇరు రాష్ట్రాల సీఎస్‌లు సమావేశమై, విభజన అంశాలపై చర్చించి, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం-2014కు అనుగుణంగా పలు ప్రతిపాదనలు రూపొందించారు. ముఖ్యంగా షెడ్యూల్ 9, 10 సంస్థలపై చర్చించారు. షెడ్యూల్ 9లో ఉన్న 91 సంస్థల్లో 44 సంస్థల విభజనలో ఎలాంటి సమస్యలు లేవు. ఆరు సంస్థల ప్రధాన కార్యాలయాలు ఏపీలోనే ఉన్నాయి. వాటిపై తెలంగాణ ఎలాంటి వివాదాన్ని లేవనెత్తలేదు. మూడు సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం జీవోలు ఇచ్చుకున్నది. ముఖ్యంగా దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (దిల్), హౌసింగ్ బోర్డు, విద్యుత్ సంస్థలు, ఆర్టీసీ, ఏపీ డెయిరీ లాంటి కీలకమైన సంస్థలు సహా 38 సంస్థల విభజనపై విభేదాలున్నాయి. హెడ్‌క్వార్టర్ అంటే ఆయా సంస్థల సీఎండీలుగానీ, ఎండీలుగానీ కూర్చునే కార్యాలయాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నది. ఇదే విషయాన్ని గతంలో కేంద్రం కూడా అనేక పర్యాయాలు స్పష్టంచేసింది. కానీ చంద్రబాబు నాయకత్వంలోని నాటి ఏపీ ప్రభుత్వం ఆయా సంస్థలకు హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో ఉన్న భూములపై కన్నేసింది. ఈ భూముల్లో వాటా కావాలని వితండవాదానికి దిగింది. దీనికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా అభ్యంతరం వ్యక్తంచేసింది. దిల్‌కు ఉమ్మడి ప్రభుత్వంలో సుమారు 4900 ఎకరాల భూములను హైదరాబాద్ నగరంలో కేటాయించారు. ఈ భూములను విక్రయించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలని ఆనాటి ఉమ్మడి సర్కారు నిర్ణయించింది. అయితే భూముల విక్రయం జరుగకుండా నాటి తెలంగాణ ఉద్యమకారులు అడ్డుకోవడంతో అమ్మకాలు నిలిచిపోయాయి. భూములు మిగిలాయి. విభజన తర్వాత ఏపీలో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం ఆ భూముల్లో వాటా కావాలని వాదించింది. దీంతో దిల్ విభజన ఆగిపోయింది. అలాగే ఏపీ డెయిరీ, ఆర్టీసీ, హౌసింగ్‌బోర్డు, విద్యుత్‌సంస్థలతోపాటు పలు సంస్థల విభజన పూర్తికాలేదు. ఇదే తీరుగా షెడ్యూల్ 10 సంస్థలపై కూడా ఏపీ పేచీపెట్టింది. వాస్తంగా విభజన చట్టంలో పదో షెడ్యూల్ సంస్థలు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికే చెందుతాయి. కానీ ఉన్నత విద్యామండలిపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఇలా నాటి ఏపీ ప్రభుత్వం వివాదాలు లేవనెత్తి షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనను అడ్డుకున్నది. మారిన రాజకీయ పరిస్థితుల్లో రెండు ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో విభజన సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవడానికి ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కోరిన వెంటనే హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న భవనాలన్నింటినీ ఏపీ ప్రభుత్వం అప్పగించింది. ఏపీ ప్రభుత్వం భవనాలను అప్పగించడానికి ముందుకురాగానే ఆ భవనాలకు చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ తెలంగాణ ప్రభుత్వం రద్దుచేసింది. ఆ తర్వాత అధికారికంగా ఇద్దరు సీఎంలు భేటీ అయ్యారు. దానికి కొనసాగింపుగా గవర్నర్ సమక్షంలో ఇద్దరు సీఎస్‌లు భేటీ కావాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశం తర్వాత చాలాసంస్థల పూర్తిస్థాయి విభజనకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం నేటితో పూర్తి

మొదటిపేజీ తరువాయి...

సభ్యులు కంటతడి పెట్టుకున్నారు.

#### రేపు అప్పాయింటెడ్ డే

మండలాల్లో పాత పాలకవర్గాల పదవీకాలం జూలై 3తో ముగియనుండటంతో.. కొత్త మండల పరిషత్‌ల మొదటి సమావేశ తేదీ (అప్పాయింటెడ్ డే)ని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇదివరకే ఖరారు చేసింది. జూలై 4న (కొన్ని జిల్లాల్లోని ఎంపీపీలు మినహా) రాష్ట్రంలోని ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్టు ఎస్ఈసీ స్పష్టంచేసింది. అదేరోజున తొలి సమావేశం నిర్వహించనున్నారు. ఆ తేదీనుంచే వీరి పదవీకాలం మొదలై.. ఐదేండ్లు కొనసాగనున్నది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ఎంపీపీలు, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఎంపీపీలు, ఎంపీటీసీలు మినహాయించి.. మిగిలిన జిల్లాలోని ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా సమావేశం కానున్నారు. కొత్త ఎంపీపీలతోపాటు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం అధికారికంగా మొదలువుతున్నది. ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తమ స్థానాల్లో కూర్చోడానికి ముందే ఎంపీటీసీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ఎంపీపీలు, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఎంపీపీలు ఆగస్టు 6న పదవుల్లోకి రానున్నారు. రాష్ట్రంలో మొత్తం 539 మండలాలకు గాను.. ములుగు జిల్లా మంగపేటలో ఎన్నికలు జరుగలేదు. మిగిలిన 538 మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తిచేశారు.

#### కొత్తగా 112 ఎంపీపీలు

రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామాలను ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్తగా 112 మండలాలు ఏర్పాటయ్యాయి. ఈ మండలాల్లో తొలిసారిగా ఎంపీపీలుగా కొలువుదీరనున్నారు. ఇందుకోసం మండల కేంద్రాల్లో ఏర్పాట్లుచేశారు.

# టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**కాచిగూడ:** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి టీ-సేవ ఆన్‌లైన్ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ-సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్య, ఉపాధి, ఉద్యోగం, ఆరోగ్యం, వివిధ రకాల బిల్లుల చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్ల బుకింగ్ వంటి పలురకాల సేవలను వీటిద్వారా అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 8179955744 లేదా ఆన్‌లైన్‌లో www.tsevacentre.com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

# ఐఎస్బీలో టీఈపీ స్నాతకోత్సవం

- 206 మంది టాస్క్ విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాల పంపిణీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యార్థుల నైపుణ్యాలను వెలుగులోకితెచ్చి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ)తో కలిసి టాస్క్ నిర్వహించిన టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం (టీఈపీ) స్నాతకోత్సవం మంగళవారం ఐఎస్బీలో జరిగింది. శిక్షణ పూర్తిచేసుకున్న 19 కళాశాలలకు చెందిన 206 మంది విద్యార్థులకు ఉత్తీర్ణతపత్రాలు పంపిణీ చేశారు. గ్రూప్ డిస్కషన్స్‌లో పాల్గొన్న విద్యార్థుల ప్రథమ, ద్వితీయ, తృతీయ బృందాలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో సీఈవో టాస్క్ శ్రీకాంత్‌సిన్హా, ఐఎస్బీ ప్రొఫెసర్ భగవాన్‌చౌదరి పాల్గొన్నారు.



అసంపూర్తిగా చెక్కిన శిల్పం

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో

# ఆదిమానవుల రాతిచిత్రాలు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అద్భుత రాతిచిత్రాలు వెలుగు చూశాయి. కొండవీటి గోపీవరప్రసాద్‌రావు అన్వేషణలో ముల్కలపల్లి మండలం నల్లముడి అనే గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో ఈ రాతిచిత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతంలో ఆదిమానవుడి ఆనవాళ్లు ఉండవచ్చన్న అంచనాలతో జరిపిన అన్వేషణలో అక్షరలొద్దికి 2 కి.మీ. దూరంలో ఇవి కనిపించాయి. స్థానికులు ఈ ప్రాంతాన్ని ఒంటిగుండుగా పిలుస్తారు. తెలంగాణ జాగృతి సభ్యులు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, శ్రీరామోజు హరగోపాల్, కట్టా శ్రీనివాస్ ఈ కొత్తరాతి చిత్రాల వివరాలు సేకరిస్తున్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నల్లముడి సమీపంలో రాతి గుండుపై గీసిన చిత్రాలు






మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాలపాడులో పోడు భూమిలో ఆందోళన చేస్తున్న సాగుదారులు

# అటవీ సిబ్బందిపై పోడు రైతుల దాడి


మొదటిపేజీ తరువాయి...


పట్టుపట్టడంతో ఫారెస్టు అధికారులకు, పోడు సాగుదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెచ్చిపోయిన పోడుసాగుదారులు అటవీశాఖ అధికారులపై కర్రలతో దాడికి పాల్పడారు. ఈ దాడిలో సెక్షన్ ఆఫీసర్ ఈసం నీలమయ్యతోపాటు, బీట్ ఆఫీసర్లు గుగులోత్ భాస్కర్, భుక్యా పద్మ, వాచర్లు భుక్యా రమేశ్, కోండ్రు సందీప్, కారం నాగరాజుకు గాయాలయ్యాయి. గాయపడినవారిని వెంటనే దగ్గరలోని మంగపేట పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పాల్వంచ ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు నూపా భాస్కర్ ప్రోద్బలంతోనే తమపై కొందరు పోడుసాగుదారులు దాడికి పాల్పడ్డారని ములకలపల్లి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఈసం నీలమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నూపా భాస్కర్, పోడుసాగుదారులు కారం ఎర్రయ్య, కారం వెంకటేశ్వర్లు, కుర్సం పంతులు, కట్టం కోసయ్య, మడివి సునీల్, కుర్సం ముకేశ్, చుక్కా శ్రీను, కణితి రాజు, కణితి భద్రమ్మ, కారం దూలయ్య, పోతుగంటి లక్ష్మయ్యను అరెస్టుచేశారు.

### మూకుమ్మడిగా దాడి



మా సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో కలిసి సోమవారం రాత్రి గుండాలపాడు పంచాయతీలో పెట్రోలింగ్‌కు వెళ్లాం. తిమ్మంపేట అటవీపరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 344లో ట్రాక్టర్లతో దుక్కులు దున్నటాన్ని గమనించిన మేము అక్కడకు వెళ్లి, ట్రాక్టర్లను అడ్డుకుని బేస్‌క్యాంపునకు తరలించే ప్రయత్నంచేశాం. ట్రాక్టర్ల డ్రైవర్ల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోడుసాగుదారులు మాపై కర్రలతో విచక్షణారహితంగా దాడులుచేశారు. మాపై దాడులకు పాల్పడం అమానుషం. ప్రభుత్వం అటవీశాఖ అధికారులకు రక్షణ కల్పించాలి.

– గుగులోత్ భాస్కర్, చలమన్ననగర్ ఫారెస్టు బీట్ ఆఫీసర్



వివాదానికి కారణమైన పోడుభూమి

# దాడులను ఉపేక్షించం

- అడవి బిడ్డలకు అన్యాయం చేయం
- అటవీశాఖ ఉద్యోగులకు పూర్తి రక్షణ
- కబ్జాదారులపై కఠినచర్యలు తీసుకుంటాం
- పోడు భూములపై త్వరలో సీఎం కేసీఆర్ నిర్ణయం
- కాంగ్రెస్ నాడు ఏమి చేసింది?
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిలదీత

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** అడవులను కాపాడటానికి క్షేత్రస్థాయిలో పనిచేసే అటవీ ఉద్యోగులు, అధికారులకు ప్రభుత్వం పూర్తి రక్షణనిస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వారిపై ఎక్కడ దాడులు జరిగినా ఉపేక్షించేదిలేదన్నారు. అడవులను నమ్ముకున్న అడవిబిడ్డలకు ప్రభుత్వం అన్యాయం చేయదని, అదే సమయంలో అడవులను కబ్జాచేసి సొమ్ము చేసుకునే ఆక్రమణదారులను వదిలేదిలేదని మంత్రి స్పష్టంచేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాల గ్రామ శివార్లలో చోటుచేసుకున్న ఘటన దురదృష్టకరమన్నారు. పలువురు అటవీశాఖ ఉద్యోగసంఘాల నాయకులు మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో సచివాలయంలో భేటీ అయ్యారు. రాష్టంలో అటవీ అధికారులపై దాడులను అరికట్టాలని, కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ, అడవులు మనందరివని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంటుందని అన్నారు. పచ్చని అడవులుంటేనే మానవాళి మనుగడ సాధ్యమన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించరాదని చెప్పారు. అడవుల ప్రాధాన్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, వాటి రక్షణలో స్థానికులను భాగస్వాములను చేయడానికి ప్రయత్నించాలని సూచించారు. జంగిల్ బచావో-జంగిల్ బడావో అన్న నినాదంతో సీఎం కేసీఆర్ అడవుల రక్షణకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అందరికీ తెలిసిందేనని అన్నారు. ఇప్పటికే స్మగ్లర్ల ఆగడాలను సీఎం చొరవవల్ల పూర్తిగా అరికట్టగలిగామని ప్రకటించారు. అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉందన్నారు. గిరిజనులతో సమస్య లేదని, వారి ముసుగులో కొందరు పోడు భూముల పేరిట కబ్జాలు చేయడంతో పరిస్థితి విషమిస్తున్నదనే విషయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలున్నవారితో సమస్యలేదని స్పష్టంచేశారు. మంత్రిని కలిసినవారిలో స్టేట్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ కన్వీనర్ డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వన్నె మోహన్, జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు తదితరులున్నారు.



మంగళవారం సచివాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అటవీశాఖ ఉద్యోగ సంఘాల నాయకులు

### పోడు సమస్యను కాంగ్రెస్ ఎందుకు పరిష్కరించలేదు?

సార్సాల ఘటనను కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విమర్శించారు. పోడు సమస్య అంటూ రాద్ధాంతంచేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ఆర్వోఎఫ్‌ఆర్ మొదలుకుని పోడు భూముల సమస్యలన్నీ గత ప్రభుత్వాల సృష్టేనని స్పష్టంచేశారు. సున్నితమైన పోడుభూముల సమస్యను తానే స్వయంగా పరిష్కరిస్తానని, అర్హులైనవారికి న్యాయంచేస్తామని, అడవిని కాపాడుకుంటామని సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో పోడు భూముల సమస్యలపై సీఎం దృష్టిసారించి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుక్కొంటారని తెలిపారు. అప్పటివరకు ట్రెంచ్‌లు వేయకుండా అడవిని కాపాడే ప్రయత్నం చేయాలని అటవీ అధికారులకు సూచించారు. మొదటినుంచీ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచి అడవుల శాతాన్ని పెంచడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిసారించి హరితహారం అమలుచేస్తున్నారని చెప్తూ.. గత పాలకులు ఇంత దూరదృష్టితో వ్యవహరించారా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు.



## సమన్వయంతో ముందుకు వెళ్లండి

- రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశాలు
- అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అటవీశాఖ అధికారులపై దాడులను పోలీస్ శాఖ సీరియస్‌గా తీసుకున్నది. అటవీశాఖ అధికారుల విధులకు ఆటంకం కల్గించడంతోపాటు వారిపై దాడులకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసుకుని, సమిష్టిగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎస్పీలకు సూచించినట్టు శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అటవీప్రాంతంలో మొక్కలు నాటేందుకు వెళ్లేముందు ఎస్పీలకు సమాచారం ఇవ్వాల్సిందిగా అటవీశాఖ అధికారులకు సూచించామని చెప్పారు. అటవీప్రాంతంలోకి వెళ్లే అటవీశాఖ సిబ్బందికి సాయుధ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని, అవసరం మేరకు పక్కజిల్లాలనుంచి సైతం బలగాలను వినియోగించుకోవాలని సూచించామని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

# నిందితులపై కఠిన చర్యలు తప్పవు

- సార్సాల సంఘటనపై హోంమంత్రి మహమూద్‌అలీ వెల్లడి
- అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అటవీ అధికారులపై దాడులకు పాల్పడినవారు ఎవరైనా చట్టానికి అతీతులుకారని, నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హోంమంత్రి మహమూద్ అలీ స్పష్టంచేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాల గ్రామంలో అటవీ అధికారులపై దాడి ఘటన దురదృష్టకరమన్నారు. ఘటన పూర్వాపరాలు, తీసుకోవాల్సిన చర్యలపై అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో మహమూద్ అలీ మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో చర్చించారు. అటవీ సిబ్బంది విధులకు ఆటంకం కలుగకుండా చూసేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని హోంమంత్రి అన్నారు. సిబ్బంది రక్షణపై చర్చించి అన్నిచర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



సార్సాల ఘటనపై మంగళవారం సచివాలయంలో చర్చిస్తున్న మంత్రులు మహమూద్‌అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి

## ఎంబీబీఎస్, బీడీఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ

- కేఎన్నార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్
- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేట్ యూజీ వైద్య, దంత కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం (కేఎన్నార్‌యూహెచ్‌ఎస్) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్-2019లో అర్హత సాధించిన అభ్యర్థులు క్యాటగిరీ బీ, సీ (ఎన్నారై) కోటాలో సీట్ల భర్తీకి బుధవారం ఉదయం 9 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు https://tspvtmedadm.tsche.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. దరఖాస్తుకు సంబంధించి సాంకేతిక సమస్యలు ఉంటే 9502001583, 8466924522 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని, www.knruhs.in , www.knruhs.telangana.gov.in సైట్లను చూడాలని సూచించింది.

## సివిల్స్ శిక్షణకు 20 వరకు దరఖాస్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీసర్కిల్ ద్వారా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమంలో భాగంగా సివిల్స్ పరీక్షలు రాసే అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ చేపడుతున్నట్టు స్టడీసర్కిల్ డైరెక్టర్ బాలాచారి తెలిపారు. 100 మందికి శిక్షణ ఇవ్వనున్నామని, ఈ నెల 20వ తేదీ వరకు www.tsbcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 040-24071178 నంబర్లో సంప్రదించాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆగస్టు 4న ఓపెన్ వర్సిటీ అర్హత పరీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దూరవిద్యా విధానం ద్వారా డిగ్రీకోర్సు పూర్తిచేయాలనుకున్నవారు బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఆగస్టు 4న నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు గడువు విధించామని వర్సిటీ రిజిస్ట్రార్ మంగళవారం ప్రకటించారు.

# రేపట్నుంచి గోల్కొండ బోనాలు



సచివాలయంలో దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక, సాంస్కృతికశాఖల అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మంత్రులు మహమూద్‌అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ఉన్నారు

- ఆయాశాఖలు సమన్వయంతో భక్తులకు ఏర్పాట్లుచేయాలి
- బోనాల ఏర్పాట్లపై సమీక్షలో మంత్రులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జంటనగరాల్లో అత్యంత వైభవంగా బోనాల పండుగ నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని పాడి పరిశ్రమలశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. గురువారం నుంచి గోల్కొండ బోనాలు ప్రారంభం కానున్నాయని తెలిపా రు. జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి మంగళవారం సచివాలయంలోని హోంమంత్రి మహమూద్ అలీ చాంబర్‌లో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక, సాంస్కృతిక శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గురువారం గోల్కొండ కోటలో జరిగే తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావుగౌడ్, మంత్రులు ఐకే రెడ్డి, తలసాని పట్టువస్త్రాలు సమర్పించాలని నిర్ణయించారు. హోంమంత్రి మహమూద్ అలీ కూడా పాల్గొంటారు. నగరంలోని 25 దేవాలయాలకు పట్టువస్త్రాలు సమర్పించాలని, ప్రత్యేకంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయాశాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జంటనగరాలు, రంగారెడ్డి జిల్లా కలుపుకొని దాదాపు మూడువేల దేవాలయాలకు ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందజేస్తామని, పండుగకు ముందే ఈ మొత్తం అందేలా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాలను వీక్షించేందుకు గోల్కొండకోట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మోండామార్కెట్ క్లాక్‌టవర్ బిల్డింగ్, పాతబస్తీలోని దమయంతి బిల్డింగ్, ఢిల్లీ దర్వాజా తదితర ప్రాంతాల్లో త్రీడీ మ్యాపింగ్‌ను ఏర్పాటుచేయాలని చెప్పారు. జంటనగరాల్లో 155 సెంటర్లలో సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో కళాబృందాలను ఏర్పాటుచేయాలన్నారు. సమాచారశాఖ ఆధ్వర్యంలో బోనాల విశిష్టత షార్ట్ ఫిలింలు ఆయా థియేటర్లలో, రైల్వేస్టేషన్లలో, బస్‌స్టేషన్లలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని తలసాని సూచించారు. మహంకాళి, ఓల్డ్ సిటీ బోనాల ఉత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఇమ్లిబన్, జూబ్లీ బస్‌స్టేషన్లలో, కాచిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లలో దేవాదాయశాఖ తరపున ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి ఐకేరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి 48,939 మంది హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న ఎంసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి ఇప్పటివరకు 48,939 మంది విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్టు కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. ఇప్పటివరకు 54,836 మంది స్లాట్‌బుక్ చేసుకున్నారని, తొలివిడుత ధ్రువపత్రాల పరిశీలన బుధవారం ముగుస్తుందని చెప్పారు. వెబ్‌కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు, కళాశాలల్లో రిపోర్టు చేయాల్సిన తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

## కొనసాగుతున్న ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల ఖరారు

- అసంతృప్తి ఉంటే అప్పీలుకు రూ.లక్ష రుసుం చెల్లించాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కోర్టుకు వెళ్లిన 81 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో వచ్చే మూడేండ్లకు బోధన ఫీజుల ఖరారు ప్రక్రియ సోమవారం ప్రారంభం కాగా బుధవారం వరకు కొనసాగనున్నది. తర్వాత కోర్టుకువెళ్లిన మరో వంద ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు కూడా ఫీజులను ఖరారుచేయనున్నట్టు టీఏఎఫ్‌ఆర్సీ అధికారులు తెలిపారు. ఫీజులఖరారు నేపథ్యంలో యాజమాన్యాలను పిలిపిస్తూ.. వారి ప్రతిపాదనలను ఆడిటర్ సాయంతో ఫీజుల కమిటీ పరిశీలిస్తున్నది. యాజమాన్యాలు, టీఏఎఫ్‌ఆర్సీకి ఏకాభిప్రాయం వచ్చాక ఖరారుచేసిన ఫీజుల అంగీకారపత్రాలపై సంతకాలు తీసుకుంటున్నారు. ఫీజులపై అసంతృప్తిగా ఉండే యాజమాన్యాలు అప్పీల్ చేసుకోవాలంటే రూ.లక్ష రుసుం చెల్లించాలని తెలిపారు.

# ఢిల్లీలో మొదలైన బోనాల సంబురాలు

- తెలంగాణభవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన టీఆర్‌ఎస్ ఎంపీలు
- నేడు ఇండియాగేట్ నుంచి అమ్మవారి ఊరేగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో బోనాల సంబురాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధ, గురువారాల్లో ఈ వేడుకలు కొనసాగనున్నాయి. 111 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా 111 ఫొటోలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను టీఆర్‌ఎస్ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, కే కేశవరావు, రంజిత్‌రెడ్డి, పీ రాములు, బీబీ పాటిల్ ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ బోనాలు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు అందరికీ తెలిసేలా రాష్ట్ర ప్రభుత్వం, లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయ కమిటీ సంయుక్తంగా ఢిల్లీలో ఐదో సంవత్సరం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భాగ్యనగరాన్ని మూసీ వరదలతో ముంచెత్తిననాడు.. నిజాం ప్రభువు పూజలతో అమ్మవారు శాంతించిన చరిత్ర లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయానికి ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల పండుగలకు సమ ప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. బుధవారం సాయంత్రం ఇండియా గేట్ నుంచి తెలంగాణభవన్ వరకు అమ్మవారి ఊరేగింపు, అనంతరం అమ్మవారి ఘట స్థాపన ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొన్నది. గురువారం అమ్మవారికి పోతురాజులు, శివసత్తులు ఆహ్వానం పలుకుతారని, అనంతరం పట్టు వస్త్రాలు, బోనం సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపింది. కార్యక్రమంలో ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి రామచంద్రు తేజావత్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో బోనాల ఉత్సవ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీలు కేకే, నామా నాగేశ్వర్‌రావు, రంజిత్‌రెడ్డి, రాములు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి రామచంద్రు తేజావత్

### గడ్కరీని కలిసిన బీబీ పాటిల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రోడ్ల విస్తరణపై చర్చించారు. అనంతరం బీబీ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ.. బోధన్-మద్నూర్ జాతీయ రహదారికి, సంగారెడ్డి- నాందేడ్- అకోలా, ఎన్‌హెచ్ 63 బాంబే- నిజామాబాద్ రహదారికి అనుసంధానం లేదని, హైవే 1, హైవే 2, మీడియం, ప్రియారిటీ రోడ్లను నాయ్ కింద అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రిని కోరినట్టు చెప్పారు. 33 కిలోమీటర్ల పొడవైన బోధన్ -మద్నూర్ హైవే డీపీఆర్ ఇంకా పెండింగ్‌లో ఉన్న విషయాన్ని వివరించినట్టు తెలిపారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. సోయాబీన్ సమస్యపై కేంద్రమంత్రి నరేంద్రసింగ్ థోమర్‌ను కలువనున్నట్టు ఎంపీ చెప్పారు.





JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
BLEKINGE INSTITUTE OF TECHNOLOGY (BTH) SWEDEN
Kukatpally, Hyderabad - 500 085, Telangana State, India

NOTIFICATION Dt: 02.07.2019

Applications are invited for admissions into 5 Years (B.Tech., M.Tech and M.Sc) Integrated Double Degree Masters Programs (IDDMP) for 10+2 qualified students to study in JNTUH and Blekinge Institute of Technology, Sweden in ECE and CSE for the academic year 2019-20. Admissions will be based on JEE (Mains) 2019 / TS EAMCET 2019 Ranks.

| | |
|---|---|
| Last Date for submission of application | 13.07.2019 by 4.00 pm |
| With late fee of Rs. 1,000/- | 16.07.2019 by 4.00 pm |

For application and more details please visit: www.jntuh.ac.in Sd/- REGISTRAR

Contact: Mr. Brij Gopal (M): 09440295365 / Cusumer Care No - 9490729833

Introducing PANKKH

In Pursuance of the Notification No S.O. 2900 (.E) Dated : 24th Oct, 2015, Issued by department of Agriculture and co-operation, Ministry of Agriculture, Govt of India. Sanx Fertilisers Private Limited (Developed, Formulated, Procure & Marketed by: Vijayshri Agro Chemicals Pvt Ltd D.No-14-6-407/A, Begum Bazar, Hyderabad -12 T.S.) hereby notifies that it intend to introduce the following grades of 100% water soluble mixture of fertilizers.

| S N. | Name of the Brand | Name of the Grade | N | P2 O5 | K2 O | Other Common Specifications by Weight |
|---|---|---|---|---|---|---|
| 1 | Pankkh | NPK 19-19-19 | 19 | 19 | 19 | Percent by Weight, maximum |
| 2 | Pankkh | NPK 28-28-00 | 28 | 28 | 00 | I. Moisture 0.5; II. Total Chloride 1.5; III. Matter insoluble in Water 0.5 |
| 3 | Pankkh | NPK 00-00-50 | 00 | 00 | 50 | IV. Sodium as NaCl 0.5; V. Lead (as Pb) 0.003 |
| 4 | Pankkh | Potassium Schoenite | | | | VI. Calmium (as Cd) 0.0025; VII. Arsenic (as As) 0.01 |

Sanx Fertilisers Private Limited -120/A, Mirzapur Village, Poddur Mandal, Vikarabad Dist-501 102 T.S. Email: sales@sanxfertilisers.com, Consumer Care No- 7013435811

KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES TELANGANA STATE

NOTIFICATION FOR MQ ADMISSIONS

Application forms online are invited from NEET-UG-2019 qualified candidates for admission into MBBS/BDS Courses for Management Quota in Private Medical & Dental colleges in the State of Telangana under KNRUHS from 03-07-2019 to 10-07-2019.

For detailed notification refer to www.knruhs.in, www.knruhs.telangana.gov.in

Dated: 02-07-2019 REGISTRAR

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ గురుకుల విద్యాలయాల రిక్రూట్‌మెంట్ బోర్డ్ (TREIRB)

డిగ్రీ కళాశాల అధ్యాపకుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ప్రకటన

డిగ్రీ అధ్యాపకుల (DLలు) డిమాన్‌స్ట్రేషన్ DSS భవన్, మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ వద్ద **08-07-2019** నుండి ప్రారంభమవుతుందని తెలియజేయడమైనది.
డిమాన్‌స్ట్రేషన్ కోసం ఎంపిక చేసిన అభ్యర్థుల హాల్ టిక్కెట్ నంబర్లు మరియు సబ్జెక్ట్ వారీగా DLల డిమాన్‌స్ట్రేషన్ తేదీలు పోర్టల్ www.treirb.telangana.gov.inలో **02-07-2019** నుండి లభిస్తాయి.
ఎవరైన అభ్యర్థి డిమాన్‌స్ట్రేషన్‌కు హాజరుకాకపోతే, అతను/ఆమె తదుపరి ఎంపిక ప్రక్రియ కోసం అన్ని హక్కులు కోల్పోతారు
ఏవైనా వివరాల కోసం క్యాంప్ ఇన్‌చార్జ్‌ని సెల్ నం. 8309436806పై సంప్రదించవచ్చును.
ప్రదేశం: హైదరాబాద్ సం/- ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్
తేది: 02-07-2019 చైర్మన్, TREIRB, హైదరాబాద్
DIPR R.O.No. 214 PP/CL/Advt/1/2019-20 తేది: 02-07-2019

## కంచెవేసి భూమిని ఆక్రమించిండ్రు

- అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు
- ఇబ్రహీంపట్నం మండలం, సీతారాంపేటలో వృద్ధరైతు ఆవేదన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తన తండ్రినుంచి వారసత్వంగా వచ్చిన 38 గుంటల భూమిలో 30 గుంటలను కంచె వేసి ఆక్రమించారని.. రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఓ వృద్ధరైతు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం సీతారాంపేట గ్రామానికి చెందిన సాత్రి చిన్న వెంకయ్యకు తండ్రి సాత్రి మైసయ్య నుంచి సర్వే నంబర్ 289/14లో 38 గుంటల భూమి వారసత్వంగా సంక్రమించింది. అంతేమొత్తంలో ఆయన పాలివాండ్లకు కూడా వచ్చినా వారు దానిని అమ్ముకున్నారు. కానీ, భూమి మీద మమకారంతో చిన్న వెంకయ్య 38 గుంటల భూమిని అలాగే ఉంచుకున్నారు. ఈ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు పాత పాస్‌పుస్తకం జారీచేశారు. అయితే కొత్త పాస్‌పుస్తకం మాత్రం ఇవ్వలేదు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని చిన్న వెంకయ్య వాపోయారు. ఇదే అదనుగా భూమి పక్కనే ఉన్న సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి తనకున్న 38 గుంటలలో 30 గుంటలకు కంచెవేసి ఆక్రమించారని పేర్కొన్నారు. తనకు 8 గుంటలు మాత్రమే మిగిల్చారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను అడిగితే.. అసలు తనకు భూమే లేదంటూ తిప్పిపంపిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. అధికారుల అండతో సుదర్శన్‌రెడ్డి తన భూమి కబ్జాచేశారంటూ రైతు చిన వెంకయ్య నమస్తే తెలంగాణ ధర్మగంటను ఆశ్రయించారు.

# కొత్త పాస్‌పుస్తకానికి రూ. 20 లక్షలు

- సొమ్ములు ముట్టినాకే పని..
- పత్రాలు అన్నీ ఉన్నా బీ క్యాటగిరీలోకి భూమి

కాటారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ లీలలు

- మద్దతుగా తాసిల్దార్ దత్తుప్రసాద్
- పత్రాల కంటే పొజిషన్‌పై ఉండటమే ముఖ్యమంటున్న దత్తు

భూపాలపల్లి జిల్లా కాటారం రైతుకు చుక్కలు చూపిస్తున్న అధికారులు


ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, సుందర్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు తన ముగ్గురు కూతుళ్లకు 185, 186, 187, 188 సర్వే నంబర్లలో ఉన్న 31 ఎకరాల భూమిని పసుపు కుంకుమ కింద పట్టా చేయించి ఇచ్చారు. ఉమాదేవి (భర్త వెంకటేశ్వర్‌రావు)కి 11.37 ఎకరాలు ఇవ్వగా.. అందులోనుంచి 24 గుంటలను ఇతరులకు అమ్మేశారు. మిగతా 10.11 ఎకరాల భూమి ఆమె పేరిటే ఉన్నది. ఇందుకు సంబంధించి అన్ని పత్రాలు కూడా ఉన్నాయి. పహాణీ, 1 బీ, పాత పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంలో ఉమాదేవికి కొత్త పాస్‌పుస్తకం రాలేదు. దీంతో బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. తాసిల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సహా ఎవరూ వారి సమస్యను పరిష్కరించలేదు. ఉమాదేవి దంపతులు అనారోగ్యం పాలు కావడంతో వారి కొడుకు రాజ నర్సింహారావు కొత్త పాస్‌పుస్తకం కోసం పోరాటం చేస్తున్నారు. నర్సింహారావు కథనం ప్రకారం.. 15 ఏండ్ల క్రితం తన తల్లిపేరిట ఉన్న భూమికి పక్కనే ఉన్న సర్వేనంబర్ 94లోని భూమిని ప్రభుత్వం పేదలకు పంపిణీచేసింది. 2009లో కొందరు వారి హద్దులను దాటుకొని ఉమాదేవి భూమిలోకి వచ్చి సాగుచేయగా.. ఆమె కుమారుడు నర్సింహారావు అప్పటి కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. కలెక్టర్ సూచన మేరకు తాసిల్దార్ అప్పటి ఎస్ఐ సమక్షంలో పరిశీలించి 185, 186, 187, 188 సర్వే నంబర్లలో ఉన్న భూమి తమకు చెందినదేనని స్పష్టంచేశారు. 94 సర్వేనంబర్ వరకు మాత్రమే ప్రభుత్వం ఇచ్చిన భూములని తేల్చి చెప్పారు. అయినా కొందరు వినకుండా వాళ్ల భూమిని సాగుచేస్తూ వచ్చారు. ఇదే విషయమై మరోసారి తాసిల్దార్‌ను కలిసి వివరించినా తమకు న్యాయం జరుగకపోవడంతో మళ్లీ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు నర్సింహారావు తెలిపారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని వాపోయారు. భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా, భూమి వివాదంలో ఉన్నదంటూ పార్ట్ బీలో చేర్చారు. దీంతో కొత్త పాస్‌పుస్తకం రాకుండా ఆగిపోయింది. సమస్య పరిష్కారం కోసం ఆర్ఐ ప్రవీణ్‌కుమార్‌ను కలువగా తనకు రూ. 20 లక్షలు ఇస్తేనే పని అవుతుందని, లేదంటే ఎక్కడికి వెళ్లినా న్యాయం జరుగదని తెగేసి చెప్పినట్టు నరిసింహారావు పేర్కొన్నారు. కొత్త పాస్‌పుస్తకం కోసం ఆర్ఐ లంచం అడుగుతున్నారని తాసిల్దార్ నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం జరుగలేదని, పైగా ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ సూటిపోటి మాటలతో తమను వేధిస్తున్నారని తెలిపారు. 'మీరెక్కడికి వెళ్లినా.. ఎవరిని కలిసినా.. నేను చేయనిదే ఏ పని కాద'ని బెదిరిస్తున్నారన్నారు. ఇదే విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరేందుకు ధర్మగంట ప్రతినిధులు సంప్రదించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

### ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాం

'మా భూమికి సంబంధించి అన్ని రెవెన్యూ పత్రాలు ఉన్నాయి. ఆ భూమిమీద మూడుసార్లు బ్యాంక్‌లోన్ కూడా తీసుకున్నాం. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన అనంతరం కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేదు. ఇదేమిటని అధికారులను అడిగితే ఏ ఒక్కరూ సరైన సమాధానం చెప్పకుండా తిప్పుకొంటున్నారు. మా భూమి సమస్య గురించి ప్రజావాణిలో ఆరుసార్లు ఫిర్యాదు చేశాం. పాత, కొత్త కలెక్టర్లంతా మా సమస్యకు పరిష్కారం చూపాలని కింది అధికారులకు సూచించినా న్యాయం జరుగలేదు. మండల తాసిల్దార్ దత్తుప్రసాద్, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ చులకనగా మాట్లాడుతూ, అవసరం లేని డాక్యుమెంట్లు తీసుకురావాలంటూ కాలయాపన చేస్తున్నారు. పని కావాలంటే రూ. 20 లక్షలు డబ్బు ఇవ్వాల్సిందే అంటూ ఆర్ఐ దారుణంగా ప్రవర్తిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌కు లంచం గురించి ఫిర్యాదు చేశాను. నేను ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. మా తండ్రికి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగే ఓపికలేదు. అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటారు. అమ్మకు పెద్దగా అవగాహన లేదు. అధికారులను ప్రాధేయపడినా మాకు న్యాయం జరగటం లేదు. చివరి ప్రయత్నంగా ధర్మగంటను ఆశ్రయించాం. న్యాయం చేయాలని కోరుతున్నాం.

- రాజనరసింహరావు, బాధితురాలు ఉమాదేవి కుమారుడు

### రెండునెలలైతే పోతా..



ఈ సమస్య పదేండ్ల క్రితం నాటిది. నేను అప్పుడు లేను. ఎన్నికల ముందు ఇక్కడికి వచ్చాను. ఇంకో రెండునెలలైతే పోతాను. కొత్తగా వచ్చేవాళ్లు చూసుకుంటారు. అయినా పొజిషన్ ముఖ్యం గానీ, రెవెన్యూ రికార్డులు కాదు. రికార్డులు ఉంటే సరిపోతుందా.. పొజిషన్‌లో ఉంటేనే భూమి. ఈ భూమి విషయంలో వాళ్ల కుటుంబ సమస్య కూడా ఉన్నది. ఇప్పటికిప్పుడు పరిష్కారం కావాలంటే ఎలా.. ఆర్ఐ లంచం అడిగారన్న విషయం నాకు చెప్పలేదు. ఒకవేళ ఫిర్యాదుచేస్తే విచారిస్తా.

- దత్తు ప్రసాద్, కాటారం తాసిల్దార్

## మా మాట!

### తీరుతున్న రైతుల సమస్యలు



ధర్మగంట పేరిట 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న కథనాల ద్వారా రైతులకు న్యాయం జరుగుతున్నది. ఎంతో మంది రైతులు తమ భూసమస్యల పరిష్కారం కోసం ధర్మగంటను ఆశ్రయిస్తున్నారు. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తున్నది. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందిస్తుండటం సంతోషకరం. రెవెన్యూ ప్రక్షాళన కూడా చాలా అవసరం.

- గోసుల అనంతగిరి, చందంపేట, నల్లగొండ జిల్లా

### ప్రభుత్వ కృషి అభినందనీయం



రైతుల సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. గతంలో రైతులు తమ భూముల వివరాలను పాస్‌పుస్తకాల్లో ఎక్కించుకోవడానికి అధికారుల చుట్టూ తిరిగేవారు. అయినా స్పందన ఉండేదికాదు. ప్రస్తుతం ప్రభుత్వ చర్యలతో సంబంధిత అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. భూరికార్డుల ప్రక్షాళనలోనూ చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి.

- మహ్మద్ హబీబ్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

### రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం



ఏండ్లుగా పేరుకుపోయిన రైతుల భూసమస్యలు ధర్మగంట ద్వారా పరిష్కారమవుతున్నాయి. ఎంతో మందికి న్యాయం జరుగుతున్నది. రైతుల భూములకు సంబంధించిన వివరాలను సత్వరమే ఆన్‌లైన్ చేయడం ద్వారా రైతుబంధు, రైతు బీమా పథకాలు అర్హులందరికీ వర్తిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు సైతం సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు.

- చామకూరి లింగారెడ్డి, బట్టుగూడెం సర్పంచ్, పెద్దవూర మండలం, నల్లగొండ జిల్లా

### సీఎం కేసీఆర్ నిర్ణయాలు భేష్



అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూశాఖ ప్రక్షాళనకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నడుంబిగించడం శుభపరిణామం. ధర్మగంటతో రైతుల భూసమస్యలు ఒక్కొక్కటిగా తీరుతున్నాయి. ఏండ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారంకాని సమస్యలకు పరిష్కారం లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 'నమస్తే తెలంగాణ' రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపింది. గతంలో పట్టించుకోని అధికారులే పిలిచి మరీ భూసమస్యలు పరిష్కరిస్తున్నారు.

- ఇస్లావత్ లచ్చా, మామిడాల, తిరుమలగిరి మండలం, సూర్యాపేట జిల్లా

### భూమి శిస్తు ఉంటే.. పట్టా మార్పిడి వీలుకాదు



ఏండ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా మూలకు పడ్డ సమస్యలు 'నమస్తే తెలంగాణ'లో వస్తున్న ధర్మగంట శీర్షికతో వెలుగులోకి వస్తున్నాయి. కిందిస్థాయి అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ, నిర్లక్ష్యం కారణంగానే చాలామంది రైతులకు అన్యాయం జరిగింది. చాలా గ్రామాల్లో మోఖా మీద ఒక రైతు ఉంటే, మరో రైతుకు పట్టా ఇచ్చారు. హక్కుదారుడిఖజ భూమిశిస్తు కట్టే అవకాశం కల్పించాలి. దాని ద్వారా మరొకరి పేరు మీదకు పట్టా మార్పిడికి అవకాశం ఉండదు. వీఆర్వోలు ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి, అనుభవదారుడికి ప్రొసీడింగ్, పట్టాలు అందజేయాలి. రెవెన్యూవ్యవస్థను ప్రక్షాళన చేయాలని భావిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ధర్మగంట ద్వారా చాలా మంది రైతులు మేలు పొందారు.

- ప్రహ్లాదరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, వీణవంక, కరీంనగర్ జిల్లా

### రైతుల పాలిటవరం



'ధర్మగంట' కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ వ్యవస్థలో చలనం వచ్చింది. అధికారులు పనులుచేస్తున్నారు. అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఈ కార్యక్రమం రైతులపాలిట వరంగా మారింది. వివిధ జిల్లాల్లో చోటుచేసుకున్న రెవెన్యూ లోపాలపై వస్తున్న ప్రత్యేక కథనాల ద్వారా రెవెన్యూ డిపార్ట్‌మెంటులో ఉన్న బూజును దులిపినట్టవుతున్నది. రైతులు ఎన్నో ఏండ్లుగా తిరిగి తిరిగి బేజారయ్యారు. రేపు రాపొండ్రి. ఏం పని లేదా? అని అన్నోళ్లే ఇప్పుడు కూర్చుండబెట్టి పనులుచేస్తున్నారు.

- నల్లగొండ తిరుపతిగౌడ్, గౌడ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

## పట్టాభూమిని కబ్జా భూమి అంటున్నరు


ధర్మగంటతో సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన శామల వెంకటేశం



**సంస్థాన్‌నారాయణపురం:** తాను పాఠశాల భూమిని కబ్జాచేశానంటూ కొంతమంది చేస్తున్న ప్రచారంలో వాస్తవంలేదని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన శామల వెంకటేశం పేర్కొన్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. పుట్టపాకలో ప్రభుత్వ పాఠశాల మంజూరు కోసం గ్రామానికి చెందిన మర్రి బుచ్చిరాములుకు చెందిన సర్వే నంబర్ 282లో 3.20 ఎకరాల భూమితోపాటు మరో 1.20 ఎకరాల భూమిని కలిపి మొత్తం ఐదెకరాలు చూపించారు. అందులో 3.20 ఎకరాల్లో పాఠశాల భవనాలు నిర్మించి, దానిచుట్టూ ప్రహరీ నిర్మించారు. మిగతా 1.20 ఎకరాల భూమిని యజమాని ఇతరులకు విక్రయించడంతో ఇప్పుడు అక్కడ వారు గృహాలు నిర్మించారు. కాగా కబ్జాకు గురైనట్టు ఆరోపణలున్న సర్వే నంబర్ 282ఈ లోని 30 గుంటల భూమిని తాను పాతికేండ్ల క్రితం దేప చంద్రారెడ్డి దగ్గర కొనుగోలుచేసి, రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్టు శామల వెంకటేశం తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఆర్డీవో సర్వేచేసి, దానిని తన భూమిగానే నిర్ధారించి, సర్టిఫికెట్ కూడా ఇచ్చారని చెప్పారు. అయితే కొంతమంది కావాలని తనను అబాసుపాలు చేయడం కోసం పట్టాభూమిని కబ్జా భూమిగా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నారని వెంకటేశం వాపోయారు.

## పట్టా వచ్చింది.. రైతుబంధు రాలేదు

రెవెన్యూ అధికారుల నిర్వాకంతో నష్టపోయిన రైతు


కలెక్టర్‌కు అందజేసిన దరఖాస్తు కాపీని చూపుతున్న బాధిత రైతు

**కూసుమంచి:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన చింతలపూడి శ్రీనివాసరావుకు కూసుమంచి మండలం చేగొమ్మ రెవెన్యూ శివారులో వివిధ సర్వే నంబర్లలో పూర్వీకుల నుంచి సంక్రమించిన 8.06 ఎకరాల సాగుభూమి ఉన్నది. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా, రెవెన్యూ అధికారులు 2018 ఏప్రిల్ 24న ఈ భూమికి కొత్తపట్టాదారు పాస్‌పుస్తకం జారీచేశారు. అదే ఏడాది మే నెలలో రూ.33 వేల రైతుబంధు చెక్కును పాస్‌పుస్తకంతోపాటే అందించారు. ఇంతవరకు బాగానే ఉన్నది. గత యాసంగిలో రైతుబంధు సాయాన్ని ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా రైతుల బ్యాంకు ఖాతానంబర్లు సేకరించి నేరుగా వారి ఖాతాల్లో వేయించింది. సీజన్ గడిచిపోయినా తనకు రైతుబంధు డబ్బు.. ఖాతాలో పడకపోవడంతో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించారు. వారు చూస్తాం.. చేస్తామంటూ కాలం గడిపారు. తాజాగా ప్రస్తుత వానకాలానికి కూడా ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుబంధు సాయాన్ని అందించింది. అప్పుడు కూడా రాకపోవడంతో శ్రీనివాసరావు అధికారులను కలిశారు. శ్రీనివాసరావుకు ఉన్న 8 ఎకరాల భూమిలో 1.23 ఎకరాలకు డిజిటల్ సంతకం కానందున మొత్తం రైతుబంధు సహాయం నిలిపివేసినట్టు ఏఈవో ధ్రువీకరించారు. దీంతో తన సమస్య పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్‌లకు బాధితుడు వినతిపత్రాలు అందజేశారు. అధికారుల తప్పిదంవల్ల తాను రెండు విడుతల్లో రూ.70 వేల రైతుబంధు సాయాన్ని కోల్పోయానని వాపోయారు.

## ఇతరులకు పట్టాచేశారని రైతుల ధర్నా


చింతపల్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట కిరోసిన్ సీసాలు పట్టుకుని ధర్నా నిర్వహిస్తున్న బాధిత రైతు కుటుంబ సభ్యులు

**మాల్:** తమకు చెందిన భూములను రెవెన్యూ అధికారులు ఇతరులకు అక్రమంగా పట్టాచేశారంటూ నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం పలువురు రైతులు వారి కుటుంబసభ్యులతోకలిసి ధర్నాచేశారు. తమ సమస్య పరిష్కరించకుంటే ఆత్మహత్యకు పాల్పడతామంటూ కిరోసిన్ సీసాలను పట్టుకొని మరీ ఆందోళనకు దిగారు. చింతపల్లికి చెందిన ఎర్ర శాయన్న, నర్సింహ, రాములు ముగ్గురు అన్నదమ్ములు. వీరికి తండ్రి పాపయ్య నుంచి గ్రామంలోని 429 సర్వేనంబర్‌లో 2.31 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. ఈ భూమిని అన్నదమ్ములు ఉమ్మడిగానే సాగుచేసుకొంటున్నారు. పదిహేనేండ్ల క్రితం శాయన్న బతుకుదెరువుకోసం గ్రామం వదిలివెళ్తూ తన వంతు భూమిని కూడా ఇద్దరు అన్నదమ్ములు రాములు, నర్సింహ సమానంగా పంచుకోమని చెప్పాడు. ఈ ఇద్దరు అన్నదమ్ముల్లో రాములుకు నలుగురు కుమారులు కాగా నర్సింహకు ఇద్దరు కుమారులున్నారు. వీరు కూడా తమకు ఉన్న భూమిని రెండేండ్ల క్రితం వరకు కూడా పంచుకోకుండా ఉమ్మడిగానే సాగుచేశారు. రికార్డుల ప్రక్షాళన సమయంలో రాములు చిన్నకొడుకు ఎర్ర జంగన్ తమ ఉమ్మడి ఆస్తిగా ఉన్న భూమిలోంచి 1.15 ఎకరాలను తన పేరు మీదకు మార్చుకొన్నాడు. ఏడాది క్రితం రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మిగిలిన భూమిని సైతం తన పేరుమీదికి మార్చుకొన్నాడు.

విషయం తెలుసుకున్న మిగతా వారసులు ఉమ్మడి ఆస్తిని ఒక్కరికే ఎలా పట్టా చేస్తారంటూ రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా అధికారులు పట్టించుకోలేదు. దీంతో మంగళవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఇప్పటికీ భూమిని తామే సాగు చేసుకుంటున్నామని, తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తాతల భూమిని ఒక్కరికే ఎలా పట్టా చేస్తారని ప్రశ్నించారు. తమ సమస్యను పరిష్కరించకుంటే ఇక్కడే ఆత్మహత్యకు పాల్పడతామని తమ వెంట తెచ్చుకున్న కిరోసిన్ సీసాలతో ఆందోళన నిర్వహించారు. తాసిల్దార్ సునంద వారితో మాట్లాడుతూ, గతంలో ఉన్న అధికారులు భూమి బదలాయించిన విషయం తనకు తెలియదని, సదరు భూమికి సంబంధించిన ఆధారాలు తీసుకొస్తే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## నీడ కోల్పోతున్న గుడిబండ వంశీయులు!

- పాతవి ఉన్నా కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వని అధికారులు
- 1/70 యాక్ట్ అంటూ కాలయాపన
- కబ్జాచేసేందుకు సర్పంచ్ ప్రయత్నాలు

'ధర్మగంట'ను ఆశ్రయించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాఘవాపురం గ్రామానికి చెందిన గుడిబండ రామచంద్రరావు

**సుజాతనగర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామాన్ని ఒకప్పుడు గుడిబండ వంశీయులు శాసించారు. ఇప్పటికీ ఆ గ్రామంలో జరిగే జాతరకు ఆ వంశీయులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. గతంలో గుడిబండ వంశీయులు ఎంతోమందికి సహాయం చేస్తుండేవారు. అలాంటి వంశం ఇప్పుడు గ్రామంలో నిలువ నీడలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఆ వంశీయుల ఆస్తులన్నీ పోగా.. ఇప్పుడు గ్రామంలో కేవలం ఎకరం 19 గుంటల భూమి మాత్రమే మిగిలింది. దీనిని కూడా కొందరు పెద్దలు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారు. దీంతో గుడిబండ వంశీయుల వారసుడు గుడిబండ రామచంద్రరావు 'ధర్మగంట'ను ఆశ్రయించి తన గోడు వెళ్లబోసుకొన్నారు. రాఘవాపురం గ్రామం 1/70 యాక్ట్ పరిధిలోనే ఉన్నది. కానీ గుడిబండ వంశీయులకు తాతముత్తాతల కాలం నుంచి పట్టా భూములు ఉన్నాయి. అన్నదమ్ములు వాటాలు పంచుకొని, కొందరు విక్రయించగా, మరికొందరు సేద్యం చేస్తున్నారు. సర్వేనంబర్లు 1/1అ లో 16 గుంటలు, 1/1ఇ లో 15 గుంటలు, 1/2అ లో 9 గుంటలు, 2అ లో 8 గుంటలు, 3అ/1 లో 5 గుంటలు, 46ఇ లో 6 గుంటలు వెరసి మొత్తం 1.19 ఎకరాల భూమి వారికి వారసత్వంగా మిగిలింది. ఈ భూములకు 2012 డిసెంబర్ 4వ తేదీన పట్టా నంబర్ 239తో పాస్‌బుక్, టైటిల్‌డీడ్ ఇచ్చారు. మీ సేవా పహాణీలు కూడా వారి పేరు మీదనే ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం సాదాబైనామా ప్రకటించడంతో వాటికోసం దరఖాస్తు చేసుకొని, రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. కొత్త పాస్‌పుస్తకాలు మంజూరు చేయకుండా రెవెన్యూ అధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారని రామచంద్రరావు వాపోయారు. పాత పాస్‌బుక్‌లు ఉన్నా ఇప్పుడు 1/70 అంటూ తాత్సారం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయం తెలుసుకొన్న ఆ ఊరి పెద్దమనిషి ఒకరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గతంలో పనిచేసిన తాసిల్దార్ సహాయంతో పాస్‌బుక్‌లు పొందాడని వివరించారు. దీనిపై ఆర్డీవోకు కూడా ఫిర్యాదుచేశామన్నారు. సర్పంచ్‌కు పాత పాస్‌బుక్‌లు చూపిస్తే అవి పనికిరావంటూ ఎద్దేవాచేశారన్నారు. రాఘవాపురంలో ప్రతి రెండేండ్లకు జరిగే జాతరకు ఆనవాయితీగా తమ వంశీకులను పిలిచి, ఊరంతా తమతోనే జాతర చేయిస్తారని, అలాంటి తమకు నేడు గ్రామంలో నిలువనీడ లేకుండాపోయిందని రామచంద్రరావు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న 1.19 ఎకరాల భూమిని కూడా కబ్జా చేయడానికి సర్పంచ్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 1/70 యాక్ట్ కంటే ముందునుంచే అక్కడ తమకు తాతముత్తాల కాలం నుంచి భూములు ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమకు పాస్‌బుక్‌లు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై సుజాతనగర్ తాసిల్దార్ చల్లా ప్రసాద్‌ను వివరణ కోరగా.. రాఘవాపురంలోని పై సర్వే నంబర్ల పాస్‌బుక్‌లు ఎవరికీ జారీచేయలేదని, ఇంకా వాటి మీద డిజిటల్ సంతకాలు కూడా కాలేదని తెలిపారు. డిజిటల్ సంతకాలు కాకుండా పాస్‌బుక్‌లు ఎవరికీ ఇచ్చేదిలేదన్నారు.


గుడిబండ రామచంద్రరావు

## సౌదీ ప్రమాద మృతదేహాలను రప్పించడంలో సహకరించండి

విదేశాంగమంత్రికి హోంమంత్రి మహమూద్‌అలీ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హైదరాబాద్‌వాసుల మృతదేహాలను స్వస్థలానికి రప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌ను రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్రమంత్రికి లేఖ రాశారు. జూన్ 28న సౌదీలో జెడ్డా నుంచి మదీనా వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇబ్రహీం తల్లిదండ్రులు, సోదరుడు మృతిచెందారని, వారి మృతదేహాలను హైదరాబాద్‌కు తరలించేందుకు సహకారం అందించాలని కోరారు.

## సర్వాయిపేటకోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట కోట, చెరువుల సముదాయం, ముఖద్వారం, చారిత్రక కోటలను రాష్ట్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. సర్వాయిపేట కోట మైనింగ్ మాఫియా వల్ల విధ్వంసానికి గురవుతున్నదని గౌడ ఐక్యవేదిక, సర్దార్ సర్వాయిపాపన్నగౌడ ఐక్యవేదిక, రాష్ట్ర గౌడ ఐక్యసంఘాల నాయకులు మంగళవారం సచివాలయంలో మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, సర్వాయిపాపన్న గీతకార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పెంటయ్యగౌడ్, అధ్యక్షుడు కలర్ సత్తన్న, మోకుదెబ్బ ఉపాధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి ఉపాధ్యక్షుడు భిక్షపతిగౌడ్ ఉన్నారు.



మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గౌడ ఐక్యవేదిక, సర్దార్ సర్వాయిపాపన్నగౌడ ఐక్యవేదిక, రాష్ట్ర గౌడ ఐక్యసంఘాల నాయకులు

## పదోన్నతులు ఇవ్వండి

మంత్రి ఎర్రబెల్లిని కోరిన పంచాయతీ కార్యదర్శులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 13 ఏండ్లుగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు ఇవ్వాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. మంగళవారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సంఘం నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. 500 నుంచి 10 వేల జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడులుగా విభజించి, వాటి ఆధారంగా పంచాయతీలకు కార్యదర్శులను బదిలీ చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి కోరారు. మంత్రిని కలిసినవారిలో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ రాజు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.



## ఎవరు అడ్డుకొన్నా ఆగేది లేదు

- సచివాలయం, అసెంబ్లీ భవన నిర్మాణాలను ఆపబోం
- ప్రజలకేది మంచో సీఎంకు తెలుసు
- కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉంది: మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ నేతలు తలకిందులుగా తపస్సు చేసినా సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను సీఎం కేసీఆర్ ఆపబోరని, ప్రజలకు ఏది మంచో ఆయనకు బాగా తెలుసు అని ఎక్సైజ్ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కాంగ్రెస్ ధర్నాలకు భయపడి కేసీఆర్ ఒక్క ఇంచు కూడా వెనక్కి తగ్గరని అన్నారు. కొత్త నిర్మాణాలపై కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతూ.. కొత్తగా నిర్మించే అసెంబ్లీ, సెక్రటేరియట్ భవనాలపై కాంగ్రెస్ నాయకులు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మించతలపెట్టిన అసెంబ్లీ, సచివాలయం భవనాలు తెలంగాణ ఐకాన్‌గా నిలువనున్నాయన్నారు. ప్రతిపక్ష హోదా పోవడం, జెడ్పీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడంతో కాంగ్రెస్ నేతలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉన్నదని, అందుకే ఆ పార్టీ నుంచి నాయకులు ఒక్కొక్కరుగా బయటికి వస్తున్నారని చెప్పారు. ప్రజలు ఛీ కొట్టినా కాంగ్రెస్ నాయకుల తీరు మారడంలేదన్నారు. ఆ పార్టీ నేతలు అన్ని ప్రభుత్వ పథకాలను అనుభవిస్తూనే.. సీఎం కేసీఆర్‌పై క డుపుమంట ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.

**ప్రజల నోట్లో మట్టికొట్టారు**

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులు జరుగకుండా కోర్టుల్లో కేసులువేసి, పాలమూరు జిల్లా ప్రజల నోట్లో మట్టికొట్టారని కాంగ్రెస్ నేతలపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే వాళ్ల పని అని, ప్రాజెక్టులు అడ్డుకోవడానికి వివిధ కోర్టుల్లో కేసులు వేసిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలపై అదే పంథా కొనసాగిస్తున్నారని చెప్పారు.



మంగళవారం సచివాలయం నుంచి జిల్లా పశువైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

## ఇస్టా ఉపాధ్యక్షుడిగా కేశవులు

- భారత్ నుంచి తొలిసారిగా ఎన్నికైన తెలంగాణ బిడ్డ
- 2022లో ఆయనకే లభించనున్న ఇస్టా అధ్యక్ష పదవి
- విత్తనపరిశ్రమలో తెలంగాణ కీలకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ విత్తన పరీక్ష ప్రమాణాల సంస్థ (ఇస్టా) ఉపాధ్యక్షుడిగా తెలంగాణ విత్తన ధ్రువీకరణ, విత్తనాభివృద్ధి సంస్థల డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు ఎన్నికయ్యారు. 1924లో ఏర్పాటైన ఈ సంస్థలో భారతదేశానికి ఉపాధ్యక్ష స్థానం లభించడం ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల అవసరాలకు అనుగుణంగా విత్తనచట్టాలను, పాలసీలను, మార్కెట్‌లో విత్తన నాణ్యత, నియంత్రణ, సరఫరా తదితర అంశాలపై తీసుకొనే నిర్ణయాల్లో ఇస్టా కార్యనిర్వహణ కమిటీ ప్రధానపాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ విత్తన సదస్సు-2019 ముగింపు సందర్భంగా మంగళవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఇస్టా అత్యున్నత కమిటీలో ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌తోపాటు ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. డాక్టర్ కేశవులు ఉపాధ్యక్ష పదవిలో 2022 వరకు కొనసాగుతారు. ఆ తర్వాత సంస్థ నిబంధనల ప్రకారం ఇస్టా అధ్యక్షుడిగా కేశవులు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇస్టా సంస్థ శత వార్షికోత్సవం కేశవులు నేతృత్వంలోనే జరిగే అవకాశం ఉన్నది. వచ్చే అంతర్జాతీయ విత్తన సదస్సు 2022ను న్యూజిలాండ్‌లో నిర్వహించాలని తీర్మానించారు.

**ఇస్టా నూతన కార్యవర్గం**

ఇస్టా కార్యనిర్వాహణ కమిటీ అధ్యక్షుడిగా స్టీవ్ జోన్స్ (కెనడా), ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కే కేశవులు (భారత్), కార్యవర్గసభ్యులుగా క్లెయిడ్ ముజాజు (జింబాబ్వే), వాలేరి కొకరేల్ (బ్రిటన్), శైల్వీ డ్యూకోర్నో (ఫ్రాన్స్), బెర్టా కిల్లర్‌మన్ (జర్మనీ), రిటా జేకే నెల్లీ (ఇటలీ), రూయెల్ సీ గెస్ముండో (ఫిలిప్పీన్స్), లీనా పియెట్‌ల్లా (ఫిన్లాండ్), ఇగ్నోషియో అర్నషియాగ (అర్జెంటీనా) ఎన్నికయ్యారు.



ఇస్టా సదస్సుకు హాజరైన ప్రతినిధులతో ఇస్టా నూతన ఉపాధ్యక్షుడు డాక్టర్ కేశవులు. రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి

**ఉపాధ్యక్ష పదవి వల్ల తెలంగాణకు కలిగే లాభాలు**

మనదేశంలో విత్తన పరీక్షా విధానాలను, విత్తన పరీక్షా కేంద్రాలను మెరుగుపరచుకోవడానికి, వాటికి అంతర్జాతీయ గుర్తింపు సాధించడానికి, మన విత్తనాలను వివిధ దేశాలకు ఎగుమతి చేసుకోవడానికి, వివిధ దేశాల నుంచి పెట్టుబడులను రప్పించడానికి ఇస్టా ఉపాధ్యక్ష పదవి దోహదపడుతుంది. విత్తన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించడానికి, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి స్థానం పొందడానికి ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ విత్తన శాస్త్రవేత్తలు, ప్రతినిధులతో వర్క్‌షాప్‌లు, ట్రైనింగ్‌లు నిర్వహించడానికి, తద్వారా అధునాతన పరిజ్ఞానం అందిపుచ్చుకోవడానికి, ఇతర దేశాలతో భాగస్వామ్యం నెరపడానికి ఇదొక మంచి అవకాశం. విత్తనచట్టాలను, పాలసీలను రైతులకు లాభదాయకంగా రూపొందించేలా ఈ పదవి ఉపయోగపడనున్నది.

### రాష్ట్రానికి గర్వకారణం: మంత్రి నిరంజన్‌రెడ్డి

ఇస్టా వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కేశవులు ఎన్నికవ్వడం భారతదేశానికి, తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కేంద్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ అగర్వాల్, రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి పేర్కొన్నారు. వివిధ దేశాలకు దీటుగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ సంస్థల ద్వారా విత్తనోత్పత్తి చేసి, భారతదేశ అవసరాలను తీర్చడమే కాకుండా వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్న తరుణంలో ఈ కమిటీలో స్థానం సంపాదించడం తెలంగాణకు ఎంతో గర్వకారణమన్నారు.

### రైతుబిడ్డ కేశవులు



ఇస్టా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ కే కేశవులు సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఇంటర్మీడియట్ వరకు వరంగల్ జిల్లాలో చదువుకొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరు అగ్రికల్చరల్‌వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పోస్ట్ డాక్టరల్ పరిశోధనలు చేసి విత్తనశాస్త్రంలో అనుభవం గడించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ వర్సిటీలో విత్తనశాస్త్ర విభాగానికి అధిపతిగా పనిచేశారు. యూఎస్‌ఏఐడీ భాగస్వామ్య సభ్యుడిగా ఈస్ట్ ఆఫ్రికన్, సౌత్ ఆసియా దేశాల్లో విత్తన పద్ధతుల అభివృద్ధిపై అధ్యయనం చేశారు. విత్తననిల్వలో ఆహారధాన్యాల నష్టాన్ని తగ్గించేవిధంగా అంతర్జాతీయంగా అంగీకరించిన వినూత్న సాధారణ విత్తననిల్వ పద్ధతులను కనిపెట్టారు. ఇస్టా, ఓఈసీడీ నేపాల్ అగ్రికల్చర్ రీసెర్చ్ కౌన్సిల్, ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సీఏబీఐ ఆఫ్రికా, సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీస్ ఆఫ్ టాంజానియా, బంగ్లాదేశ్‌తో కలిసి విత్తనరంగం అభివృద్ధికి కృషిచేశారు.

## ప్రతి పశువుకు వ్యాక్సినేషన్

- పశువైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీవాలను వ్యాధుల బారినుంచి కాపాడేందుకు అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. మంగళవారం సచివాలయం నుంచి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ మంజువాణి, గొర్రెలు-మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ రాంచందర్‌తో కలిసి జిల్లా పశువైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 22 వరకు పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు నిర్వహించే టీకాల పంపిణీ కార్యక్రమం పోస్టర్‌ను మంత్రి తలసాని ఆవిష్కరించారు. ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాల వేసేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పశువులకు టీకాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి, దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. టీకాలు వేసే కార్యక్రమంలో ప్యారావెట్, గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. తొలకరి వర్షాలతో జీవాలు వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నందున పశువైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తలసాని ఆదేశించారు.

**ఈము రైతులకు రుణమాఫీ చేసేలా చూస్తా..**

ఈము రైతుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ జరిగేలా చూస్తానని మంత్రి హామీఇచ్చారు. రాష్ట్రంలో ఈము పక్షుల పెంపకం రైతులను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ఈము ఫార్మర్స్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ పెంచాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల ఈము రైతులు మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మంత్రి తలసానికి వినతిపత్రం సమర్పించారు. రైతులకు వందశాతం రుణమాఫీ చేయాలని అభ్యర్థించారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు పాపిరెడ్డి, భరత్, బాలకృష్ణ, శ్రీనివాసరావు, తారక్‌నాథ్, శారద, లక్ష్మి, హేమలత, కృష్ణ తదితరులు ఉన్నారు.

## గొర్రెలు, బర్రెలకు ఇక టెండర్లు

- సబ్సిడీ అమలుకు కొత్త విధానం!
- అధికారులు, పశువైద్యాధికారుల చేతివాటానికి చెక్
- లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీకి యోచన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సబ్సిడీ గొర్రెలు, బర్రెల పథకాన్ని టెండర్ల ద్వారా అమలుచేయాలని పశుసంవర్ధకశాఖ యోచిస్తున్నది. ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ఇప్పుడున్న విధానం ద్వారా పథకంలో అవినీతి చోటుచేసుకుంటున్నట్టు పశుసంవర్ధకశాఖ సర్వేలో వెల్లడయింది. జిల్లాల్లో కొందరు వెటర్నరీ అధికారులు, దళారుల ప్రమేయంతో పథకం పక్కదారి పట్టినట్టు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ పథకాన్ని ఎలాగైనా పకడ్బందీగా అమలుచేయాలని ప్రభుత్వం పశుసంవర్ధకశాఖను ఆదేశించింది. దీంతో అధికారులు రెండురకాల ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకుతీసుకొచ్చారు. టెండర్ల ద్వారా బర్రెలు, గొర్రెలను లబ్ధిదారులకు సబ్సిడీపై ఇవ్వడం, మరొకటి సబ్సిడీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లోకి వేయడం ద్వారా అక్రమాలకు చెక్ పెట్టడం. రెండోవిడుత గొర్రెల పంపిణీ విషయంలో ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి తెలిపారు.

**పంపిణీలో అక్రమాలను గుర్తించిన సర్కారు**

గొల్ల, కుర్మల అభివృద్ధి కోసం 2018 జూన్‌లో సీఎం కేసీఆర్ గొర్రెల అభివృద్ధి పథకాన్ని ప్రారంభించారు. రెండేండ్లలో 7.28 లక్షల మంది అర్హులకు 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున 1.53 కోట్ల గొర్రెలు పంపిణీ చేయా ల్సి ఉన్నది. లిస్ట్-ఏలో 3,67,020 మందికి 77 లక్షల గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండగా, 70.10 లక్షలు పంపిణీ చేశారు. లిస్ట్-బీలో 3,61,854 మందికి 75.98 లక్షల గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండగా.. 5.84 లక్షల గొర్రెలను పంపిణీచేశారు. ఈ పథకం అమలుపై సర్వే చేపట్టిన పశుసంవర్ధకశాఖ పలు అక్రమాలను గుర్తించింది. పశువైద్యుల సాయంతో లబ్ధిదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి గొర్రెలు కొనుగోలుచేసే క్రమంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నట్టు అధికారుల దృష్టికి వచ్చింది. అక్రమాలకు పాల్పడిన ఆరుగురు పశువైద్యులను గతంలో సస్పెండ్ కూడా చేశారు.

**బర్రెల పథకంలోనూ..**

విజయ డెయిరీ, నల్లగొండ-రంగారెడ్డి, ముల్కనూరు మహిళా డెయిరీ, కరీంనగర్ డెయిరీల్లోని 2.13 లక్షల మంది సభ్యులకు ఒక్కొక్కరికి ఒక పాడిబర్రెను సబ్సిడీపై అందజేయాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన పథకాన్ని అధికారులు, దళారులు భ్రష్టుపట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. పశువైద్యులు నిబంధనలకు విరుద్ధంగా బర్రెలను పాడి రైతులకు అంటగడుతున్నారని, రెండు మూడులీటర్లు కూడా పాలివ్వని వాటిని కూడా వారితో కొనిపిస్తున్నట్టు తేలింది. దళారులు, అధికారుల నిర్వాకంతో పాడిరైతులు లబోదిబోమంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 వేలకు మించని బర్రెను కొందరు పశువైద్యులు రూ.80 వేలకు కొనిపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో బర్రెకు వైద్యులకు రూ.10వేలకు పైగానే కమీషన్ లభిస్తున్నట్టు, బర్రెలను తీసుకువచ్చే వాహనాల ఖర్చు కూడా రైతులతోనే పెట్టిస్తూ స్పష్టమయింది. వివిధ జిల్లాల నుంచి సర్కారుకు ఫిర్యాదులు కూడా అందాయి. దీంతో సర్కారు అక్రమాలను అరికట్టేందుకు రంగంలోకి దిగింది.

## పరిహారం చెక్కులు సమర్పించండి: హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మల్లన్నసాగర్ పరిధిలో ఉపాధి కోల్పోతున్న వేములఘాట్ గ్రామస్థుల పేరిట జారీచేసిన పునరావాస ప్యాకేజీ చెక్కులను న్యాయస్థానానికి సమర్పించాలని హైకోర్టు మంగళవారం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. భూముల్లో పనులు చేపట్టకుండా అడ్డుకోవాలని సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్ గ్రామానికి చెందిన పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేయగా, ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

## ఢిల్లీలో జనన, మరణాల నమోదు చీఫ్ రిజిస్ట్రార్ల సదస్సు రేపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలోని ఎన్డీఎంసీలో గురువారం నిర్వహించే జనన, మరణాల నమోదు చీఫ్ రిజిస్ట్రార్ల వార్షిక సదస్సులో రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్, జనన, మరణాల నమోదు చీఫ్‌రిజిస్ట్రార్ జీ శ్రీనివాస్‌రావు హాజరు కానున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సదస్సులో పాల్గొనేందుకు ఆయనకు అనుమతిస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

## రాష్ట్రంలో వానలకు ఢోకాలేదు

- జూలై, ఆగస్టులో వర్షాలకు లోటుండదు
- సగటులో 97% శాతం వరకు కురుస్తాయి
- రెండ్రోజులు ఓ మోస్తరు వానలు కురువొచ్చు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి వెల్లడి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రెండునెలలపాటు వర్షాలకు ఢోకా ఉండదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. జూన్‌లో వర్షపాతం సగటు కంటే 33 శాతం తక్కువగా నమోదైనా.. జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు ఆశాజనకంగా ఉంటాయని కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ రెండునెలల్లో లోటు వర్షపాతం ఉండకపోవచ్చని, ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్నందున సగటు వర్షపాతంలో 97 శాతం వరకు వానలు కురువొచ్చని మంగళవారం 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. రుతుపవనాలు ఆలస్యంగా రావడం, అరేబియా సముద్రంలో ఏర్పడిన 'వాయు' తుఫాన్ కారణంగా గాలిలో తేమ లేకపోవడం వల్ల రుతుపవనాల కదలికకు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. దీంతో జూన్‌లో సాధారణంగా 129.2 మిల్లీమీటర్లు కురువాల్సిన వర్షం 87.1 మి.మీ.కు పరిమితం కాగా, ఒక్క హైదరాబాద్‌లో మాత్రం సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని చెప్పారు. హైదరాబాద్‌లో సగటు వర్షపాతం 96.4 మి.మీ.కాగా, 113.77 మి.మీ. వర్షం కురిసిందని, ఇది సాధారణం కంటే 11 మి.మీ. ఎక్కువని ఆయన తెలిపారు. మధ్య భారతంలో ఈసారి సగటులో వందశాతం వర్షపాతం నమోదవుతుందని, మధ్యభారతానికి తెలంగాణ దగ్గరగా ఉన్నందున దాని ప్రభావంతో రాష్ట్రంలోనూ మంచి వర్షాలు పడుతాయని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సీజన్‌లో తెలంగాణ సగటు వర్షపాతం 755 మి.మీ. కాగా, 720 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని వెల్లడించారు.



**బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం**

ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఆగ్నేయ జార్ఖండ్, దానిని అనుకుని ఉన్న ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో కేంద్రీకృతమైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇది మరింత బలపడి వాయుగుండంగా మారనున్నదని చెప్పారు. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని, పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురువొచ్చని తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు నిజామాబాద్, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

### గ్రేటర్ హైదరాబాద్‌లో మూడ్రోజులు వానలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల మూడ్రోజులపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అల్పపీడన, ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళవారం పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 21 డిగ్రీలు, గాలిలో తేమ 86 శాతంగా నమోదైంది.



మంగళవారం బీసీ కమిషన్ ఎదుట తమ కళారూపాన్ని ప్రదర్శిస్తున్న గౌడశెట్టి కళాకారులు. చిత్రంలో కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయులుగౌడ్, జూలూరు గౌరీశంకర్ కూడా ఉన్నారు.

## జీవనోపాధిలేక అవస్థలు పడుతున్నాం

- రిజర్వేషన్లు కల్పించి ఆదుకోవాలని బీసీ కమిషన్‌కు సంచార కులాల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీవనోపాధిలేక కుటుంబాలను పోషించుకునేందుకు అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బైల్‌కమ్మర, ఘిసాడి, బైటకమ్మర, గౌడజెట్టి సంచార కులాల ప్రతినిధులు బీసీ కమిషన్‌కు విన్నవించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయులుగౌడ్, జూలూరు గౌరీశంకర్, సభ్య కార్యదర్శి అనితారాజేంద్రన్.. కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కులాలవారు తమ వృత్తులను కమిషన్ ముందు ప్రదర్శించారు. బీసీలుగా గుర్తించి తమను ఆదుకోవాలని వినతిపత్రాలు సమర్పించారు.

## ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో అపశ్రుతి

షేక్‌పేట్‌లో క్రేన్ పల్టీకొట్టడంతో డ్రైవర్ దుర్మరణం

మృతుడి కుటుంబానికి రూ.13 లక్షల పరిహారం ప్రకటించిన మేయర్



ఘటనా స్థలంలో గురుప్రీత్ సింగ్ మృత దేహం



షేక్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో క్రేన్ పల్టీ కొట్టిన దృశ్యం

**మెహిదీపట్నం:** షేక్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో అపశృతి దొర్లింది. మంగళవారం క్రేన్ పల్టీ కొట్టడంతో క్రేన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. గోల్కొండ సమీపంలోని షేక్‌పేట్ నాలా వద్ద ఎస్సార్డీపీలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ క్రేన్ డ్రైవర్‌గా పంజాబ్‌కు చెందిన గురుప్రీత్‌సింగ్ (45) పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున పనులుచేస్తుండగా బరువు అధికం కావడంతో క్రేన్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. క్రేన్ గురుప్రీత్‌సింగ్‌పై పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

**ఘటనా స్థలాన్ని సందర్శించిన కమిషర్**

ఘటనా స్థలాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్ సందర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి నగర మేయర్ బొంతు రామ్మోహన్ రూ.13 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు. రోడ్డు కుంగడానికి గల కారణాలు, క్రేన్ పడిపోయిన సందర్భంగా సమీపంలోని పిల్లర్లకు ఏమైనా నష్టం జరిగిందా అనే అంశంపై జేఎన్టీయూ, లేదా ఐఐటీ ద్వారా సమగ్ర అధ్యయనం చేయిస్తామని జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ తెలిపారు. కాంట్రాక్టు సంస్థపై కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు.



ఏసీబీ అధికారుల అదుపులో వికారాబాద్ జూనియర్ అసిస్టెంట్ సురేశ్

## సహోద్యోగి మరణిస్తే.. ఫైల్ పంపేందుకు లంచం!

రూ.20 వేలు డిమాండ్‌చేసిన ఎక్సైజ్ జూనియర్ అసిస్టెంట్

వికారాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సురేశ్

**వికారాబాద్, నమస్తే తెలంగాణ:** సహోద్యోగి మరణిస్తే.. ఆ ఫైల్‌ను హైదరాబాద్‌కు పంపేందుకు 20 వేలు లంచం అడిగాడు ఎక్సైజ్‌శాఖలోని ఓ జూనియర్ అసిస్టెంట్. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్య.. కష్టాల్లోనూ రూ.8 వేలు ఇచ్చారు. మంగళవారం మరో రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లాలో ఎక్సైజ్‌శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాజా హుస్సేన్ మూడునెలల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. పింఛన్, ఉద్యోగం, ఇతర శాఖాపరమైన ప్రయోజనాలను ఇప్పించాలని కోరుతూ ఖాజా హుస్సేన్ భార్య రెండునెలల కిందట అక్కడి కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఖాజా హుస్సేన్ మృతికి సంబంధించిన నివేదికను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి పంపేందుకు రూ.20 వేలు లంచం ఇవ్వాలని వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సురేశ్ డిమాండ్‌చేశాడు. నానా కష్టాలు పడి ఖాజా హుస్సేన్ భార్య రూ.8 వేలు సురేశ్‌కు లంచంగా ఇచ్చారు. మిగతా మొత్తం కూడా ఇవ్వాలడంతో హుస్సేన్ సోదరుడు షేక్ ఫయాజ్ హుస్సేన్.. ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫయాజ్ హుస్సేన్ నుంచి మంగళవారం సురేశ్ రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ధారూరు మండలానికి చెందిన సురేశ్.. కొత్త జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అంతకు ముందు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పనిచేశాడు.



కార్పొరేటైజేషన్‌కు నిజమైన అర్థం తెలుసుకోలేకపోవటమే ప్రైవేటీకరణ దిశగా పడుతున్న తొలి అడుగు. బీజేపీ దేశ సంపదను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముతున్నది. ఇది వేలాదిమందిని నిరుద్యోగులుగా మార్చివేస్తుంది. రైల్వేలో ప్రైవేటీకరణ దేశ సంపదను కొద్దిమంది ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పటమే.

**సోనియా గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్**

ఆకాశ్ విజయ్ వర్గియా దాడి ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలతచెందారు. పార్టీ పేరును దెబ్బతీసేలా ప్రజల్లో అహంకారపూరితంగా ప్రవర్తించే హక్కు ఎవరికీ లేదు. ఇలాంటి ఘటనలు అంగీకారయోగ్యం కాదు. ఎంతటివారైనా అధికార దుర్వినియోగానికి పాల్పడితే సహించేది లేదు.

**రాజీవ్ ప్రతాప్ రూఢీ, బీజేపీ సీనియర్ నేత**



### చరిత్రలో నేడు



**1908**

ముజఫర్‌పూర్ బాంబుదాడి కుట్రకేసులో రాజద్రోహ నేరంపై బాలగంగాధర్ తిలక్ అరెస్టు.

**1917**

పెట్రోగ్రాడ్‌లోని రాజప్రసాదాన్ని ముట్టడించిన రష్యా కార్మికులు.





**1928**

లండన్‌లో మొదటిసారి కలర్ టెలివిజన్‌ను తయారుచేసిన జాన్ లోగి బెయిర్డ్.

బ్రిటన్‌లో భాగంగా ఉన్నప్పటికీ స్కాట్‌లాండ్, ఉత్తర ఐర్లాండ్, వేల్స్‌లకు అధికారాల బదిలీ జరిగింది. అయితే స్కాట్‌లాండ్ పార్లమెంటుకు జరిగినంతటి వికేంద్రీకరణ మిగతా ప్రాంతాల చట్టసభలకు జరుగలేదు. ఇందుకు కారణం ఆయా సందర్భాల్లో వచ్చిన డిమాండ్లు. యూకేలోని అతి పెద్ద ప్రాంతం ఇంగ్లండ్. 85 శాతం నివసించే ఇంగ్లండ్‌కు ఎటువంటి అధికార వికేంద్రీకరణ జరుగలేదు. ఇంగ్లండ్ బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఉంటే మిగతా ప్రాంతాలు వ్యతిరేకంగా ఉన్నాయి. ఇప్పుడు యూకేకు ప్రమాదం స్కాట్‌లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ నుంచి కాదు, ఇంగ్లండ్ నుంచే!.

**ది గార్డియన్**

ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుచేయకపోవడం చట్టబద్ధ పాలనకు, రాజ్యాంగానికి భంగం కలిగించడమే. ఇటీవలికాలంలో సుప్రీం కోర్టు ఎన్నో తీర్పులు, ఆదేశాలు ఇచ్చింది. వాటిని రాజ్యాంగం, చట్టాల ప్రకారం అమలుచేయమని ఆదేశించింది. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనివల్ల శాసన, కార్యవర్గ, న్యాయశాఖల మధ్య సమతుల్యం దెబ్బతింటుంది. 246 ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై న్యాయస్థానం ఆదేశాలిస్తే 38 మాత్రమే అమలుచేసింది. 1, 603 వ్యక్తిగత వ్యాజ్యాలపై ఆదేశాలిస్తే ప్రభుత్వం ఐదు మాత్రమే అమలుచేసింది.

**ది హిమాలయన్ టైమ్స్**



# జల సంరక్షణ

కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు దేశాన్ని పట్టిపీడిస్తున్న నీటి ఎద్దడి, కరువు పరిస్థితుల పట్ల దృష్టి సారించడం హర్షణీయం. దేశవ్యాప్తంగా ఉన్న జలవనరులను సంరక్షించుకొని, వాన నీటిని ఒడిసిపట్టుకొనేలా ప్రజలను చైతన్యం చేసేందుకు 'జల శక్తి అభియాన్' పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నీటి పొదుపు, సంరక్షణ, పునర్వినియోగాలను ప్రోత్సహించే దిశగా దేశవ్యాప్త కార్యాచరణను ప్రకటించింది. కొన్నేండ్లుగా దేశవ్యాప్తంగా కరవు విలయతాండవం చేస్తున్నది. అధికారిక అధ్యయనాల ప్రకారమే పది రాష్ర్టాలు తీవ్ర నీటి కొరతతో సతమతమవుతున్నాయి. జనాభాలో 25 శాతం మందికి నీటి లభ్యతే జీవన్మరణ సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా నీటి కటకటను ఎదుర్కొంటున్న 256 జిల్లాలు, 1592 బ్లాకుల్లో రెండు దశల్లో ప్రచార కార్యాచరణోద్యమాన్ని కేంద్రం సోమవారం ప్రారంభించింది. రెండు దశల్లో నిర్వహించే ఈ కార్యక్రమం- ఈ నెల జూలై 1 నుంచి సెప్టెంబ ర్ 15 వరకు మొదటిదశ, అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు మలిదశ ఉంటుంది. జల వనరుల సంరక్షణ కోసం కేంద్రం నుంచి జిల్లాస్థాయి వరకు పర్యవేక్షణ అధికారులను నియమించి, బాధ్యతలు అప్పగించింది. అయితే ఇందులో తొలి దశ కార్యక్రమాలు నిర్వహించే రాష్ర్టాల్లో తెలంగాణ ఉండటం, అందులో తెలంగాణలోని 24 జిల్లాలు, 137 బ్లాకులు ఇందుకు ఎంపిక కావటం ముదావహం.

జలవనరులు, నీటి లభ్యత అంశంపై అధ్యయనం చేసిన కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ) ప్రకారం దేశంలో 91 ప్రధానమైన రిజర్వాయర్లున్నాయి. వీటన్నింటిలో మున్నెన్నడూ లేనివిధంగా కనిష్ఠ స్థాయిలో 22 శాతం మాత్రమే నీరున్నది. పశ్చిమ భారతంలోని గుజరాత్, మహారాష్ట్రలో ఉన్న 27 ప్రధాన రిజర్వాయర్లలో 13 శాతం నీరు ఉన్నది. దక్షిణాదిన తెలంగాణ, ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడులోని 31 రిజర్వాయర్లలో కూడా కనిష్ఠంగా 13 శాతం మాత్రమే నీరున్నది. కనీస అవసరాలు తీర్చటానికి అవసరమైన నీరు నిల్వ లేకున్న పరిస్థితుల్లోనే సీడబ్ల్యూసీ రిజర్వాయర్లలోని నీటి నిల్వల గురించి హెచ్చరికలు చేయటం పరిపాటి. ఈ క్రమంలోనే అత్యవసరాలు, తాగునీటి కోసం మాత్రమే రిజర్వాయర్లలోని నీరు వినియోగించుకోవాలని సూచిస్తుంది. కొన్ని రాష్ర్టాలలోనైతే నీటి కరువు తీవ్రరూపం దాల్చింది. రాజస్థాన్‌లోని 128 గ్రామాలు, 12 నగరాలకు నాలుగు రైళ్లలో తాగునీటిని తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రైళ్లు జోధ్‌పూర్ నుంచి 60 లక్షల లీటర్ల నీటిని నాలుగు లక్షల మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేరవేశాయి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మూడు కోట్ల మంది నీటి ట్యాంకర్లపై ఆధారపడి జీవిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 254 జిల్లాల్లో రెండున్నర లక్షల గ్రామాల్లో తీవ్ర నీటి కరువున్నది. ఈ ఎండాకాలంలో తమిళనాడులో ఏర్పడిన కరువు ఉండనే ఉన్నది. నీటి ట్యాంకర్లకు రక్షణగా పోలీసులను పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి ట్యాంకర్ల దగ్గర ఏర్పడే గొడవలను నియంత్రించేందుకు 144 సెక్షన్ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే నీటి సమస్య తీవ్రతను ఊహించుకోవాల్సిందే.

> **కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జలశక్తి అభియాన్‌కు ఎన లేని ప్రాధాన్యం ఉన్నది. ఈ కార్యక్రమంలో తలపెట్టినవిధంగా సర్వత్రా జలవనరులను సంరక్షించటంతో పాటు రైతులు తక్కువ నీటితో వ్యవసాయాన్ని చేసేవిధంగా ప్రోత్సహిస్తారు. అలాగే పట్టణాల్లో వ్యర్థ జలాలను పునర్వినియోగంపై దృష్టిసారించి ఆ నీటిని పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు వినియోగించటానికి సరఫరా చేస్తారు.**

నీటి కరువుకు ప్రకృతిని నిందించేకన్నా మానవ తప్పిదాలను గుర్తించడం మంచిది. అడవుల నరికివేతతో పర్యావరణంలో సమతుల్యత దెబ్బతిని సాధారణ వర్షపాతం కూడా నమోదు కావడం లేదు. అతివృష్టి, అనావృష్టితో ప్రజలు కరువు బారిన పడుతున్నారు. హేతుబద్ధత లేని నగరీకరణ కారణంగా కూడా నీటి వనరులన్నీ ఆక్రమణలకు గురై భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఒకప్పుడు ప్రతి వ్యక్తికి 14,180 లీటర్ల నీరు అందుబాటులో ఉండేది. కానీ ఇప్పుడు అది 35 శాతం తగ్గిపోయి 5,120 లీటర్లకు పడిపోయింది. అందుకే ప్రజలు కనీస అవసరాలు తీరక కష్టాలు పడుతున్నారు. రక్షిత మంచినీరు అటుంచి రోజువారీ అవసరాలు తీర్చుకోలేక రోగాలబారిన పడుతున్న దుస్థితి ఉన్నది. ఇదే పరిస్థితి కొనసాగితే సామాజిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉన్నది. ఈ స్థితిలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జలశక్తి అభియాన్‌కు ఎనలేని ప్రాధాన్యం ఉన్నది. ఈ కార్యక్రమంలో తలపెట్టినవిధంగా సర్వత్రా జలవనరులను సంరక్షించటంతో పాటు రైతులు తక్కువ నీటితో వ్యవసాయాన్ని చేసేవిధంగా ప్రోత్సహిస్తారు. అలాగే పట్టణాల్లో వ్యర్థ జలాలను పునర్వినియోగంపై దృష్టిసారించి ఆ నీటిని పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు వినియోగించటానికి సరఫరా చేస్తారు. గ్రామాలు, నగరాలన్నింటా పల్లపు ప్రాంతాలను గుర్తించి జలవనరులను అభివృద్ధి చేస్తూ భూగర్భ జలాలను పెంపొందించటానికి కృషి చే స్తారు. ఈ కార్యక్రమాలన్నింటా కేంద్రం తరపున నిరంతర పర్యవేక్షణ ఉంటూనే, స్థానిక ప్రభుత్వాల తోడ్పాటు, స్వచ్ఛంద, పౌరసంస్థలు, ప్రజలను భాగస్వాములను చేయటం ఆహ్వానించదగిన పరిణామం. కానీ రాష్ర్టాల క్రియాశీల భాగస్వామ్య ప్రాధాన్యాన్ని గుర్తించడం అవసరం. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ, హరితహారం కార్యక్రమాలన్నీ కేంద్రం తలపెట్టిన జలశక్తి అభియాన్‌ను పరిపూర్తిచేసేవే. కాబట్టి జలవనరుల అభివృద్ధి కోసం రాష్ట్రం చేపడతున్న అన్ని కార్యక్రమాలకు కేంద్రం తగువిధంగా అండగా నిలువాలి.

వ్యవసాయం



**సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

# విశ్వవిపణికి మన విత్తనాలు

**గత కొన్నేండ్లుగా భారతీయ విత్తన పరిశ్రమలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు రైతులు తాము వేసిన పొలంలో నుంచి సేకరించిన విత్తనాలనే వాడేవారు. నేడు అత్యంత నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వ్యవసాయ ముఖచిత్రమే మారిపోయింది. ఫలితంగా నేడు భారతదేశం ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద విత్త న పరిశ్రమగా ఎదిగింది. ప్రపంచ విత్తన మార్కెట్‌లో 4.4 శాతంతో అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రెజిల్ తర్వాత స్థానం భారత్‌ది.**

దేశంలో చిన్న, సన్నకారు రైతులున్న రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం ఏర్పడేనాటికి వ్యవసాయం సంక్షోభంలో, రైతాంగం అప్పుల్లో, అవస్థలలో కూరుకుపోయి ఉన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఐదేండ్లలో తీసుకున్న వ్యవసాయ సానుకూల విధానాలతో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ ఎదిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా పథకాలు నేడు ప్రపంచ వ్యవసాయిక దేశాలకు ఆదర్శం. దేశంలోని ప్రతి రాష్ట్రం రైతులకు మేలు చేయాలనే దిశగా ఆలోచిస్తే మొదటగా వారికి కనిపిస్తున్నవి ఈ రెండు పథకాలే. ఇక వర్షాధార సాగుకుతోడు నిలకడలేని అస్పష్ట వర్షపాతం తదితర బాధల నుంచి రాష్ట్ర రైతులను విముక్తి చేసేందుకు కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి వరదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారు. గత ప్రభుత్వాలు పెండింగ్‌లో పెట్టిన పలు ప్రాజెక్టులను పూర్తి చేయడం మూలంగా ఇప్పటికే సాగువిస్తీర్ణం పెరిగింది. వరి ఉత్పాదకత పెరిగింది. ఫలితంగా రాష్ట్ర అవసరాలు తీరగా మిగులు ఉత్పత్తులను సద్వినియోగపరుచుకోవాలి. ధరలు పడిపోయి రైతులు నష్టపోకుండా చూడాలి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చాలా అనువైన వాతావరణం ఉన్నది విత్తన పంటల సాగుకే.

ప్రపంచంలో విత్తనోత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతాల్లో అమెరికాలో ని అరిజోనా రాష్ట్రం తర్వాత తెలంగాణ మాత్రమే. ఇప్పటికే భారత విత్త న రాజధానిగా ఉన్న తెలంగాణను ప్రపంచ విత్తన కేంద్రంగా తీర్చిదిద్దే విధంగా తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలున్నాయి. ఇందుకు అధిక విస్తీర్ణంలో సాగవుతూ లాభసాటిగా లేని పంటల స్థానంలో పంటల వైవిధ్యీకరణ కింద విత్తన పంటల సాగుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందించనున్నది. ఈ పంటల సాగుకోసం రైతులకు సాంకేతికంగా, నైపుణ్యపరంగా, విధానాల పరంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నది.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నాణ్యమైన ఆహార సరఫరా పెరుగాలి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా 771 కోట్లు. 2050 నాటికి 990 కోట్లకు చేరుతుందని అంచనా. ఈ మేరకు ఆహారధాన్యాల, ఇతర పంటల డిమాండ్ 70 శాతానికి పైగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశా ల్లో నాణ్యమైన విత్తనం అందుబాటులోకి రావాలి. తరుగుతున్న సహజ వనరులు, సాగునీటి అందుబాటు, సరాసరి తలసరి కమత విస్తీర్ణం నేపథ్యంలో పెరుగాల్సిన వ్యవసాయ ఉత్పత్తిలో అత్యంత కీలకం విత్తనం. ప్రపంచంలోని అన్ని దేశాలకు నాణ్యమైన విత్తనం అవసరం. ప్రస్తుతం ప్రపం చ విత్తన వ్యాపారం విలువ 60 బిలియన్ డాలర్లు. అందులో భారత విత్తన వ్యాపారం విలువ 2.5 బిలియన్ డాలర్లు. ప్రపంచంలోని మిగతా దేశాలు విత్తన వాడకం, ఎగుమతుల విషయంలో మేలుగానే ఉన్నాయి. అయితే ఇతర ఆసియా దేశాలు, ఆఫ్రికా ఖండపు దేశాల్లో నాణ్యమైన విత్తన కొరత ఉన్నది. సగం హైబ్రిడ్ కూరగాయల విత్తనాలు, 70 శాతం ఆహారధాన్యాల విత్తనాలను ఆసియా దేశాలకు భారత్ నుంచి సరఫరా అవుతున్నాయి. ప్రపంచ విత్తన మార్కెట్‌లో వృద్ధిరేటుతో పోలిస్తే ఆసి యా విత్తన పరిశ్రమలో వృద్ధిరేటు 10-12 శాతం. ఇది పారిశ్రామీకరణ వృద్ధిరేటు కంటే ఎక్కువ. ఇక ఆఫ్రికా దేశాల విషయానికొస్తే ఆ ఖండపు ప్రాంతీయ ఆర్థిక పరిస్థితిలో 50 శాతం వ్యవసాయ, అనుబంధ వ్యాపారాలదే. 70 శాతానికి పైగా వారి జీవనోపాధికి వ్యవసాయం మీద ఆధార పడి ఉన్నారు. అందులో ఎక్కువమంది చిన్న, సన్నకారు రైతులే. ప్రస్తుతం 80-90 శాతం ఆఫ్రికా రైతులు సాధారణంగా, సాంప్రదాయంగా ఉత్పత్తిచేసిన విత్తనమే వాడుతున్నారు. ఒక వంతు రైతులకు మాత్రమే నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉన్నది. ఇదే సమయంలో భారత, ఆఫ్రికా ఖండపు వాతావరణ పరిస్థితులు దాదాపు ఒకేవిధంగా ఉంటాయి. కాబట్టి మన దగ్గర పండే అన్నిపంటల విత్తనాలను మనం ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయగలం. ఇప్పటికే మన విత్తనాల కు అక్కడ మేలైన ఆదరణ ఉన్నది.

కొన్నేండ్లుగా భారతీయ విత్తన పరిశ్రమలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు రైతులు తాము వేసిన పొలంలో నుంచి సేకరించిన విత్తనాలనే వాడేవారు. నేడు అత్యంత నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వ్యవసాయ ముఖచిత్రమే మారిపోయింది. ఫలితంగా నేడు భారతదేశం ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద విత్త న పరిశ్రమగా ఎదిగింది. ప్రపంచ విత్తన మార్కెట్‌లో 4.4 శాతంతో అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రెజిల్ తర్వాత స్థానం భారత్‌ది. ప్రపంచ విత్తన మార్కెట్‌లో భారత విత్తన మార్కెట్ వృద్ధిరేటు 17 శాతంగా ఉన్నది.

> **అంతర్జాతీయ విత్తన పరీక్షా సంస్థ అయిన ఇస్టా వారి ప్రయోగశాలలలో విత్తన నాణ్యత పరీక్షించిన తర్వాతనే ఇతర దేశాలకు ఎగుమతికి అవకాశం ఇస్తాయి. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా విత్తనాలను ఎగుమతి చేయాలంటే ఇస్టా నాణ్యత ప్రమాణాలు మన రైతులు అందుకోవాలి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సదస్సు లో ఆ ప్రమాణాలు అందిపుచ్చుకునేలా వివిధ సాంకేతిక తరగతులు, నిపుణులకు అవగాహన కల్పించడం జరిగింది. అంతర్జాతీయ విత్తన సదస్సు తొలిసారి ఆసియాలో అందునా తెలంగాణలో జరుగడం గర్వకారణం.**

1988 విత్తన అభివృద్ధి నూతన విధానం, 2002 జాతీయ విత్తన విధానం అమలు చేయడంతో విత్తన పరిశోధన, అభివృద్ధి, నాణ్యత, ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు మెరుగుపడటం ద్వారా విత్తన పరిశ్రమ ఎదుగుదలకు తోడ్పడ్డాయి. తెలంగాణలో విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, నిపుణులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, నిల్వ, రవాణా సౌకర్యాలు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో దేశానికి అవసరం ఉన్న విత్తనాలలో 60 శాతం పైగా మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. చల్లని వాతావరణం మూలంగా వరి, మక్క, సజ్జ, కంది, పెసర, శనగ, సోయాబీన్, పల్లి, పత్తి పంటల విత్తనోత్పత్తికి తెలంగాణ అత్యంత అనుకూలం. ప్రపంచ విత్తన రాజధాని తెలంగాణ కావాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ కలను నెరవేర్చుకునే అవకాశాలు మనకు మెరుగ్గా ఉన్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 400కు పైగా జాతీయ, అంతర్జాతీయ విత్తన సంస్థలున్నాయి. 1500 గ్రామాల్లో 2.5 లక్షల మంది సుశిక్షుతులైన విత్తనోత్పత్తి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఏటా 65 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ఉత్పత్తి అవుతున్నాయి. తెలంగాణ భారత విత్తన భాండాగారంగా మారింది. దీని లాభాలు అన్నీ రైతులకే అందుతున్నాయి. ఓఈసీడీ విత్తన స్కీంలు, ఆన్‌లైన్ విత్తన ధృవీకరణ వ్యవస్థలు అమలుపరిచిన మొదటి రాష్ట్రం తెలంగాణ కావడం గమనార్హం.

ప్రత్యేకించి కొన్ని జిల్లాలు కొన్ని విత్తన పంటల సాగుకు మరింత అనుకూలం. పత్తికి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు, పల్లికి వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, మహబూబ్‌నగర్, మక్కజొన్నకు నిజామాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, సజ్జ, జొన్నలకు నిజామాబాద్, నిర్మల్, వరికి కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, జనగామ, శనగ, సోయాబీన్ పంటలకు నిజామాబాద్, ఆదిలాబాద్, గద్వాల్, నిర్మల్, పశుగ్రాస జొన్నకు నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు అత్యంత అనుకూలంగా ఉన్నవి. కాబట్టి ఈ ప్రాంతాల్లో బ్రీడర్ విత్తనం ద్వారా ఫౌండేషన్ తదుపరి సర్టిఫికేషన్ చేస్తే నాణ్యత బాగుంటుంది. మన రైతులు వాటిని నేరుగా ఎగుమతి చేసుకునే అవకాశాలు పెరుగుతాయి. ఆయా ప్రాంతాల్లో విత్తన పంటల ఉత్పత్తికి సాంకేతిక సలహాలు, సాగు వివరాలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఉద్యోగులు, రైతు సమన్వయ సమితి సభ్యులు కలిసికట్టుగా పనిచేయాలి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సాగుకు ఉచితంగా 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నది. సాగు నీరు అందిస్తున్నది. రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టింది. రైతులు ఈ ప్రోత్సాహకాలతో విత్తన పంటల సాగుపై దృష్టిపెడితే అదనపు ఆదాయం లభిస్తుంది. అంతర్జాతీయ విత్తన పరీక్షా సంస్థ అయిన ఇస్టా వారి ప్రయోగశాలలలో విత్తన నాణ్యత పరీక్షించిన తర్వాతనే ఇతర దేశాలకు ఎగుమతికి అవకాశం ఇస్తాయి. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా విత్తనాలను ఎగుమతి చేయాలంటే ఇస్టా నాణ్యత ప్రమాణాలు మన రైతులు అందుకోవాలి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆ ప్రమాణాలు అందిపుచ్చుకునేలా వివిధ సాంకేతిక తరగతులు, నిపుణులకు అవగాహన కల్పించడం జరిగింది. అంతర్జాతీయ విత్తన సదస్సు తొలిసారి ఆసియాలో అందునా భారత్‌లోని తెలంగాణలో జరుగడం గర్వకారణం. రాబో యేకాలంలో ఈ సదస్సు మూలంగా నూతన వంగడాలు, నాణ్యమైన విత్తనాల దిగుబడితో తెలంగాణ రాష్ట్రం అంతర్జాతీ య విత్తన మార్కెట్‌లో కీలకంగా ఎదిగేలా పనిచేద్దాం.

**(వ్యాసకర్త: రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు)**

# ట్రంప్‌ను ఢీకొనేదెవరు?

అంతర్జాతీయం

**బ్రెండన్ ఓ కానర్**

**డాన్ డిక్సన్**

అమెరికా అధ్యక్ష పదవికి 2020లో జరిగే ఎన్నికలలో ట్రంప్‌ను ఢీకొనే డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఎవరు? ఈ అభ్యర్థిత్వం కోసం ఇప్పటికే 24 మంది పోటీ పడుతున్నారు. ఇంత మంది ఉద్దండులు ట్రంప్‌పై పోటీకి ఆసక్తి చూపడానికి కారణమేమిటి? 2016లో ట్రంప్ ఎన్నికైనప్పటికీ, అత్యంత వ్యతిరేకత మూటగట్టుకున్నారు. ఆయనపై విజయం సులభమని డెమొక్రాట్ అభ్యర్థులు భావిస్తున్నారు. ట్రంప్ అవగాహనారాహిత్యం, మహిళా వ్యతిరేకత, తరచు అబద్ధాలాడటం తెలిసిందే. ట్రంప్ క్రూరమైన వలస విధానాలను, పర్యావరణ చట్టాల ఉల్లంఘనను, సంపన్నులకు పన్ను కోతను, గర్భస్రావాన్ని వ్యతిరేకించే న్యాయమూర్తుల నియామకాన్ని, నిరంకుశ పాలకులను ప్రశంసించడాన్ని డెమొక్రాటిక్ పార్టీ వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ట్రంప్ విధానాలు ఏవైనప్పటికీ, ఆయన మళ్ళా గెలిచే అవకాశాలు కూడా ఉన్నాయి. రిపబ్లికన్‌వాదులు, కాలేజీ డిగ్రీలు లేని తెల్లజాతి యువత ఆయనకు గట్టి మద్దతుదారులు.

గతవారం 2020 ఎన్నికల జోరు మొదలైంది. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థులు రెండు టీవీ చర్చలలో పాల్గొన్నారు. అభ్యర్థులు ఎక్కువగా ఉన్నప్పటికీ, వీరిలో కొద్దిమందికే ట్రంప్‌తో పోటీపడే స్థాయి కనిపిస్తున్నది. అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు జో బైడెన్, సెనేటర్లు బెర్నీ సాండర్స్, ఎలిజబెత్ వారెన్, కమలా హారిస్, సౌత్ బెండ్ మేయర్ బూటిజాజ్ ప్రధానంగా కనిపిస్తున్నారు. ప్రస్తుతానికి బైడెన్ పోల్స్‌లో ముందున్నారు. మిగతా డెమొక్రాట్ అభ్యర్థులతో పోలిస్తే, అమెరికా ప్రజల చేత ఎన్నుకోబడే లక్షణాలు ఆయనలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఫిబ్రవరి వరకు ప్రైమరీ ఓటింగ్ మొదలు కాదు. ఇప్పుడున్న ఆధిక్యం సమయానికి ఆవిరైపోవచ్చు. డిబేట్స్ మొదలుకొని ఓట్లు పడేనాటికి పరిస్థితి మారవచ్చు. ఇప్పటి వరకు ఎనిమిది పోల్స్ జరిగాయి. బైడెన్‌కు మద్దతు మే నెల నుంచి 41 శాతం నుంచి 31 శాతానికి తగ్గింది. బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన దగ్గర బైడెన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పటికీ బైడెన్ అదే గుర్తింపుతో నడిపిస్తున్నారు. 1987- 88లో, 2007- 08లో అధ్యక్ష పదవికి ప్రచారం చేసినప్పుడు ఆయన ఏ మాత్రం ఆకట్టుకోలేక పోయారు. ఆయనకు తరుచు మాటజారడం అలవాటు. ప్రసంగ చాతుర్యం అంతంతమాత్రం. దేశాధ్యక్షుడు కావడా నికి ఆయనకు తన నోరే అడ్డుపడుతున్నదని వాషింగ్టన్ కాలమిస్టు రిచర్డ్ కోహెన్ వ్యాఖ్యానించారు. ఆయన అనుసరించిన విధానాలు కూడా వివాదాస్పదమైనవి. 2003లో ఇరాక్‌పై దాడిని సమర్థించారు. గర్భస్రావ కేంద్రాలకు ప్రభుత్వ నిధులను వ్యతిరేకించారు. నగర ప్రాంత నేరాల పట్ల కఠినంగా ఉంటారు. ఆర్థిక సంస్థలకు మద్దతుదారు. క్రెడిట్ కార్డు కంపెనీల మద్దతు గల దివాలా బిల్లుకు ఆయన మద్దతు ఇచ్చారు. అయినప్పటికీ, కొన్ని తన అనుకూలాంశాలను ప్రచారం చేసుకోవాలని బైడెన్ భావిస్తున్నారు. మహిళలపై హింసను అడ్డుకునే చట్టానికి, పేదరిక నిర్మూలనా చట్టానికి మద్దతు ఇచ్చారు. వీటిని ప్రచారం చేసుకోవాలని బైడెన్ ప్రయత్నిస్తున్నారు.

వారెన్, సాండెర్స్‌కు ప్రగతిశీలురుగా పేరున్నది. బైడెన్ మధ్యేవాది కావడమే కాకుండా రెండు పార్టీల వారితో సాన్నిహిత్యం ఉన్నది. కానీ వారెన్, సాండెర్స్ ఇందుకు భిన్నం. వీరిద్దరి నుంచి బైడెన్‌కు గట్టి పోటీ ఎదురవుతున్నది. కొద్ది నెలలుగా వారెన్‌కు మద్దతు పెరుగుతున్నది. సాండర్స్‌కు మద్దతు కొంచెం తగ్గింది. ప్రస్తుతానికి డెమొక్రాటిక్ ఓటర్లలో వారెన్‌కు పదమూడు శాతం, సాండర్స్‌కు 17 శాతం మద్దతు ఉన్నది. వీరిరువురు వామపక్ష దృక్పథం ఉన్నట్టు వ్యవహరిస్తున్నారు. అయితే ప్రచ్ఛన్నయుద్ధం ప్రారంభం నాటి నుంచి అమెరికా రాజకీయాల్లో వామపక్ష విధానాలు పెద్దగా ఆదరణ పొందలేదు. పన్నుల వ్యవస్థ అభ్యుదయంగా ఉండాలని, కనీస వేతనం ఎక్కువగా ఉండాలని వీరు అంటారు. రక్షణ వ్యయం తగ్గించుకోవాలని, విదేశాలలో సైనిక జోక్యాలు ఉండకూడదని వాదిస్తారు. వాతావరణ మార్పును అరికట్టాలనేది కూడా వీరి ప్రాధాన్యాంశం. అమెరికాలోకి అక్రమ వలసలను నేరంగా పరిగణించకూడదని, మెడికేర్‌ను విస్తరించాలని, లక్ష కోట్ల డాలర్ల మేర ఉన్న విద్యార్థుల అప్పును మాఫీ చేయాలని వీరు ప్రతిపాదిస్తున్నారు. అమెరికా రాజకీయాల్లో మూడేండ్ల కిందటివరకు కూడా ఇటువంటి వాదనలు ఉండకపోయేవి. కానీ ఇప్పుడు ప్రాచుర్యం పొందుతున్నాయి.

> **గతంలో డెమొక్రాట్స్ యువ ఓటర్లను ఆకట్టుకోవడానికి నైతికాంశాలు కాకుండా, సమ్మిళిత పెట్టుబడి దారీవిధానాన్ని ఆశ్రయించేవారు. కానీ ప్రస్తుతం సాండర్స్, వారెన్ సామాజిక ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. క్లింటన్స్ ప్రతిపాదించిన సంక్లిష్ట సామాజిక విధానాల కన్నా వీరి విధానాలు సులభంగా ఓటర్లను చేరడం సులభం.**

అమెరికాలో అభ్యుదయ భావాలు ప్రాచుర్యం పొందడానికి కారణం ఏమిటి? సాండర్స్ లేదా వారెన్ అమెరికా అధ్యక్షులు కాగలరా?

యధాతథ వాద విధానాలు అమెరికా ప్రజలను మెప్పించలేకపోతున్నాయి. అమెరికా సమాజం కొత్త పరిష్కారాల కోసం అన్వేషిస్తున్నది. ఈ పరిష్కారాలు ట్రంప్ రూపంలో కూడా కనిపించవచ్చు. లేదా ఇంతకాలం అవాస్తవికమైనవిగా కొట్టిపారేసిన వామపక్ష విధానాలు కూడా పరిష్కారాలుగా తోచవచ్చు. గతంలో డెమొక్రాట్స్ యువ ఓటర్లను ఆకట్టుకోవడానికి నైతికాంశాలు కాకుండా, సమ్మిళిత పెట్టుబడిదారీవిధానాన్ని ఆశ్రయించేవారు. కానీ ప్రస్తుతం సాండర్స్, వారెన్ సామాజిక ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. క్లింటన్స్ ప్రతిపాదించిన సంక్లిష్ట సామాజిక విధానాల కన్నా వీరి విధానాలు సులభంగా ఓటర్లను చేరడం సులభం.

హారిస్, బూటిజాజ్ బిడెన్ కన్నా కొంచెం ప్రగతిశీలంగా కనిపిస్తారు. అయితే సాండర్స్, వారెన్‌తో పోల్చేంతటి అభ్యుదయకాముకులు కాదు. చర్చల్లో హారిస్ బాగా రాణించారు. బిడెన్ రాజకీయ గతాన్ని విమర్శించా రు. తాను ఆయుధాల నిషేధానికి చేసి న యత్నాన్ని వివరించారు. ఈ చర్చ తర్వాత డెమొక్రాట్స్‌లో ఆమెకు మద్ద తు 6-12 శాతానికి పెరిగింది. అయితే శాన్ ఫ్రాన్సిస్కో డిస్ట్రిక్ట్ అటార్నీగా, కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌గా ఆమె వ్యవహరించిన తీరు విమర్శలు తెచ్చిపెడుతున్నది. ఆమె అధికారంలో ఉన్నప్పుడు నేర విచారణ స్మృతిని సంస్కరించడంలో విఫమవడమే కాకుండా, తప్పుడు శిక్షలను సమర్థించారు. బూటీజాజ్ మేధావి రాజకీయవేత్తగా గుర్తింపు పొందాలనుకుంటున్నారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ పట్టభద్రుడే కాకుండా ఏడు భాషలు మాట్లాడగలరు. సైన్యంలో పనిచేశారు. అభ్యుదయవాదుల్లో మేటిగా గుర్తింపు పొందిన ఈయన ఎన్నికల సంస్కరణలను ప్రధానాంశంగా ముందుకుతెస్తున్నారు. ఎలక్టోరల్ కాలేజీని రద్దుచేయాలని, ఆటోమేటిక్ ఓటర్ రిజిస్ట్రేషన్‌ను సమర్థిస్తున్నారు. రాజకీయ సమతుల్యత కోసం సుప్రీంకోర్టును పునర్వ్యవస్థీకరించాలని కోరుతున్నారు. సౌత్‌బెండ్‌లో పోలీసు అధికారి నల్లజాతీయుడిని కాల్చివేసిన ఘటన పై ఈయన స్పందన విమర్శలకు గురవుతున్నది. నగర పోలీసు దళంలో ఆఫ్రికన్- అమెరికన్ల సంఖ్యను ఎందుకు పెంచలేకపోయారనే ప్రశ్నను చర్చలో లేవనెత్తారు. అయితే అది తనకు సాధ్యం కాలేదని ఆయన బదులిచ్చారు.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రచారం సాగే కొద్దీ చర్చ వేడెక్కుతుంది. డిబేట్స్ సాగే కొద్దీ జనం ఆశావహులను తూర్పారబడుతారు. ఏ మాత్రం బలహీనతలు ఉన్న ఎదురుదెబ్బలు తప్పవు. 2020 ఫిబ్రవరి నాటికి అయోవా కాకసెస్ మొదలవుతుంది. డెమొక్రాట్స్‌లో సామాజిక సంస్కరణలను మౌలికాంశంగా పరిగణించేవారుంటారు. అదే ప్రధాన భూమిక అయితే ట్రంప్‌ను ఎదుర్కొనడం కష్టమని అభిప్రాయపడేవారు ఉంటారు.

**(వ్యాసకర్త: సిడ్నీ విశ్వవిద్యాలయంలోని అమెరికా అధ్యయన అసోసియేట్ ప్రొఫెసర్)**

**(వ్యాసకర్త: సిడ్నీ విశ్వవిద్యాలయంలోని అమెరికా అధ్యయన కేంద్రంలో పరిశోధకులు)**

'ది కన్జర్వేషన్' సౌజన్యంతో...

**జనగళం**

### తీరు మార్చుకోవాలె

ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా దాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారింది. సచివాలయం భవనాన్ని కొత్తగా నిర్మించేందుకు సీఎం కేసీఆర్ భూమిపూజ చేసిన వెంటనే కాంగ్రెస్ వ్యతిరేక గళాన్ని ఎత్తుకోవటం హాస్యాస్పదం.ఆ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. ఇదంతా కేవలం మీడియాలో కనపడేందుకే తప్పా వేరే ఉపయోగం లేదంటూ ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల తీరులో మార్పు రావాలి. ప్రభుత్వం చేస్తు న్న అభివృద్ధి కార్యక్రమాలకు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలె. కానీ, అడ్డుకోవడం సమంజసం కాదనే విషయం తెలుసుకోవాలి.

**- పులి వెంకటేశ్, హైదరాబాద్**

### సంరక్షణ బాధ్యత ప్రజలదే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని 'హరితహారం' ద్వారా కోట్లాది మొక్కలు నాటుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నాలుగు విడుతలుగా జరిగిన ఈ కార్యక్రమం ఈ నెలలో 5 విడుత ద్వారా కోట్లాది మొక్కలు నాటనున్నది. గ్రామీణ యువత, ప్రజలతో పాటు పంచాయతీ సిబ్బంది కూడా మొక్కలకు నీరు పోస్తూ, మొక్కలను పశువులు మేయకుండా కంచెలు ఏర్పాటు చేయాలె. మొక్కలు నాటడమే కాదు, వాటి సంరక్షణ బాధ్యత ప్రజలు తీసుకోవాలి.

**- నర్మాల మనీష్, లక్ష్మీనగర్, కరీంనగర్**

### అవగాహన కల్పించాలె

విద్యుత్ షాక్‌తో ఓ యువతి మృతిచెందిన వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. వానలకు తడిసిన ఇనుప స్తంభాలు షాక్ ఇచ్చే అవకాశాలు ఎక్కువుగా ఉంటాయి. కాబట్టి విద్యుత్ అధికారులు ఇనుప స్తంభాలున్నచోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలె. దీంతో పాటు ప్రజలకు విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కల్పించాలె. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలె.

**- నారదాసు రాజేందర్, రామంతాపూర్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.





మంగళవారం మేడ్చల్ జిల్లా కీసరలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి


వికారాబాద్ జిల్లా నవాబుపేటలో సభ్యత్వాన్ని అందజేస్తున్న పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ పురాణం, ఇంచార్జి విజయారెడ్డి

# స్వచ్ఛందంగా సభ్యత్వాలు

## జోరుగా టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ▪ ఆసక్తి చూపుతున్న జనం ▪ ప్రభుత్వ పథకాల వల్లే ఆదరణ: మంత్రులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతున్నది. నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు సైతం స్వచ్ఛందంగా తరలివచ్చి సభ్యత్వాలు తీసుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, రాష్ట్ర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఎక్కడ చూసినా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతున్నది. సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పంద న లభిస్తుందని పలువురు మంత్రులు పేర్కొన్నారు.


స్త్రీ, శిశు సంక్షేమశాఖ రీజినల్ కోఆర్డినేటర్ శరణ్యారెడ్డికి పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తదితరులు

**కరీంనగర్ జిల్లాలో మంత్రి ఈటల..**

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం గంగారం, ఎలుబాక, చల్లూరు, దేశాయిపల్లి, కిష్టంపేట, కోర్కల్, శ్రీరాములపేట, రెడ్డిపల్లి, వీణవంక, నర్సింగాపూర్, వల్భాపూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాలు అందజేసిన సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పల్లెపల్లెనా టీఆర్ఎస్ సభ్యత్వాల పండుగ మొదలైందనీ, అత్యధికంగా నమోదు చేయించి రికార్డు సృష్టించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, వీణవంక జెడ్పీటీసీ మాడ వనమాల తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, రాష్ట్ర నాయకులు వేంరెడ్డి నర్సింహారెడ్డి, చకిలం అనిల్‌కుమార్‌లకు విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తంలో ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత ఒక్క టీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. అందుకే టీఆర్ఎస్ ఏ కార్యక్రమం చేపట్టిన ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్ పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం గోధుమకుంట, కీసర గ్రామాల్లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు చాలామంది ఆకర్షితులై టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాలు తీసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారన్నారు. మేడ్చల్ నియోజక వర్గంలో టీఆర్ఎస్ సభ్యత్వాలను పెద్ద ఎత్తున చేపట్టాలని కోరారు.

**ఉమ్మడి వరంగల్‌లో..**

వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ తదితరులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల, రేగొండ మండలాల్లో సభ్యత్వ నమోదులో ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి పాల్గొన్నారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రం, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల్లో టీఆర్ఎస్ సభ్యత్వ ఆన్‌లైన్ కేంద్రాన్ని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రారంభించారు. సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ఆన్‌లైన్ ఐడీ కార్డులు జారీ చేస్తామని వారు పేర్కొన్నారు.

**వికారాబాద్ జిల్లాలో..**

వికారాబాద్ జిల్లా నవాబుపేటలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగిలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు, నియోజకవర్గ ఇంచార్జి గట్టు రాంచందర్‌రావు పాల్గొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ బాలాగనర్ డివిజన్ ఫిరోజ్‌గూడలో నిర్వహించిన కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పార్టీ కార్యకర్తలకు సభ్యత్వాలు అందజేశారు.

**చెన్నూర్‌లో..**

మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, నియోజకవర్గ ఇంచార్జి మూల విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టీ), తలమడుగు మండలం సుంకిడిలో టీఎస్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి లోక భూమారెడ్డి పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా పెంబి, తానూర్‌లో స్థానిక ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సభ్యత్వ నమోదు నిర్వహించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్, బీర్‌పూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి రూప్‌సింగ్ పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం చౌటపల్లిలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, సభ్యత్వాల నమోదు ఇంచార్జి బైకాని శ్రీనివాస్‌యాదవ్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, తిరుమలగిరి సాగర్ మండలం అల్వాల గ్రామంలో ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, నార్కట్‌పల్లిలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, శాలిగౌరారంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, మునుగోడులో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సభ్యత్వాలు అందజేశారు.


ములుగు జిల్లాలో జెడ్పీటీసీ సకినాల భవానికి సభ్యత్వం అందజేస్తున్న ఎంపీ బండా ప్రకాశ్, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, మాజీ ఎంపీ సీతారాంనాయక్


గ్రేటర్ హైదరాబాద్ బాలాగనర్ డివిజన్ ఫిరోజ్‌గూడలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ చేతుల మీదుగా సభ్యత్వం తీసుకుంటున్న నాయకుడు రవీందర్‌రెడ్డి


వికారాబాద్ జిల్లా పరిగిలో జెడ్పీ కోఆప్షన్ మీర్ మహమూద్‌అలీ, మాజీ జెడ్పీటీసీ బాబయ్యలకు సభ్యత్వాలు అందజేస్తున్న పార్టీ ఇంచార్జి గట్టు రాంచందర్‌రావు, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


వరంగల్ అర్బన్ జిల్లా ములుకనూరులో సభ్యత్వం ఇస్తున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్వరాజు సారయ్య


మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే రెడ్యానాయక్


పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో టీఆర్ఎస్ సభ్యత్వం అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్


వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్


జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో సభ్యతాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పార్టీ ఇంచార్జి రూప్‌సింగ్


యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేట గ్రామం ఉర్ఫ్ ఉజాలే షా ఖాద్రీ దర్గాను సందర్శించి ప్రార్థన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి శ్రీనివాస్

## మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

**యాదగిరిగుట్ట, నమస్తేతెలంగాణ:** మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు నిర్వహిస్తున్నారని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో ఉర్ఫ్ ఉజాలే షా ఖాద్రీ దర్గా వద్ద ఉర్సు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. మంగళవారం జరిగిన జల్సా, సందల్ మాలి, ఖవ్వాలి కార్యక్రమంలో వంగపల్లి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా జరిగే ఈ ఉత్సవాల్లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొంటారని తెలిపారు. ఇక్కడి ప్రాంత ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలంతా సఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## టీటా డిజిథాన్ డిజిటల్ యాత్ర విజయవంతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన రెండు రోజుల డిజిథాన్ డిజిటల్ యాత్ర పూర్తయింది. పాఠశాలలు, హాస్టల్లలోని విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు టీటా తరఫున సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు గత శుక్రవారం గద్వాల జిల్లాకు వెళ్లారు. శని, ఆదివారాల్లో విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్, ఈ మెయిల్‌ఖాతాను ఏర్పాటు చేసుకోవడం తదితర అంశాలపై నైపుణ్యం కల్పించారు. శనివారం రాత్రి ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులతో కలిసి బస చేశారు. గద్వాల జిల్లా కలెక్టర్ శశాంక టీటా ప్రయత్నాన్ని అభినందించారు.

## తాటి చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి

**ముస్తాబాద్:** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతగల్ శివారులో ఓ గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన జిల్లెల వెంకటిగౌడ్(38) ఉపాధి కోసం కొంత కాల క్రితం రూ.లక్ష అప్పుచేసి గల్ఫ్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరక్కపోవడతో మళ్లీ స్వదేశం వచ్చి గీతకార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కిందపడి ప్రాణాలు వదిలాడు. వెంకటేశ్‌కు భార్య మంజుల, కుమార్తెలు స్వాతి (15), శ్వేత(13), కుమారుడు రాకేశ్(9) ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## అభివృద్ధిని జీర్ణించుకోలేకే రాద్ధాంతం

▪ విపక్షాలపై మంత్రి ఈటల ఫైర్

**జమ్మికుంట రూరల్:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. మంగళవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో పలు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. రూ.85 లక్షల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ భవనాన్ని, రూ.40 కోట్లతో నిర్మించిన మిషన్‌భగీరథ వాటర్ ట్యాంక్‌లను ప్రారంభించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంలో నూతన భవనాల ప్రారంభం కొత్త శకానికి నాంది అని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దోపిడీకి గురికావడం తప్ప, అభివృద్ధి శూన్యం అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జెడ్పీ నూతన అధ్యక్షురాలు కనుమల్ల విజయ, జెడ్పీటీసీ శ్రీరాం శ్యామ్, మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అనిరూద్ రషీద్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శారద తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఈటల. చిత్రంలో జెడ్పీ నూతన అధ్యక్షురాలు విజయ

**తప్పిన ప్రమాదం..**


ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఏటూరు సమీపంలో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్డుపక్కన ఒరిగింది. ఆ సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నారు. మలుపు వద్ద ఎదురుగా ఎడ్లబండి రావడంతో డ్రైవర్ రోడ్డు పక్కకు తిప్పడంతో బస్సు కిందకు వెళ్లి ఓ వైపు ఒరిగింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. - ఏటూరునాగారం(ములుగు)

## యానాం మోసగాడి అరెస్ట్


ప్రేమపేరుతో యువతులకు వల
వ్యక్తిగత ఫొటోలు చూపిస్తూ బ్లాక్‌మెయిల్

**సూర్యాపేటసిటీ:** సోషల్‌మీడియాలో అమాయకులైన యువతులతో పరిచయం పెంచుకొని, వారితో సన్నిహితంగా ఉంటూ పలురకాలుగా మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ఓ యువకుడిని సూర్యాపేట పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని యానాంకు చెందిన కర్రి సతీశ్(25) నత్తగుల్లల వ్యాపారం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ప్రేమలోకి దింపి వారి నుంచి డబ్బులు లాగడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఇందులో భాగంగా సతీశ్ ఇన్‌స్టాగ్రాం యాప్‌లో సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డకు చెందిన ఒక యువతితో పరిచయం పెంచుకున్నాడు.పెండ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. ప్రియుడి మాటలు నమ్మిన యువతి తాత ఇంట్లో లేని సమయంలో అతనితో కలిసి బీరువాలో ఉన్న 24 తులాల బంగారు నగదు చోరీ చేసి ప్రియుడికిచ్చింది. ఆ విషయం తెలియని యువతి తాత పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తర్వాత యువతి నగలు తిరిగి ఇవ్వాల్సిందిగా కోరగా సతీశ్ బంగారం అడిగితే వ్యక్తిగత ఫొటోలు సోషల్‌మీడియాలో పెడుతానని బెదిరిస్తున్నాడు. దీంతో యువతి తాతకు విషయం చెప్పి పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు యానాం వెళ్లి సతీశ్‌ను అరెస్ట్ చేసి సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు నగలను రికవరీ చేశారు. అంతేకాకుండా సతీశ్ కాల్‌డేటా ప్రకారం మరి కొంతమంది యువతులను ఇదే రకంగా నమ్మించి వారి నుంచి నగదును వసూలు చేసినట్టుగా తెలుస్తుందని పోలీసులు చెప్పారు. చోరీ కేసును ఛేదించడమే కాకుండా పూర్తి స్థాయిలో రికవరీ చేసిన పట్టణ సీఐ శివశంకర్, సిబ్బందిని సూర్యాపేట డీఎస్పీ నాగేశ్వర్‌రావు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట డీఎస్పీ నాగేశ్వర్‌రావు


సతీశ్ నుంచి రికవరీ చేసిన సొత్తు

## రోడ్డు ప్రమాదంలో పసికందు మృతి



**లక్సెట్టిపేట:** మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేటలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 28 రోజుల పసిపాప అమ్ములు ప్రాణాలు కోల్పోయింది. మండలంలోని కొమ్ముగూడెంకు చెందిన బియ్యాల శాంతవ్వ తన కొడుకు మనోహర్, కోడలు సునీత మనుమడు భూమన్‌తోపాటు చిన్నారిని తీసుకొని దైవదర్శనం కోసం గూడెం సత్యనారాయణస్వామి ఆలయానికి సోమవారం వెళ్లారు. అక్కడే కాసేపు నిద్ర చేసి అదేరోజు రాత్రి 10 గంటలకు ఆటోలో తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యంలో కారు, ఆటో ఢీకొనడంతో చిన్నారి మృతిచెందగా, కుటుంబసభ్యులకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై మధుసూదన్ రావు కేసు నమోదు చేశారు.

# పార్టీకి చెడ్డపేరు తెస్తే సహించను

## ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు

### బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని మోదీ హెచ్చరిక

### ఈ నెల 6న వారణాసిలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించనున్న ప్రధాని



మంగళ వారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు

**న్యూఢిల్లీ, జూలై 2:** పార్టీకి చెడ్డపేరు తెచ్చే పనులను అస్సలు సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'ఎవరైనా సరే, ఎవరి కుమారుడైనా సరే పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా, అహంకారపూరితంగా ప్రవర్తించినా, దుష్ప్రవర్తన కలిగినా అస్సలు సహించను' అని తెలిపారు. తప్పు చేస్తే తప్పించుకోలేరని చెప్పారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో బీజేపీ సీనియర్ నేత కైలాశ్ వర్గీయ కుమారుడు ఆకాశ్ వర్గీయ ఓ ప్రభుత్వాధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడుతూ 'మీ తప్పుల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తుంది. ఇది సరైన పద్ధతి కాదు. ఒకవేళ తప్పు చేస్తే క్షమాపణలు చెప్పాలి. కావాలని తప్పు చేసి పార్టీకి చెడ్డ పేరు తెస్తే మాత్రం అస్సలు సహించను' అని అన్నారు. ప్రధాని మోదీ మధ్యప్రదేశ్ ఘటనను ప్రస్తావించకున్నా ఆయన దానినే దృష్టిలో ఉంచుకొని ఈ హెచ్చరిక జారీ చేసినట్లు తెలుస్తున్నది. సమావేశం తర్వాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదును ప్రధాని మోదీ ఈ నెల 6న ఆయన సొంత నియోజకవర్గం వారణాసిలో ప్రారంభిస్తారన్నారు. ఇటీవల లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు పార్టీ ఎంపీలు చాలా మంది గైర్హాజరుపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇక పార్లమెంట్ సమావేశాలకు ఎంపీలు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రధాని మోదీ సూచించినట్లు వివరించారు. కాగా రెండోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరుగడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీని పార్టీ నాయకులు సత్కరించారు.

**తెలంగాణలో సభ్యత్వ నమోదు ప్రారంభించనున్న అమిత్ షా**

ఈ నెల 6న బీజేపీ సిద్ధాంతకర్త శ్యామ ప్రసాద ముఖర్జీ జయంతి సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ కార్యక్రమాన్ని తెలంగాణలో బీజేపీ జాతీయాధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చెప్పారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్ షా పార్టీ సీనియర్ నాయకులతో సమావేశమవుతారని, పార్టీని మరింత పటిష్ఠపర్చడానికి కీలక సూచనలు చేస్తారని తెలిపారు.



# అంత్యక్రియలకు ముందు వ్యక్తిలో కదలికలు

- బతికున్న యువకుడ్ని.. చనిపోయినట్లు ప్రకటించిన వైద్యులు
- ప్రైవేటు దవాఖాన నిర్లక్ష్యంపై బంధువుల ఫిర్యాదు.. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘటన

**లక్నో, జూలై 2:**

రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు జీవించి ఉండగానే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో బంధువులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అతడిలో కదలికలు గుర్తించి ఆశ్చర్యపోయారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. లక్నోకు చెందిన మహమ్మద్ ఫర్కాన్(20) జూన్ 21న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్చారు. పది రోజుల చికిత్స అనంతరం ఫర్కాన్ చనిపోయినట్లు అక్కడి వైద్యులు ప్రకటించారు. దీంతో అతడ్ని అంబులెన్స్‌లో ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేశారు. సంప్రదాయం ప్రకారం మృతదేహాన్ని ఖననం చేసేందుకు శ్మశానంలో గొయ్యి కూడా సిద్ధం చేశారు. ఇంతలో ఫర్కాన్ కాళ్లు కదులుతుండటాన్ని కొందరు గమనించారు. వెంటనే అతడ్ని రామ్ మనోహర్ లోహియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన అక్కడి డాక్టర్లు అతడు బ్రెయిన్ డెడ్ కాలేదని, బతికే ఉన్నాడని నిర్ధారించారు. పల్స్, బీపీ, నాడీ పనిచేస్తున్నాయని అయితే పరిస్థితి మాత్రం విషమంగా ఉందని తెలిపారు. ఆ యువకుడికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. కాగా ఫర్కాన్‌కు ముందుగా చికిత్స అందించిన ప్రైవేటు దవాఖాన నిర్లక్ష్యంపై అతడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య చికిత్సకు తాము రూ.7 లక్షలు చెల్లించామని, తమ వద్ద ఇక డబ్బులు లేవని చెప్పడంతో తన తమ్ముడు చనిపోయినట్లు చెప్పారంటూ ఫర్కాన్ అన్న మహమ్మద్ ఇర్ఫాన్ ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంపై వైద్య శాఖ అధికారికి ఆయన ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనను సీరియస్‌గా పరిగణిస్తున్నామని, దీనిపై సమగ్ర విచారణ జరుపుతామని లక్నో చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేంద్ర అగర్వాల్ తెలిపారు.



# విస్తారంగా వర్షాలు

- నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా
- ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఓ మోస్తరు
- రైతన్నల హర్షం.. ముమ్మరమవుతున్న వ్యవసాయపనులు



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో కురుస్తున్న వర్షం



మంగళవారం నిజామాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నీటితో నిండిన ప్రధాన రహదారి



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కురుస్తున్న వర్షం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురవగా.. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వానలు కురిశాయి. పలు చోట్ల చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరింది. అనేకచోట్ల రోడ్లపై మోకాళ్లలోతు నీళ్లు ప్రవహించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మరోవైపు రైతన్నలు వ్యవసాయ పనులను ముమ్మరంచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. నిజామాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై మోకాల్లోతు నీళ్లు నిలిచాయి. భీమ్‌గల్‌లో ఈదురుగాలులకు బీఎస్ఎన్ఎల్ టవర్ కూలింది. ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, రెంజల్, ఎడపల్లి, కోటగిరి, వర్ని, ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, ఆర్మూరు, తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. బోధన్ పట్టణంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జోరుగా వర్షం కురిసింది.

**ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం**

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తలమడుగు, నార్నూర్, ఉట్నూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాల్లో భారీ వర్షం.. మిగతా ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. నార్నూర్ మండలంలోని పలు ప్రాంతాలు జలమయం కాగా. మారుమూల గ్రామాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాలుగురోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో భారీ వర్షం కురిసింది. పుట్నూర్ వారసంతలో కూరగాయలు కొట్టుకుపోయాయి. పత్తి విత్తనాలు నాటుకునేందుకు అనుకూలంగా వర్షం కురిసిందని రైతులు హర్షం వ్యక్తంచేశారు.

**భద్రాద్రి కొత్తగూడెంలో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి అక్కడక్కడ వర్షం కురిసినప్పటికీ మంగళవారం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలను దుక్కులు చేసుకొని విత్తనాలు చల్లేందుకు సిద్ధమవుతున్నారు.

**ఖమ్మంలో చిరుజల్లులు**

ఖమ్మం జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఖమ్మం నగరంతోపాటు కూసుమంచి, ఖమ్మం రూరల్, చింతకాని, కామేపల్లి, కారేపల్లి మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. సోమవారం సింగరేణి మండలంలో 3.6 మిల్లీమీటర్లు, తిరుమలాయపాలెంలో 3.4 మి.మీ., నేలకొండపల్లిలో 3.8 మి.మీ., చింతకానిలో 2.2 మి.మీ., వైరాలో 3.4 మి.మీ., కొణిజర్ల మండలంలో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పత్తి విత్తనాలతోపాటు ఇతర అపరాల పంట సాగులో జిల్లా రైతాంగం నిమగ్నం అయ్యింది.

**కరీంనగర్ జిల్లాలో ఓ మోస్తరు..**

కరీంనగర్ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 5.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, రాత్రి అక్కడక్కడా భారీ వర్షం కురిసింది. కరీంనగర్, తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, సైదాపూర్, గంగాధర మండలాల్లో భారీ వర్షం పడింది. చిగురుమామిడిలో అత్యధికంగా 33.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**వేములవాడలో వర్షం**

వేములవాడ పట్టణంలో మంగళవారం సాయంత్రం దాదాపు 20 నిమిషాలపాటు వర్షం కురుసింది. రాజన్న ఆలయ పరిసరాలు, పట్టణ ప్రధాన రహదారి, జాతరగ్రౌండ్‌తో పాటు పలు రహదారులు వరదనీటితో నిండిపోయాయి. ప్రధాన ఆలయం ముందు ఉన్న చిరు దుకాణాల్లోకి వరదనీరు చేరుకోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

**కౌటాల, కాగజ్‌నగర్‌లో..**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంతోపాటు కాగజ్‌నగర్ పట్టణంలో వర్షం కురిసింది. కౌటాల మండలంలోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కాగజ్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలైన సర్‌సిల్క్, లారీచౌరస్తా, సంజీవయ్యకాలనీ, ఓల్డ్‌కాలనీ, కన్యాకాపరమేశ్వరి ఆలయ సమీపంలో, పీహెచ్‌సీ, నౌగాబస్తీ కాలనీల్లో వర్షపు నీటితో మురుగు కాల్వలు పొంగిపొర్లాయి. సంజీవయ్యకాలనీలో కాల్వల్లో నీరు రోడ్డుపైకి చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.

**ఓరుగల్లులో ఓ మోస్తరు ..**

వరంగల్ ఉమ్మడి జిల్లాలో రెండ్రోజుల నుంచి జల్లులు కురుస్తున్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్, ఎల్కతుర్తి, ఐనవోలు, ధర్మసాగర్ మండలాల్లో మెట్టపంటల సాగుకు అనుకూలంగా వానలు పడ్డాయి. వరంగల్ రూరల్ జిల్లా పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లోని పలుప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. రైతులు దుక్కులను సిద్ధంచేసుకుని విత్తనాలు చల్లుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలతోపాటు మహబూబాబాద్ జిల్లా గూడూరు, డోర్నకల్, నర్సింహులపేట మండలాల్లో జల్లులు కురిశాయి. జనగామ జిల్లాలో ఆకాశం మేఘావృతమైంది తప్ప వానలు కురువలేదు.

## ఐఐటీహైదరాబాద్‌లో

# విద్యార్థి ఆత్మహత్య

### చదువులో రాణించలేకపోతున్నానని సూసైడ్ నోట్

**సంగారెడ్డి రూరల్ :** ఎంతో కష్టపడి చదివినా రాణించలేకపోతున్నా.. నేనొక లూజర్ని, ఫెయిల్యూర్‌నీ అంటూ ఓ ఐఐటీ విద్యార్థి సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం సంగారెడ్డి జిల్లా కంది మండలం ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో చోటు చేసుకున్నది. డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని నారాయణ లంకకు చెందిన మార్క్ ఆండ్రూ చార్లెస్ (25) రెండేండ్ల క్రితం ఐఐటీ హైదరాబాద్‌లో మాస్టర్స్ ఇన్ డిజైనింగ్ కోర్సులో చేరాడు. తాను చేస్తున్న కోర్సు మరో మూడ్రోజుల్లో ముగియనున్నది. ఇంతలోనే ఐఐటీలోని ఏ బ్లాక్ రూమ్‌నంబర్ 319 గదిలో దుప్పటితో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని.. కొన్ని రోజులుగా మానసికంగా ఎంతో వేదన చెందానని.. మనసులో బాధ ఉన్నప్పటికీ అందరి ముందు బాగానే ఉండేవాన్నని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఐఐటీ అధ్యాపక బృందం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు డీఎస్పీ వివరించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామన్నారు.



మార్క్ ఆండ్రూ చార్లెస్(ఫైల్)

# పూడ్చిన శవానికి పరీక్ష

**పాపన్నపేట:** మెదక్ జిల్లా పాపన్నపేటలో మూడు నెలల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డ ఒక వ్యక్తి మృతదేహానికి మంగళవారం శవ పరీక్ష నిర్వహించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేటలోని పెద్ద హరిజనవాడకు చెందిన పొట్టిశాకని యాదయ్య (49) మూడునెలల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పట్లో మృతదేహాన్ని పాపన్నపేటలో ఖననం చేశారు. కాగా ఇటీవల మృతుడి తమ్ముడు సాయిలు యాదయ్య మృతిపై అనుమానం ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మంగళవారం మృతదేహాన్ని బయటకుతీసి డాక్టర్‌ల బృందంచే శవ పరీక్ష నిర్వహించారు.

# భర్తను కడతేర్చిన భార్య

**రెబ్బెన:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం లక్ష్మీపూర్‌లో ఓ మహిళ కూల్ డ్రింక్‌లో పురుగులమందు కలిపి ఇచ్చి భర్తను హతమార్చింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. లక్ష్మీపూర్‌కు చెందిన చౌదరి శంకర్ (34)కు ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడకు చెందిన రూప (30)తో పదకొండేండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు హారిక(10), కీర్తన (8) ఉన్నారు. శంకర్ తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం శంకర్‌కు అతడి భార్య కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలిపి ఇచ్చింది. తాగిన కొద్దిసేపటికే శంకర్ అపస్మారక స్థితికి చేరుకోగా.. అతడి తల్లి కాగజ్‌నగర్ ఆరోగ్యకేంద్రానికి.. అక్కడి నుంచి మంచిర్యాలకు శంకర్‌ను తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## స్టాంపుల కుంభకోణంలో

# ఎనిమిది మంది అరెస్టు

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ శాఖ స్టాంపుల కుంభకోణంలో టూటౌన్ పోలీసులు ఎనిమిది మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. 2014-18 వరకు స్టాంపుల విక్రయాల డబ్బులు రూ.78.22 లక్షలు ప్రభుత్వానికి చెల్లించకుండా ఉద్యోగులు ఉపయోగించుకున్నారు. 23 డిసెంబర్ 2018లో నలుగురు ఉద్యోగులపై కేసులు నమోదు కాగా సస్పెన్షన్ వేటు పడింది. తాజాగా రిటైర్డ్ రిజిస్ట్రార్ జాదవ్ జయవంత్‌రావు, భైంసా రిజిస్ట్రేషన్ కార్యాలయం సబ్‌రిజిస్ట్రార్ రావుత్ సాయినాథ్, ఆదిలాబాద్ రిజిస్ట్రేషన్‌శాఖలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ జిట్టె మనోహర్, జూనియర్ అసిస్టెంట్లు ఇమ్రాన్‌ఖాన్, కన్నాజి కల్పన, సీనియర్ అసిస్టెంట్ భక్షి సుజాత, కనికరపు చంద్రశేఖర్, వీ అరుణ్ కుమార్ మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరిపై 420, 401, 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు.

# కొడుకులతో కలిసి భర్తను చంపిన భార్య

### ఆస్తి కోసం ఘాతుకం.. కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో ఘటన

**బీర్కూర్:** ఆస్తి కోసం ఓ మహిళ దారుణానికి ఒడిగట్టింది. కొడుకులతో కలిసి భర్తనే హతమార్చింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. బీర్కూర్ ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపూర్‌కు చెందిన ముక్కిడి కామయ్య (65), ఈరయ్య అన్నదమ్ములు. వీరు ఉమ్మడిగా ఉన్న సమయంలో రెండున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఈ భూమి కామయ్య పేరుపైన ఉన్నది. కాగా ఏడాది నుంచి భూమిని పంచుకోవాలని అన్నదమ్ములు నిర్ణయించుకున్నారు. భూమి పంచేందుకు కామయ్య సిద్ధపడగా.. అతడి భార్య లాలయ్యా, ఇద్దరు కుమారులు వీరేశం, సాయిలు ఒప్పుకోలేదు. ఈ విషయంపై అతడి ఇంట్లో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. కామయ్య కుటుంబసభ్యులకు భయపడి ఇంట్లో నిద్రించడం లేదు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి మున్నూర్ కాపు భవనంలో కామయ్య నిద్రిస్తుండగా.. భార్య లాలవ్వ, కుమారులు వీరేశం, సాయిలు సంఘంలోని పిల్లరుకు తాడుతో ఉరివేసి హత్య చేశారు. అనంతరం ముగ్గురు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించామన్నారు.



కామయ్య (ఫైల్)

# బాలికపై లైంగిక దాడికి యత్నం

**అడవిదేవులపల్లి:** నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం నల్లమిట్టతండాలో పదకొండేండ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లమిట్టతండాకు చెందిన బాలిక (11) సోమవారం గొర్రెలను మేపేందుకు అడవికి వెళ్లింది. ఈ క్రమంలో అడవికి సమీపంలోని పొలంలో పనిచేస్తున్న అదేగ్రామానికి చెందిన జటావత్ దీప్లా(45) లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయగా సమీపంలోని మేకల కాపరులు అక్కడికి రాగా పారిపోయాడు. సోమవారం రాత్రి బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# పాముకాటుతో ఇద్దరు మృతి

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సోముగూడలో యువతి
- నిజామాబాద్ జిల్లా యానంపల్లి తండాలో విద్యార్థిని

**సిర్పూర్(యూ)/డిచ్‌పల్లి, నమస్తే తెలంగాణ:** పాము కాటుతో వేర్వేరు చోట్ల ఇద్దరు ప్రాణాలు వదిలారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ) మండలం బాబ్జిపేట్ పంచాయతీ పరిధిలోని సోముగూడకు చెందిన మర్సుకోల సోము- రంభాబాయి దంపతుల కుమార్తె లలిత (18)ను మంగళవారం పాము కాటువేసింది. కుటుంబసభ్యులు ఆమెను అంబులెన్స్‌లో జైనూర్ దవాఖానకు తరలించి చికిత్స నందిస్తుండగనే లలిత మృతిచెందింది. మరో ఘటనలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం యానంపల్లి తండాకు చెందిన దనవాత్ యమున, శ్రీనివాస్ దంపతుల కూతురు దనావత్ విష్ణుప్రియ(8) సోమవారం అర్ధరాత్రి పాముకాటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తున్న సమయంలో కట్లపాము శ్రీనివాస్ ఇంట్లోకి ప్రవేశించి.. ఇంట్లో నిద్రిస్తున్న విష్ణుప్రియను కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు బాలికను డిచ్‌పల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది.


**తేలు కాటుకు విద్యార్థి..**

**బెజ్జూర్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం ఇందిర్‌గాం గ్రామానికి చెందిన మోర్లె చిరంజీవి (12) అనే విద్యార్థి తేలుకాటుతో మృతి చెందాడు. మోర్లె సంతర్-పార్వతీ దంపతుల కుమారుడు చిరంజీవి బెజ్జూర్‌లో ప్రభుత్వపాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో చిరంజీవిని తేలు కుట్టింది. ఉపాధ్యాయులు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్‌కు అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించగా దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందాడు.

## 5 నుంచి యాదాద్రిలో

# వరుణ యాగం

**యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈ నెల 5 నుంచి 7 వరకు వరుణ యాగం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో గీత తెలిపారు. దేశమంతా వర్షాలు కురవాలని.. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వరుణ యాగం నిర్వహిస్తున్నట్టు ఈవో చెప్పారు. కొండపైన శివ బాలాలయం పక్కన యాగనిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.



# నాసిరకం పత్తి విత్తనాల పట్టివేత

**కేటీదొడ్డి:** వ్యవసాయ, టాస్క్‌ఫోర్సు అధికారుల దాడుల్లో 55 కేజీల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డ ఘటన జోగుళాంబ గద్వాల కేటీదొడ్డి మండలం కొండాపురం గ్రామం, పాతపాలెం స్టేజీలో చోటుచేసుకున్నది. వ్యవసాయ, టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపురానికి చెందిన గాజుల రంగారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో నాసిరకం పత్తి విత్తనాలు నిల్వ ఉన్నాయన్న సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా 40 కేజీల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడినట్టు తెలిపారు. అలాగే ధరూర్ మండలంలోని ద్యాగదొడ్డి గ్రామానికి చెందిన అశోక్ రాయచూర్-గద్వాల రహదారి మీదుగా 15 కేజీల నకిలీ పత్తి విత్తనాలు ద్యాగదొడ్డి తీసుకెళ్తుండగా పాతపాలెం స్టేజీ సమీపంలో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా పాతపాలెం స్టేజీ వద్ద పట్టుబడ్డ నకిలీ పత్తివిత్తనాలతో పోలీసులు, మండల వ్యవసాయ అధికారులు


తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ

సం.7/T7/DEE/DSE/SEW/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 27-06-2019
NIT No. 18&19/T7/T5/DEE/DSE/SEW/2019-20 తేది: 27-06-2019

**పని పేరు మరియు అంచనా మొత్తం:** 1. మహబూబాబాద్ జిల్లాలో కి.మీ. 10/6 నుండి 11/0 వరకు తొర్రూర్-నెల్లికుదురు రోడ్డుపై దెబ్బతిన్న స్ట్రెచెస్‌లో పేవర్ ప్యాచెస్ ఏర్పాటు కోసం ER-రూ. 20.00 లక్షలు. 2) మహబూబాబాద్ జిల్లాలోని కి.మీ. 21/6-10, 22/0-2 & 22/2-38 వరకు కేసముద్రం-నెల్లికుదురు రోడ్డుపై దెబ్బతిన్న స్ట్రెచెస్‌లో పేవర్ ప్యాచెస్ ఏర్పాటు కోసం ER-రూ. 21.00 లక్షలు. 1. పై పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 01-07-2019న సా. 4.00 గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పై పనుల కోసం టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది, సమయం: 08-07-2019న మ. 3.30 గంటల వరకు. 2. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

DIPR R.O.No. 515 DP/CL/Advt/1/2019-20 తేది: 02-07-2019 సం/-సూపరింటెండింగ్ ఇంజనీర్, (ఆర్ అండ్ బి) రీజియన్, వరంగల్

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం, పి.జె.పి. సర్కిల్ నం.1, గద్వాల్

టెండరు నం. 21/2BHK/2019-20 టెండర్ ప్రకటన తేది: 28-06-2019

**పని పేరు:** 2BHK- జోగులాంబ గద్వాల్ జిల్లాలోని గద్వాల్ నియోజకవర్గంలోని గద్వాల్ మండలం నందు గద్వాల్ మున్సిపాలిటీ పరిధిలో (G+2) డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ (92 Nos) నిర్మాణం చేయుట గురించి. **పని విలువ: రూ. 487.6 లక్షలు.** టెండరు డాక్యుమెంట్ లభించు తేది: 02-07-2019 ఉదయం 11.00గంటల నుండి 16-07-2019 మధ్యాహ్నం 03.00గంటల వరకు. టెండర్ స్వీకరించు తేది: 02-07-2019 ఉదయం 11.00గంటల నుండి 16-07-2019 సాయంత్రం 5.00గంటల వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 17-07-2019 ఉదయం 11.00 గంటలకు. ప్రైస్ బిడ్ తెరుచు తేది: 20-07-2019 ఉదయం 11.00 గంటలకు. సంబంధిత పర్యవేక్షక ఇంజనీర్ వారి చిరునామా: పర్యవేక్షక ఇంజనీర్, పి.జె.పి. సర్కిల్ నం.1, గద్వాల్. మిగతా వివరములకు తెలంగాణ రాష్ట్ర ''ఇ'' ప్రొక్యూర్మెంట్ మార్కెట్‌ప్లేస్ https://tender.telangana.gov.in/ను చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజనీర్, పి.జె.పి. సర్కిల్ నెం.1, గద్వాల్-509125

DIPR RO No.503-DP/CL/Advt/1/2019-20, Dt: 2/7/2019

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ- ఖమ్మం

Rc.No. 742/2018/A3 టెండరు ప్రకటన తేది: 29-06-2019

ఖమ్మం జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో గుమాస్తాలుగా పనిచేయుటకు కాంట్రాక్చువల్ సేవలు/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికపై సిబ్బందిని సరఫరా చేయుటకు సంబంధిత కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకున్న నమోదిత ఏజెన్సీలు లేదా వ్యక్తుల నుండి సీల్డు టెండర్లు కోరబడినవి. కేటగిరి: 1) డేటా ప్రాసెసింగ్ అధికారి (1), 2) డేటా ఎంట్రీ ఆపరేటర్లు (5), 3) బేస్ క్యాంప్ గిరిజన కాపలాదార్లు (15), 4) స్ట్రైకింగ్ ఫోర్స్ సహాయకులు (15), 5) చెక్‌పోస్టు హెల్పర్లు (8), 6) జీపు డ్రైవర్లు (6), రూ. 1000/-లను D.D.ద్వారా చెల్లించి ఈ కార్యాలయం నుండి టెండరు షెడ్యూలు మరియు నిబంధనలను పొందవచ్చును. సీల్డు టెండర్లు 09-07-2019 మ. 3.00గం.వరకు స్వీకరించబడును మరియు అదే రోజున సా. 5.00గం.లకు తెరువబడును. తదుపరి వివరాలను దిగువ సంతకముదారు నుండి పొందవచ్చును.

సం/- జిల్లా అటవీ అధికారి, ఖమ్మం

DIPR RO No.504-DP/CL/Advt/1/2019-20, Dt: 2/7/2019

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TUFIDC, యూనిట్-IV, రామగుండం

Lr.No. NIT No.27/SE/TUFIDC/NRL/UNIT-IV/2019-20 తేది: 01-07-2019

సంక్షిప్త టెండరు ప్రకటన

**NIT No.27/SE/TUFIDC/NRL/UNIT-IV/2019-20 పని పేరు:** నిర్మల్ మున్సిపాలిటీలో TUFIDC సహకారంతో మంచిర్యాల చౌరస్తా నుండి సోఫినగర్ (3400m) మరియు సాయిబాబా టెంపుల్ నుండి చించోలి (2300m)వరకు సెంట్రల్ లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేయుట. **అంచనా వ్యయం:** రూ. 320.00 లక్షలు. టెండరు ప్రక్రియ షెడ్యూల్: బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం: 03-07-2019, బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 22-07-2019న మ. 3.00గం. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 22-07-2019న మ.3.30గం. ధర బిడ్ తెరుచు తేది: 22-07-2019న సా. 5.30గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్: https:// tender.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TUFIDC, యూనిట్-IV, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్

DIPR RO No.505-DP/CL/Advt/1/2019-20, Dt: 2/7/2019

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం & మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

**NIT No. 01 to 07, 41, 36, 08, 50, 26/SE/TUFIDC/UNIT-III/MBNR/2019-20, తేది: 29-06-2019 (2వ & 3వ పిలుపు).** మహబూబ్‌నగర్, షాద్‌నగర్ మున్సిపాలిటీలలో జంక్షన్ అభివృద్ధి, అంబేద్కర్ విగ్రహం, క్లాక్ టవర్ జంక్షన్‌కు అభివృద్ధి పనులు, మోడరన్ గ్రేవ్ యార్డ్ నిర్మాణం మొ|| పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: రూ. 1640.50లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది: 01-07-2019 నుండి 08-07-2019, ఫోన్ నం. 7416421348, ఇమెయిల్: se.unit3.tufidc@gmail.com. తదుపరి వివరాల కొరకు https://tender.telangana.gov.in దర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), యూనిట్-III, TUFIDC, మహబూబ్‌నగర్

DIPR RO No.506-DP/CL/Advt/1/2019-20, Dt: 2/7/2019

తెలంగాణ ప్రభుత్వము
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగు పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ కార్యాలయం (ఇంజినీరింగ్), PCC-III, ఖైరతాబాద్, హైదరాబాద్

| ఇ-టెండరు ప్రకటన నెం. మరియు తేది | పని పేరు | సుమారు అంచనా కాంట్రాక్టు విలువ (లక్షలలో) |
|---|---|---|
| EP.No.10/CGM (E)/PCC-III/ పెరిఫెరల్/పంపులు పటాన్‌చెరు నుండి బీరంగూడ/2019-20 తేది: 02-07-2019 (3వ పిలుపు | 2 సంవత్సరాల కాలానికి MOM కలిపి బీరంగూడ వద్ద ELRSకి పటాన్‌చెరు GLSR నుండి నీరు పంప్ చేయుటకు స్క్విరల్ కేజ్ ఇండక్షన్ మోటార్లతో ప్రతి దానికి 83Mt హెడ్‌తో 750 cum/Hr డిస్చార్జి సామర్థ్యం గల 3 నెం.ల హారిజాంటల్ సెంట్రీఫ్యూగల్ పంపుసెట్లు కలిగిన క్లియర్ వాటర్ పంపింగ్ ప్లాంటు తయారీ, సరఫరా, బట్వాడా, స్థాపన మరియు పని చేయించుట | రూ. 377.21 |

1. ECV మరియు EMD మరియు ఇతర వివరాలు ఆన్‌లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో చూడవచ్చును.
2. బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభ తేది **05-07-2019** మరియు ముగింపు తేది ఆన్‌లైన్ NITలో లభిస్తుంది.
3. సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా – **చీఫ్ జనరల్ మేనేజర్** (Engg), **ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ సర్కిల్**-III, HMWSSB, **ఖైరతాబాద్, హైదరాబాద్-500 004.**
4. సమాచారమును నిర్దిష్టముగా 'ZIP' ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కాంట్రాక్టర్లు/సంస్థలు కోరబడుతున్నారు.
5. తదుపరి వివరాలను **http://www.tender.telangana.gov.in**లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), PCC-III, ఖైరతాబాద్, హైదరాబాద్-04

# వరదలో కారు మునిగి ఇద్దరు మృతి

### ముంబైలో విషాద ఘటన



**ముంబై:** ముంబైలో కురిసిన కుండపోత వానకు ఇద్దరు స్నేహితులు అనూహ్యంగా మృతి చెందారు. ఇర్ఫాన్ ఖాన్ (37), గుల్షాద్ షేక్(38) సోమవారం రాత్రి 11.30కు కారులో ఇంటికి తిరిగివస్తున్న సమయంలో వర్షంతో మలాడ్ వద్ద సబ్‌వేలో భారీగా వరద నీరు చేరింది. సబ్‌వే లోతు గమనించని వారు అలాగే ముందుకు వెళ్లి నీటిలో చిక్కుకున్నారు. ఇంజిన్‌లోకి నీరు చేరి కారు ఆగిపోయింది. తలుపులు మూసుకుపోవడంతో వారు బయట పడలేకపోయారు. కొందరు గమనించి కారును నీటి నుంచి బయటకు లాగారు. ఇర్ఫాన్ ఖాన్, గుల్షాద్ షేక్ అందులో అచేతనంగా పడి ఉండటంతో స్థానిక దవాఖానలో చేర్చారు. అయితే చికిత్స పొందుతూ వారిద్దరు చనిపోయారని పోలీస్ అధికారి తెలిపారు.

# ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

### 'ముంబై మునక'పై ప్రతిపక్షాలు విమర్శలు

**ముంబై:** వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టనందు వల్లే ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రజలకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మహారాష్ట్రలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు అశోక్ చౌహాన్ ట్వీట్ చేస్తూ 'వర్షాల వల్ల చాలా ప్రాంతాలు నీట మునిగాయి. చివరికి బాంద్రాలోని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే నివాస ప్రాంతం కూడా నీట మునిగింది. బీజేపీ, శివసేన నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం, నగరపాలక సంస్థ ఏం చేస్తున్నాయి? ప్రజల ఇబ్బందులను పట్టించుకోరా? వెంటనే ప్రజలకు ప్రభుత్వం, నగరపాలక సంస్థ క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఎన్సీపీ నేత ధనుంజయ్ ముండే మాట్లాడుతూ ముంబైలో ఇకపై ఏ ప్రాంతాలు కూడా నీట మునగవని బీజేపీ-శివసేన ప్రభుత్వం హామీలను గుప్పించిందని, కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటని ప్రశ్నించారు.

# రన్‌వే నుంచి పక్కకు వెళ్లిన విమానం

### ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



**ముంబై:** ముంబై ఎయిర్‌పోర్టులో దిగబోయిన ఓ విమానం అదుపుతప్పి రన్‌వే నుంచి పక్కకు వెళ్లింది. ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. స్పైస్‌జెట్‌కు చెందిన ఎస్‌జీ237 విమానం సోమవారం రాత్రి 11.45కి జైపూర్ నుంచి ముంబైకి చేరింది. భారీ వర్షాల కారణంగా విమానాశ్రయం రన్‌వేపైకి వర్షం నీరు చేరడంతో ఆ విమానం ల్యాండ్ అవుతుండగా అదుపుతప్పింది. రన్‌వే నుంచి ఓ పక్కకు జారిపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఏమీ కాలేదని, అందరూ సురక్షితంగానే ఉన్నారని ఓ అధికారి వెల్లడించారు. కాగా ఈ ఘటన కారణంగా అధికారులు ముంబై విమానాశ్రయం ప్రధాన రన్‌వేను మూసివేసి మరో రన్‌వేను అందుబాటులోకి తెచ్చారు. పలు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. కొరియాకు చెందిన సియోల్-ముంబై విమానాన్ని అహ్మదాబాద్‌కు, లుఫ్తాన్సాకు చెందిన ఫ్రాంక్‌ఫర్ట్-ముంబై విమానంతోపాటు ఎయిరిండియాకు చెందిన బ్యాంకాక్-ముంబై విమానాన్ని ఇతర విమానాశ్రయాలకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.



# ముంబై అతలాకుతలం

## మలాడ్‌లో గోడ కూలి 21 మంది దుర్మరణం

### వర్షాలతో స్తంభించిన రోడ్డు, రైలు రవాణా.. 203 విమానాలు రద్దు

### నగరానికి సెలవు ప్రకటించిన మహారాష్ట్ర సర్కార్

### రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35 మంది మృతి

**ముంబై, జూలై 2:** కుండపోత వర్షాలతో ముంబై నగరంలో జనజీవనం స్తంభించింది. నగరంలోని అనేక ప్రాంతాలు జలమయం కాగా, మంగళవారం ఉదయం మలాడ్ ప్రాంతంలో ఓ గోడ కూలిన ప్రమాదంలో 21 మంది దుర్మరణం పాలయ్యారు. ఆదివారం నుంచి ఎడతెరిపిలేని వర్షాల కారణంగా రైలు, రోడ్డు మార్గాలు స్తంభించిపోగా, విమానయానం కూడా ప్రభావితమైంది. దూర ప్రాంతాలకు వెళ్లే 20 రైళ్లు రద్దు కాగా, ప్రతికూల వాతావరణం కారణంగా 203 విమానాలు రద్దయ్యాయి. భారీ వర్షాలు మరో 48 గంటలు కొనసాగనున్నాయన్న హెచ్చరికల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నగరానికి సెలవు ప్రకటించింది. ప్రజలను ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించింది. నగరంలో ప్రవహించే మీఠీ నది పొంగి పొర్లుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా కుర్లా ప్రాంతం నుంచి వెయ్యిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షం కారణంగా జరిగిన ప్రమాదాల్లో మొత్తం 35 మంది మృతి చెందారు. ముంబైలో గత 44 ఏండ్లలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు కురవడం ఇది రెండోసారి. భారీ వర్షాలతో శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే నివాసం మాతోశ్రీ వద్ద భారీగా నీళ్లు నిలిచిపోయాయి. బాంద్రాలోని కళానగర్ కాలనీలోగల మాతోశ్రీవద్ద మోకాలు లోతు వరకు నీరు చేరిందని మున్సిపల్ అధికారులు తెలిపారు. నగర పురపాలక సంస్థను నియంత్రిస్తున్న శివసేన అధినేత ఇంటి వద్దనే మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

### ప్రభుత్వ సెలవు

ముంబై నగరంతోపాటు శివార్లలో కూడా భారీ వర్షాలు మరో రెండు రోజులు కొనసాగుతాయని వాతావరణ విభాగం తెలిపింది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం మంగళవారం ముంబై నగరంలో సెలవు ప్రకటించింది. ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్ మినహా ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయి. కొన్ని విద్యుత్ పంపిణీ కంపెనీలు కూడా ముందు జాగ్రత్త చర్యగా ముంబై శివార్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేశాయి. నగర రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిన నేపథ్యంలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి తప్ప ఎక్కడా ట్రాఫిక్ స్తంభించలేదని అధికారులు చెప్పారు. అయితే సెలవు కారణంగా ఎక్కువ వాహనాలు రోడ్లపైకి రాలేదన్నారు. నగరంలోని ప్రధాన రహదారులపై ఉన్న నాలుగు సబ్‌వేలను మూసివేశారు.



ముంబైలోని నాలా సోపారాలో జలమయమైన రోడ్లు



వర్షపు నీటిలో ముంబై వాసుల పాట్లు

### 44 ఏండ్లలో రెండోసారి

1974 తరువాత ముంబైలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు కురవడం ఇది రెండోసారి. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య ఆరు గంటల్లో 200 మి.మీ. వర్షపాతం నమోదైంది. మొత్తంగా 24 గంటల్లో 375.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ముంబైలో జూన్ 28 నుంచి భారీ వర్షాలు మొదలు కాగా, మంగళవారం ఉదయం వరకు నగరంలో 794.8 మి.మీ. వర్షం కురిసింది. 2005, జూలై 26న ముంబై చరిత్రలోనే అత్యధికంగా.. 24 గంటల వ్యవధిలో 944 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాడు వర్షాలు సృష్టించిన బీభత్సానికి వెయ్యి మందికి పైగా మృతి చెందారు. అంతకుముందు 1974, జూలై 5న కూడా 375.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత పదేండ్ల సగటుతో పోలిస్తే జూలై నెల అంతటిలో నమోదయ్యే వర్షపాతం మొత్తం గత 24 గంటల్లోనే కురిసిందని వాతావరణ విభాగం తెలిపింది. నగరంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు ఇండ్లు విడిచి బయటకు రాకూడదని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సూచించారు.

### విమానాల రద్దు

**భా**రీ వర్షాల ప్రభావం ముంబైలోని రెండు ప్రధాన విమానాశ్రయాలపై పడింది. ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో వానల దెబ్బకు ఏకంగా 203 విమానాలను రద్దు చేశారు. స్పైస్‌జెట్‌కు చెందిన ఒక విమానం.. రన్‌వే నుంచి జారి ముందుకు పోవడంతో ఆ మార్గాన్ని మూసివేశారు. కాగా, పలు విమానాలను దారి మళ్లించారు. ముంబైకి రావాల్సిన లేదా ఇక్కడి నుంచి బయల్దేరాల్సిన 203 విమానాలు రద్దయ్యాయని మరో 350 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని అధికారులు చెప్పారు. వీటిలో పలు అంతర్జాతీయ విమానాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లాల్సిన అన్ని విమానాలను మంగళవారం రద్దు చేశారు.

### ఆగిన లైఫ్‌లైన్

**భా**రీ వర్షాలతో ముంబైకి లైఫ్‌లైన్‌గా పేర్కొనే లోకల్ రైళ్లు స్తంభించాయి. లోకల్ రైళ్లను పరిమిత మార్గాల్లోనే నడుపుతున్నట్టు సెంట్రల్ రైల్వే తెలిపింది. పలు రైలు మార్గాల్లో పట్టాలపై నీరు నిలిచిపోవడంతో ఆ మార్గాల్లో రైళ్లను నడుపడం లేదన్నది. సోమవారం అర్ధరాత్రి పలు లోకల్ రైళ్లు గమ్యస్థానాలను చేరకుండా మార్గమధ్యంలోనే నిలిచిపోయాయి. దీంతో వేల మంది ప్రయాణికులు రైళ్లలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వారికి రైల్వే పోలీసులు చాయ్, బిస్కెట్లు, ఆహార పదార్థాలు అందజేశారని అధికారులు తెలిపారు. పలు లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో ముంబై నగర శివార్లలో నడిచే సబర్బన్ లోకల్ రైళ్లు సైతం ఆగిపోయాయని చెప్పారు. కొన్ని మార్గాల్లో సిగ్నలింగ్ వ్యవస్థ ధ్వంసం కావడంతో లోకల్ రైళ్లతోపాటు దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను కూడా నిలిపివేశామని అన్నారు. సెంట్రల్, పశ్చిమ రైల్వేలకు చెందిన 20 రైళ్లను రద్దు చేయడం లేదా ప్రయాణ నిడివిని తగ్గించడం జరిగిందని చెప్పారు.




ముంబైలో సియన్ రైల్వేస్టేషన్‌లోకి వర్షపు నీరు రావడంతో నిలిచిపోయిన లోకల్ రైలు

### 21 మందిని బలిగొన్న రిజర్వాయర్ గోడ



**భా**రీ వర్షాలతో మలాడ్ తూర్పు ప్రాంతంలో రాణీ సతీమార్గ్ వద్ద నగర మున్సిపల్ కార్పొరేషన్ రిజర్వాయర్ సరిహద్దు గోడ కూలిందని అధికారులు చెప్పారు. దీంతో ఆ గోడకు ఆనుకొని గుడిసెలు వేసుకున్న పేదలు శిథిలాల కింద నలిగిపోయారని తెలిపారు. తెల్లవారు జామున రెండు గంటల సమయంలో బాధితులు మంచి నిద్రలో ఉండగా వారి ఇండ్లపై గోడ కూలిందని జాతీయ విపత్తు సహాయ దళం అధికారులు చెప్పారు. గోడకు ఒకవైపు భారీ స్థాయిలో వర్షపు నీరు చేరడంతో తీవ్ర ఒత్తిడి వల్ల అది కుప్పకూలిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో ఒక్కసారిగా వర్షపు నీరు సునామీలా వచ్చి మీద పడిందని అన్నారు. తమకు పిలుపు వచ్చిన వెంటనే జాగిలాల సాయంతో అక్కడ సహాయ చర్యలు చేపట్టామని (ఎన్డీఆర్ఎఫ్) అధికారులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్‌తోపాటు అగ్నిమాపక దళం, స్థానిక పోలీసులు కూడా సహాయ చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన దాదాపు 80 మందిని వివిధ దవాఖానలకు తరలించామని అధికారులు చెప్పారు. కాండీవలిలోని కురార్ గ్రామంలో కూడా మరో గోడ కూలిన ఘటనలో 51 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

#### ముజే బాహర్ నికాలో..

ముంబైలో కురిసిన వర్షాలతో పింప్రీపాడా ప్రాంతంలో కూలిన గోడ శిథిలాల్లో చిక్కుకున్న బాలిక సంచిత గనోరె (15) మృత్యువాత పడింది. దాదాపు 12 గంటల తర్వాత మంగళవారం మధ్యాహ్నం ఆమెను సహాయ సిబ్బంది బయటకు తీశారు. కానీ ఆమె ప్రాణాలను కాపాడలేకపోయారు. ఘటనాస్థలంలోనే ఉన్న వైద్య బృందానికి సారథ్యం వహించిన డాక్టర్ ఒకరు మాట్లాడుతూ తాము సంచిత ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఆమె కాళ్లు శిథిలాల మధ్య చిక్కుకోవడంతో రక్షించడం అసాధ్యమైందని సహాయ సిబ్బంది చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటలకు కూలిపోయిన గోడ శిథిలాల కింద చిక్కుకుపోయినప్పటి నుంచి సంచిత 'ముజే బాహర్ నికాలో (నన్ను బయటకు తీయండి)' అని పదేపదే కేకలేసిందని స్థానికులు చెప్పారు. గంటల తరబడి రక్షించాలని కేకలేయడంతో గొంతు జీరబోయిందని, తాగడానికి నీళ్లివ్వండని అభ్యర్థించిందని, కానీ ఆమెను కాపాడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



సాకినాకా పోలీసు స్టేషన్‌లో నీరు

## రుతుపవనాలపై ఆందోళన వద్దు

### త్వరలో సాగు పుంజుకుంటుంది

### కేంద్రమంత్రి తోమర్

**న్యూఢిల్లీ:** రుతుపవనాల పురోగమనంపై చింతించాల్సిన అవసరం లేదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అన్నారు. జూన్ నెలలో 33 శాతం లోటు వర్షపాతంతో వానాకాలం పంటలు ప్రభావితమైనప్పటికీ విత్తనాలు వేయడం త్వరలో పుంజుకుంటుందని ఆయన పేర్కొన్నారు. రానున్న నెలల్లో వర్షపాతం సాధారణంగా ఉంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొన్న నేపథ్యంలో వరి తదితర పంటల సాగు పుంజుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గుర్తించిన వానాకాలం పంటలకు కనీస మద్దతు ధర ఖరారుపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## జలాంతర్గామిలో అగ్నిప్రమాదం


### 14 మంది మృతి; రష్యాలో ఘటన

**మాస్కో:** రష్యాకు చెందిన జలాంతర్గామిలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. తన ప్రాదేశిక జలాల్లోని సముద్రగర్భంలో పరిశోధన జరుపుతుండగా అగ్నిప్రమాదం సంభవించి 14 మంది నౌకాదళ సిబ్బంది మరణించారు. రక్షణ శాఖ అధికారులు మాట్లాడుతూ తమ జలాంతర్గామి సోమవారం సముద్రగర్భంలో పరిశోధనలు చేస్తుండగా అగ్నిప్రమాదం సంభవించిందని, దీంతో విషవాయువులు వెలువడటంతో వాటిని పీల్చి 14 మంది సిబ్బంది మరణించారని చెప్పారు. ఈ జలాంతర్గామిని ఆర్కిటిక్ సముద్ర తీరంలోని తమ సైనిక స్థావరానికి తరలించామన్నారు.

## రైల్వేల కార్పొరేటీకరణ సరికాదు

### ప్రైవేటీకరణ దిశగా ఇది తొలి అడుగు

### లోక్‌సభలో సోనియాగాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ:** మోదీ సర్కార్‌పై యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ మంగళవారం లోక్‌సభలో తీవ్ర విమర్శలు గుప్పించారు. తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీతో (ఎంసీఎఫ్‌తో) సహా రైల్వే తయారీ కేంద్రాలను 'కార్పొరేటైజేషన్' చేయాలన్న రైల్వే శాఖ ప్రతిపాదనను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. కార్పొరేటీకరణ అంటే ప్రైవేటీకరణ దిశగా తొలి అడుగని ఆరోపించారు. ఆమె ఆరోపణలను రైల్వే శాఖ తోసిపుచ్చింది. లోక్‌సభలో జీరో అవర్‌లో అందరికంటే ముందు ఆమె మాట్లాడారు. జీర్ అవర్‌లో ఆమె ఓ అంశం లేవనెత్తడం చాలా అరుదు. 'కార్పొరేటీకరణ అంటే ప్రైవేటీకరణ దిశగా తొలి అడుగు. దేశ ఆస్తులను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు చౌకధరలకు ప్రభుత్వం కట్టబెడుతున్నది. దీని వల్ల వేలమంది నిరుద్యోగులుగా మిగులుతారు' అని ఆమె ధ్వజమెత్తారు. 'మేకిన్ ఇండియా' ప్రోత్సాహానికి యూపీఏ హయాంలో ఈ యూనిట్లను ప్రారంభించామన్నారు. రాయ్‌బరేలీలోని ఎంసీఎఫ్.. రైల్వేలోనే అధునాతన ఫ్యాక్టరని, అత్యుత్తమ రైల్వే కోచ్‌లను తక్కువ ధరలకే ఇక్కడ తయారు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం దాన్ని కార్పొరేటీకరించాలని ఎందుకనుకుంటున్నదో అర్థం చేసుకోవడం కష్టమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 2000 మంది ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని చెప్పారు. రైల్వే బడ్జెట్‌ను మోదీ సర్కారు నిలిపివేయడాన్ని సోనియా తప్పుబట్టారు. పీఎస్‌యూలు ఆధునిక దేవాలయాలు అని దేశ తొలి ప్రధాని నెహ్రూ అభివర్ణించారని, అయితే నేడు ఈ దేవాలయాలు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# హాంకాంగ్‌పై చైనా గుర్రు

### పార్లమెంట్‌పై దాడి ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్

### జోక్యం చేసుకోవద్దని అమెరికా, బ్రిటన్, ఈయూకి హెచ్చరిక



**బీజింగ్, జూలై 2:** హాంకాంగ్‌లో సోమవారం నిరసనకారులు పార్లమెంట్‌పై దాడికి దిగడం ద్వారా తన 'అధికారాన్ని' సవాల్ చేసిన నేపథ్యంలో ఆ ఘటనపై నేర విచారణ జరిపించాలని చైనా డిమాండ్ చేసింది. చైనాకు నేరస్థులను అప్పగించేందుకు ఉద్దేశించిన బిల్లుకు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన నిరసనలతో హాంకాంగ్‌లో సంక్షోభం తలెత్తిన విషయం తెలిసిందే. బ్రిటన్‌కున్న లీజు ముగిశాక, 1997లో హాంకాంగ్‌ను తిరిగి చైనాకు అప్పగించి 22 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో సోమవారం ప్రజలు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. నిరసకారులు పార్లమెంట్‌ను ముట్టడించి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పార్లమెంట్ హాల్లో బ్రిటిష్ వలస కాలం నాటి జెండాను ఎగురవేశారు. 'హాంకాంగ్.. చైనా కాదు' అంటూ గోడలపై రాశారు. ఈ పరిణామాలు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సవాల్‌గా పరిణించమించడంతో.. హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని హాంకాంగ్‌కు చైనా స్పష్టం చేసింది. అలాగే నిరసనకారులకు మద్దతుగా అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రకటనలు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. గత మూడు వారాలుగా ప్రజల నిరసనలతో హాంకాంగ్ అట్టుడుకుతున్నది. చైనా నియమించిన హాంకాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ క్యారీ లామ్ రాజీనామా చేయాలని, నేరస్థుల అప్పగింత బిల్లును శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

#### ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు: చైనాకు బ్రిటన్ హెచ్చరిక

హాంకాంగ్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకున్న అసాధారణ పరిణామాలపై బ్రిటన్ స్పందించింది. ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని చైనాను బ్రిటన్ విదేశాంగ మంత్రి జెరెమీ హంట్ హెచ్చరించారు. 'హాంకాంగ్ చైనాలో అంతర్భాగం. దాన్ని మనం ఒప్పుకోవాల్సిందే. అయితే చైనాకు హాంకాంగ్‌ను అప్పగించే సమయంలో కుదిరిన ఒప్పందంలో హాంకాంగ్‌కు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పొందుపరచడం జరిగింది. ఈ ఒప్పందాన్ని గౌరవిస్తారని భావిస్తున్నాం. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ఆయన స్పష్టం చేశారు.

### జగన్నాథ రథయాత్రకు

## నుస్రత్ జహాన్


### ఇస్కాన్ ఆహ్వానానికి ఎంపీ అంగీకారం



**కోల్‌కతా, జూలై 2:** పశ్చిమ బెంగాల్‌కు చెందిన నటి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ నుస్రత్ జహాన్ తన భర్తతో కలిసి ఈ నెల 4న కోల్‌కతాలో నిర్వహించే జగన్నాథ రథయాత్రలో పాల్గొననున్నారు. తమ ఆహ్వానానికి ఆమె అంగీకరించడంపట్ల ఇస్కాన్ అధికార ప్రతినిధి రాధారమన్ దాస్ కృతజ్ఞతలు తెలిపారు. 'నుస్రత్ జహాన్ నవ భారత్‌కు నిజమైన ప్రతినిధి. అఖండ భారత సంస్కృతిని ఆమె ప్రతిబింబిస్తున్నారు. ఇతర మతాల నమ్మకాన్ని గౌరవించడం, వారి పండుగల్లో పాల్గొనడం భారత్‌కు గొప్ప నిదర్శనం. భారత దేశం గొప్పదనం అందులోనే ఉంది. నుస్రత్ జహాన్ వంటి యువత నిజంగా మెరుగైన సమాజం వైపు రోడ్డు చూపుతున్నారు' అని ఆయన ట్వీట్ చేశారు. ఇస్కాన్ రథయాత్ర కూడా సామాజిక సామరస్యంలో భాగమేనని తెలిపారు.

# పర్యావరణ హిత న్యాప్‌కిన్‌లు!

### రూపొందించిన మేఘాలయ మహిళ



**షిల్లాంగ్:** నేల, వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు, రుతుక్రమ సమయంలో మహిళల్లో పరిశుభ్రత పెంపుదలకు మేఘాలయ మహిళ ఒకరు తొలిసారి పర్యావరణ హిత న్యాప్‌కిన్లు రూపొందించారు. రుతుక్రమ సమయంలో మహిళల్లో పరిశుభ్రతపై కేంద్రం నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన షైదాలిన్ మార్బనియాంగ్.. సింటూ పేరిట గత నెలలో సొంత న్యాప్‌కిన్ బ్రాండ్ ప్రారంభించారు. 'మా గ్రామంలో బాలికలు, మహిళలకు ఆరోగ్యకరమైన ప్యాడ్స్ అందుబాటులో లేకపోవడం నన్ను కలవరపరిచింది. అంతేగాక భూమిలో కలిసిపోని ప్యాడ్‌లతో పర్యావరణానికి హాని జరుగుతున్నది. మేం ఉత్పత్తి చేస్తున్న కొత్త ప్యాడ్లను 95% వరకు విచ్ఛిన్నమయ్యే సామగ్రితోనే తయారుచేస్తున్నం' అని మార్బనియాంగ్ తెలిపారు. ప్రస్తుతం రోజుకు 300 ప్యాడ్లు చేస్తున్నామన్నారు. శానిటరీ న్యాప్‌కిన్ తయారీ యంత్రం కోసం మార్బనియాంగ్.. మేఘాలయ బేసిన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంబీడీఏ) ఆధ్వర్యంలో పనిచేసే లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్‌ను సంప్రదించారని, అందుకు అధికారులు సంతోషంగా సమ్మతించారని ఓ ఎంబీడీఏ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఒక్కో ప్యాడ్‌ను రూ.6లకు విక్రయిస్తున్నారని, ఆమె వ్యాపార విస్తరణకు ఎంబీడీఏ సహకారం అందిస్తుందని ఆయన చెప్పారు.

### 'గగన్‌యాన్' వ్యోమగాములకు

## రష్యా శిక్షణ

### ఒప్పందం కుదుర్చుకున్న ఇస్రో

**బెంగళూరు, జూలై 2:** ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' మిషన్ కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. రష్యాతో ఒప్పందం కుదుర్చుకున్నది. వ్యోమగాముల ఎంపిక, వైద్య పరీక్షలు, అంతరిక్ష సంబంధిత శిక్షణ కోసం రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ రోస్కోస్మాస్‌కు అనుబంధ సంస్థ అయిన గ్లావ్‌కోస్మాస్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నది. గ్లావ్‌కోస్మాస్ తొలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నటాలియా లోక్టేవా, ఇస్రోకు చెందిన హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ గత నెల 27న ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

# యూపీ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం

- ఎస్సీ జాబితాలో ఓబీసీలను చేర్చడంపై కేంద్రం స్పష్టీకరణ
- ఆ అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉన్నదని వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 2:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని బీజేపీ సర్కారుకు ఎదురుదెబ్బ తగిలింది. ఓబీసీ (ఇతర వెనుకబడిన వర్గాలు) జాబితాలోని అత్యంత వెనుకబడిన 17 కులాలను ఎస్సీ జాబితాలో చేరుస్తూ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. కులాల జాబితాలో మార్పులు చేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. 'యూపీ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు సరికాదు. రాజ్యాంగ విరుద్ధం. ఆ ఉత్తర్వుల ప్రకారం ధ్రువపత్రాలు జారీ చేయొద్దని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. లేకపోతే ఈ అంశం కోర్టుకెళ్తుంది. కోర్టు దాన్ని కొట్టివేస్తుంది. దీని వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు' అని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిక శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ రాజ్యసభలో పేర్కొన్నారు. యూపీ ప్రభుత్వం ఈ విషయంలో ముందుకెళ్లాలనుకుంటే అందుకు అవసరమైన పద్ధతిని అనుసరించాలని, ముందుగా కేంద్రానికి ప్రతిపాదనను పంపాలని సూచించారు. గతంలో ఇలాంటి మూడు ప్రతిపాదనలు పార్లమెంటు ముందుకు వచ్చినా ఆమోదం పొందలేదని గుర్తుచేశారు. బీఎస్పీ సభ్యుడు సతీశ్ మిశ్రా మంగళవారం జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. జాబితాలో మార్పులు చేసే అధికారం రాష్ట్రపతికి కూడా లేదని ఆయన అన్నారు.

## జూన్.. రికార్డు 'హాట్'!

### ప్రపంచవ్యాప్తంగా 0.1 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర అధిక ఉష్ణోగ్రతలు

**పారిస్:** ఇంతకుముందెన్నడూ లేని అత్యధిక ఉష్ణోగ్రతలతో గత జూన్ మాసం రికార్డులకెక్కింది. గతేడాదితో పోలిస్తే, ప్రపంచవ్యాప్తంగా జూన్ నెలలో సాధారణం కంటే 0.1 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, యూరప్‌లో 2 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర అధికంగా రికార్డయ్యాయని యూరోపియన్ యూనియన్ ఆధ్వర్యంలో పనిచేసే కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ సంస్థ వెల్లడించింది. ఫ్రాన్స్, జర్మనీ, ఉత్తర స్పెయిన్, ఇటలీలలో సాధారణం కంటే 10 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వివరించింది. అయితే ఇందుకు వాతావరణ మార్పులే ప్రత్యక్ష కారణమని చెప్పలేమని కోపర్నికస్ బృందం అభిప్రాయపడగా, భూతాపం కారణంగానే వడగాడ్పులు ఐదు రెట్లు పెరిగాయని మరో శాస్త్రవేత్తల బృందం పేర్కొంది.

ఆట నమస్తే తెలంగాణ
క్రికెట్ సమరం WORLD CUP
కరీంనగర్ | WWW.NTNEWS.COM | బుధవారం 3 జూలై 2019 | 10

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1.✔ | ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | +1.00 | 14 |
| 2.✔ | భారత్ | 8 | 6 | 1 | 1 | +0.81 | 13 |
| 3. | న్యూజిలాండ్ | 8 | 5 | 2 | 1 | +0.57 | 11 |
| 4. | ఇంగ్లండ్ | 8 | 5 | 3 | 0 | +1.00 | 10 |
| 5. | పాకిస్థాన్ | 8 | 4 | 3 | 1 | -0.79 | 9 |
| 6. | శ్రీలంక | 8 | 3 | 3 | 2 | -0.93 | 8 |
| 7. | బంగ్లాదేశ్ | 8 | 3 | 4 | 1 | -0.19 | 7 |
| 8. | దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.08 | 5 |
| 9. | వెస్టిండీస్ | 8 | 1 | 6 | 1 | -0.33 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 8 | 0 | 8 | 0 | -1.41 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు, ✔ - అర్హత

**వరల్డ్‌కప్‌లో నేడు** ఇంగ్లండ్ X న్యూజిలాండ్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

**అత్యధిక పరుగులు** 544 రోహిత్ (ఇండియా) | **అత్యధిక వికెట్లు** 24 స్టార్క్ (ఆస్ట్రేలియా)

# సగర్వంగా.. సెమీస్‌కు

## బంగ్లాపై విజయంతో వరుసగా మూడోసారి నాకౌట్ చేరిన భారత్
## రోహిత్ రికార్డు సెంచరీ.. మెరిసిన బుమ్రా, పాండ్యా, రాహుల్

**4**
ఒకే ప్రపంచకప్‌లో 4 సెంచరీలు చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గా రోహిత్ రికార్డుల్లోకెక్కాడు. గతంలో సంగక్కర (2015లో) మాత్రమే ఈ ఫీట్ సాధించాడు. భారత్ తరపున గంగూలీ (2003లో) అత్యధికంగా 3 శతకాలు నమోదు చేశాడు.

**2**
విశ్వసమరంలో రోహిత్ 5 సెంచరీలతో పాంటింగ్, సంగక్కరతో కలిసి రెండో స్థానానికి చేరాడు. సచిన్ (6) అగ్రస్థానంలో ఉన్నాడు.

**2**
మన దేశం తరపున ఒక ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గా రోహిత్ (544) నిలిచాడు. సచిన్ (2003లో 673 పరుగులు) టాప్‌లో ఉన్నాడు.


రోహిత్ (104)

KTR @KTRTRS
Congratulations #TeamIndia on making it to semifinals. Two wins away from bringing the cup home. Good luck boys #BleedBlue
11:08 PM · 02 Jul 19 · Twitter for Android

'సెమీఫైనల్‌కు అర్హత సాధించిన టీమ్‌ఇండియాకు శుభాకాంక్షలు. ప్రపంచకప్‌ను దేశానికి తీసుకొచ్చేందుకు మరో రెండు విజయాల దూరమే ఉంది. గుడ్‌లక్ బాయ్స్'
- కేటీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

**1**
ప్రపంచకప్ చరిత్రలో 500 పరుగులు, 10 వికెట్లు తీసిన తొలి ఆటగాడిగా షకీబ్ రికార్డు సృష్టించాడు. గతంలో స్కాట్ స్టైరీస్ (న్యూజిలాండ్; 499 పరుగులు, 10 వికెట్లు) అత్యుత్తమ ప్రదర్శనను వెనక్కినెట్టాడు.

**180**
ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం. గతంలో 2015 టోర్నీలో ఐర్లాండ్‌పై రోహిత్-ధవన్ నమోదు చేసిన 174 పరుగులు రెండో స్థానానికి చేరింది.

ఓపెనర్లు మరోసారి అదరగొట్టారు. హిట్‌మ్యాన్ రోహిత్ మెగాటోర్నీలో నాలుగో సెంచరీతో రెచ్చిపోతే.. లోకేశ్ రాహుల్ చక్కటి ఇన్నింగ్స్‌తో విలువ చాటుకున్నాడు. వరుస అర్ధశతకాలతో జోరుమీదున్న విరాట్ ఆకట్టుకోలేకపోయినా.. యంగ్ తరంగ్ రిషబ్ పంత్ చెలరేగిపోయాడు. ధోనీ టెస్టు ఇన్నింగ్స్‌తో మరోసారి విసిగించినా.. భారత్ భారీ స్కోరే చేసింది. సంచలనాలకు కేంద్రబిందువైన బంగ్లా మ్యాజిక్ చేసేలా కనిపించినా.. బ్యాట్‌తో పవర్ చూపెట్టలేకపోయిన పాండ్యా బంతితో కీలక వికెట్లు తీసి బదులు తీర్చుకున్నాడు. పోరాడిన లోయర్ ఆర్డర్‌ను యార్కర్లతో బుమ్రా బెంబేలెత్తించాడు. ఫలితంగా భారత్ వరుసగా మూడోసారి సగర్వంగా సెమీఫైనల్లో అడుగుపెట్టగా.. బంగ్లాదేశ్ కట్టుకున్న కలల సౌధం కుప్పకూలింది.


బుమ్రా (4/55) హార్దిక్ (3/60) రాహుల్ (77)

**బర్మింగ్‌హామ్:** ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలన్న చందంగా.. రెండు రోజుల క్రితం ఏ పిచ్‌పై ఓటమి వెక్కిరించిందో.. అక్కడే టీమ్‌ఇండియా జయకేతనం ఎగురవేసింది. ఇంగ్లండ్ మ్యాచ్‌కు యాక్షన్ రీప్లేలా సాగిన పోరులో భారత్ జయభేరి మోగించి దర్జాగా సెమీఫైనల్లో అడుగుపెడితే.. 2007 ప్రపంచకప్‌లో మనకు భారీ షాక్ ఇచ్చిన బంగ్లా మాత్రం నిరాశగా ఇంటి బాటపట్టింది. ఇక తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై నెగ్గినా బంగ్లా నాకౌట్ దశకు చేరే అవకాశాలు లేవు. మంగళవారం ఎడ్జ్‌బాస్టన్ వికెట్‌పై జరిగిన మ్యాచ్‌లో విరాట్ సేన 28 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 314 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (92 బంతుల్లో 104; 7 ఫోర్లు, 5 సిక్సర్లు) రికార్డు స్థాయిలో ప్రపంచకప్‌లో నాలుగో సెంచరీ నమోదు చేయగా.. లోకేశ్ రాహుల్ (92 బంతుల్లో 77; 6 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (41 బంతుల్లో 48; 6 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టారు. బంగ్లా బౌలర్లలో ముస్తఫిజుర్ (5/59) ఆకట్టుకున్నాడు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లా 48 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. షకీబ్ అల్ హసన్ (74 బంతుల్లో 66; 6 ఫోర్లు), సైఫుద్దీన్ (38 బంతుల్లో 51 నాటౌట్; 9 ఫోర్లు) పోరాటం ఫలితాన్నివ్వలేదు. భారత బౌలర్లలో బుమ్రా (4/55), పాండ్యా (3/60) రాణించారు. రోహిత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

### పోరాడిన షకీబ్..

గత మూడు మ్యాచ్‌ల్లో తన పేస్‌తో ప్రత్యర్థిని బెంబేలెత్తిస్తున్న మొహమ్మద్ షమీ ఈ పోరులోనూ టీమ్‌ఇండియాకు శుభారంభం అందించాడు. చక్కటి షాట్లతో ముందుకు సాగుతున్న ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (22)ను బౌల్డ్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. మరోవైపు యార్కర్ కింగ్ బుమ్రా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడంతో తొలి పవర్ ప్లే ముగిసేసరికి బంగ్లా 40/1తో నిలిచింది. మరో ఓపెనర్ సౌమ్యా సర్కార్ (33; 4 ఫోర్లు) ఔటైనా.. కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న షకీబ్ మాత్రం చక్కటి షాట్లతో అలరించాడు. మూడో వికెట్‌కు 47 పరుగులు జోడించాక ముష్ఫికర్ రహీమ్ (24; 3 ఫోర్లు) వెనుదిరిగినా.. ఒక దశలో బంగ్లా 162/3తో పటిష్ఠంగానే కనిపించింది. అప్పటికే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న షకీబ్ క్రీజులో ఉండటంతో మొర్తజా సేన పోటీలోనే నిలిచింది. అయితే లిటన్ దాస్ (22), మొసద్దిక్ (3) వెంట వెంటనే ఔట్ కావడంతో ఒత్తిడి పెరిగిపోయింది. సాధించాల్సిన రన్‌రేట్ ఎక్కువవుతున్న తరుణంలో పాండ్యా బౌలింగ్‌లో షకీబ్ వెనుదిరగడంతో బంగ్లాకు భారీ షాక్ తగిలింది. చివర్లో షబ్బీర్ (36; 5 ఫోర్లు), సైఫుద్దీన్ (38 బంతుల్లో 51 నాటౌట్; 9 ఫోర్లు) భయపెట్టినా.. బుమ్రా చక్కటి బంతులతో షబ్బీర్, రూబెల్ (9), ముస్తఫిజుర్ (0) కథ ముంగించి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

### ఆఖరి 10 ఓవర్లలో 63/5..

38 ఓవర్లు పూర్తయ్యేసరికి భారత్ 237/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఓపెనర్లు వెనుదిరిగినా.. కోహ్లీ (26; 3 ఫోర్లు), పంత్ క్రీజులో ఉండటంతో ఇక తిరుగులేదనిపించింది. అయితే తదుపరి ఓవర్‌లో ముస్తఫిజుర్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. మూడు బంతుల వ్యవధిలో విరాట్‌తో పాటు పాండ్యా (0)ను పెవిలియన్ పంపాడు. పంత్ ప్రతాపం చూపినా.. మరో ఎండ్‌లో ధోనీ (33 బంతుల్లో 35; 4 ఫోర్లు) సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. ఇదే అదునుగా బంగ్లా ఒత్తిడి పెంచడంతో పరుగుల రాక గగనమైంది. దీంతో సిక్సర్‌కు యత్నించిన పంత్ క్యాచ్ ఔటయ్యాడు. ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న కార్తీక్ (8) ఆకట్టుకోలేకపోగా.. కొన్ని షాట్లు ఆడిన ధోనీ ఆఖరి ఓవర్‌లో ఔటయ్యాడు. భారత్ చివరి 10 ఓవర్లలో 63 పరుగులే చేసి 5 వికెట్లు కోల్పోయింది.

### రికార్డు ఓపెనింగ్..

ఇంగ్లండ్‌తో మ్యాచ్ అనుభవం మదిలో మెదులుతుండగా.. టాస్ గెలిచిన కోహ్లీ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ.. ఓపెనర్లు జట్టుకు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ప్రపంచకప్‌లోనే భారత్ తరపున అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం (180 పరుగులు) నమోదు చేసిన రోహిత్, రాహుల్ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. ఈ జోరు చూస్తుంటే భారీ స్కోరు పక్కా అనిపించినా.. ఆఖర్లో వేగంగా ఆడలేకపోవడంతో అనుకున్న దానికంటే తక్కువ స్కోరుకే పరిమితం కావాల్సి వచ్చింది. సిక్సర్‌తో ఖాతా తెరిచిన రోహిత్.. ఆ తర్వాత ఎక్కడా జోరు తగ్గించకపోగా రాహుల్ కూడా సాధికారికంగా ఆడాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టపోకుండా 69 పరుగులు చేసింది. ఈ క్రమంలో మొదట రోహిత్ శర్మ 45 బంతుల్లో.. ఆ తర్వాత లోకేశ్ 57 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. అక్కడి నుంచి గేరు మార్చిన రోహిత్ భారీ సిక్సర్లతో విరుచుకుపడి చూస్తుండగానే శతకానికి చేరువయ్యాడు. సెంచరీ ముందు కాస్త నెమ్మదించినా 90 బంతుల్లో ఈ ప్రపంచకప్‌లో నాలుగోసారి మూడంకెల మార్క్ దాటిన వెంటనే ఔటయ్యాడు. కాసేపటికే రాహుల్ కూడా వెనుదిరిగాడు.

"నాకౌట్ చేరడం ఆనందంగా ఉంది. గ్రౌండ్ పరిస్థితులను దృష్టి పెట్టుకునే ఐదుగురు బౌలర్లతో బరిలో దిగాం. చాలా ఏండ్లుగా రోహిత్‌ను గమనిస్తున్నా.. వన్డేల్లో అతడు అత్యుత్తమ బ్యాట్స్‌మన్. బుమ్రా ఓవర్లు మ్యాచ్‌ను మలుపు తిప్పుతాయని ముందే అనుకున్నా.
- కోహ్లీ, భారత కెప్టెన్

### భలే బామ్మ!



అభిమానానికి వయసు అడ్డంకి కాదని మరోమారు నిరూపితమైంది. తమ జాతీయ జట్టు విజయాన్ని ఆకాంక్షిస్తూ ఖండాంతరాలు దాటే అభిమానులు కొందరైతే.. ముదిమి వయసులోనూ ఆటను ఆస్వాదించేవాళ్లు మరికొందరు. ఈ రెండో కోవకు చెందిందే 87 ఏండ్ల చారులత పటేల్ అనే బామ్మ. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో ఈ బామ్మ చేసిన సందడి అంతా..ఇంతా కాదు. స్టాండ్స్‌లో ఫ్యాన్స్‌తో కలిసి పీక ఊదుతూ ఎంజాయ్ చేసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ బామ్మ.. కెప్టెన్ కోహ్లీని కలుసుకుని కొద్దిసేపు మాట్లాడింది.

### మిస్సైతే సెంచరీనే..

ఈ మెగాటోర్నీలో రోహిత్ నాలుగు సెంచరీలు బాదడం వెనుక ఓ సారూప్యత కనిపిస్తున్నది. ఆరంభంలో క్యాచ్ మిస్ అయిన ప్రతీసారి లైఫ్‌ను వినియోగించుకున్న హిట్‌మ్యాన్ దాన్ని భారీ స్కోరుగా మలిచాడు. తాజా మ్యాచ్‌లో 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తమీమ్ ఇక్బాల్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రోహిత్ ఆ తర్వాత చితక్కొట్టాడు. అంతకుముందు ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో 4 పరుగుల వద్ద రూట్ క్యాచ్ మిస్ చేయడాన్ని వాడుకొని102 పరుగులు కొట్టిన అతడు.. దక్షిణాఫ్రికాపై 1 పరుగు వద్ద క్యాచ్ మిస్ అయిన తర్వాత అజేయ శతకం (122 నాటౌట్) బాదాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో 32 పరుగుల వద్ద సులువైన రనౌట్ చాన్స్ నుంచి తప్పించుకున్న రోహిత్ భారీ శతకం(140)తో విజృంభించగా.. ఆసీస్‌పైనా 2 పరుగుల వద్ద క్యాచ్ మిస్ అవడంతో బతికిపోయి చక్కటి ఇన్నింగ్స్ (57)తో ఆకట్టుకున్నాడు.

### స్కోరు బోర్డు

**భారత్:** రాహుల్ (సి) ముష్ఫికర్ (బి) రూబెల్ 77, రోహిత్ (సి) లిటన్ (బి) సర్కార్ 104, కోహ్లీ (సి) రూబెల్ (బి) ముస్తఫిజుర్ 26, పంత్ (సి) మొసద్దిక్ (బి) షకీబ్ 48, పాండ్యా (సి) సర్కార్ (బి) ముస్తఫిజుర్ 0, ధోనీ (సి) షకీబ్ (బి) ముస్తఫిజుర్ 35, కార్తీక్ (సి) మొసద్దిక్ (బి) ముస్తఫిజుర్ 8, భువనేశ్వర్ (రనౌట్) 2, షమీ (బి) ముస్తఫిజుర్ 1, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 13, **మొత్తం:** 50 ఓవర్లలో 314/9. **వికెట్లపతనం:** 1-180, 2-195, 3-237, 4-237, 5-277, 6-298, 7-311, 8-314, 9-314, **బౌలింగ్:** మొర్తజా 5-0-36-0, సైఫుద్దీన్ 7-0-59-0, ముస్తఫిజుర్ 10-1-59-5, షకీబ్ 10-0-41-1, మొసద్దిక్ 4-0-32-0, రూబెల్ 8-0-48-1, సర్కార్ 6-0-33-1.

**బంగ్లాదేశ్:** తమీమ్ (బి) షమీ 22, సర్కార్ (సి) కోహ్లీ (బి) పాండ్యా 33, షకీబ్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 66, ముష్ఫికర్ (సి) షమీ (బి) చహల్ 24, లిటన్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 22, మొసద్దిక్ (బి) బుమ్రా 3, షబ్బీర్ (బి) బుమ్రా 36, సైఫుద్దీన్ (నాటౌట్) 51, మొర్తజా (సి) ధోనీ (బి) భువనేశ్వర్ 8, రూబెల్ (బి) బుమ్రా 9, ముస్తఫిజుర్ (బి) బుమ్రా 0, **ఎక్స్‌ట్రాలు:** 12, **మొత్తం:** 48 ఓవర్లలో 286 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-39, 2-74, 3-121, 4-162, 5-173, 6-179, 7-245, 8-257, 9-286, 10-286, **బౌలింగ్:** భువనేశ్వర్ 9-0-51-1, బుమ్రా 10-1-55-4, షమీ 9-0-68-1, చహల్ 10-0-50-1, పాండ్యా 10-0-60-3.

# స్టార్ల ముందడుగు

## తొలి రౌండ్‌లో ఫెదరర్, నాదల్ గెలుపు
## వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ


ఆష్లే బార్టీ

**లండన్:** తొలిరోజు సంచనాలతో హోరెత్తిన వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మంగళవారం అంచనాల మేరకే సాగింది. స్టార్ ప్లేయర్లందరూ తొలి రౌండ్‌లో గెలిచి ముందడుగేశారు. పురుషుల సింగిల్స్‌లో స్విస్ స్టార్, రెండో సీడ్ రోజర్ ఫెదరర్, స్పెయిన్ బుల్ రఫేల్ నాదల్ విజయ ఢంకా మోగిస్తే... మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా), డిఫెండింగ్ చాంపియన్ కెర్బర్(జర్మనీ), మాజీ చాంపియన్ సెరీనా విలియమ్స్ (అమెరికా) గెలిచారు.

**ఫెదరర్‌కు కాసేపు టెన్షన్**
ఎనిమిదిసార్లు వింబుల్డన్ టైటిల్ గెలిచిన టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ మొదటి రౌండ్‌లో ఎల్.హారిస్(దక్షిణాఫ్రికా)పై 3-6, 6-1, 6-2, 6-2తో కష్టపడి నెగ్గాడు. ప్రారంభంలో దూకుడుగా ఆడి హారిస్(87వ ర్యాంకు).. ఫెదరర్‌కు చెమటలు పట్టించాడు. చూస్తుండగానే సెట్‌ను 6-3తో కైవసం చేసుకొని మాజీ చాంపియన్‌కు టెన్షన్ పెంచాడు. ప్రత్యర్థి ఆటను, వ్యూహాలను అర్థం చేసుకున్న ఫెదరర్ ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బలమైన షాట్లతో విరుచుకుపడి 6-1తో రెండో సెట్‌ను దక్కించుకున్నాడు. ఆ తర్వాత మూడు, నాలుగు సెట్లను 6-2, 6-2తో కైవసం చేసుకొని తొలి రౌండ్‌లో విజయం సాధించి.. ముందడుగేశాడు. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ రఫేల్ నాదల్ 6-3, 6-1, 6-3 తేడాతో యుచి సుగిత(జపాన్)పై వరుస సెట్లలో సునాయాస విజయం సాధించాడు.

**వరుస సెట్లలో..**
మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఎస్.జెంగ్(చైనా)పై నంబర్ వన్ ప్లేయర్ ఆష్లే బార్టీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 6-4, 6-2తో వరుస సెట్లలో సునాయాస విజయం సాధించింది. నాలుగో సీడ్ అంజెలిక్ కెర్బర్ 6-4, 6-3 తేడాతో టి. మరియ(జర్మనీ)ని ఓడించి.. రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది. అమెరికా క్రీడా కారిణి, మాజీ చాంపియన్ సెరీనా విలియమ్స్(10వ ర్యాంకు) 6-2, 7-5 తేడాతో గట్టో మోంటికోన్(ఇటలీ)పై గెలిచి ముందడుగు వేసింది.

# ఇంగ్లండ్‌కు అగ్నిపరీక్ష

## కివీస్‌తో నేడు కీలక పోరు


టేలర్ మోర్గాన్

**చెస్టర్ లీ స్ట్రీట్:** భారత్‌పై విజయంతో జోరుమీదున్న ఇంగ్లండ్... సెమీస్ చేరాలంటే గెలిచితీరాల్సిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడేందుకు సిద్ధమైంది. టీమ్‌ఇండియాపై సమిష్టి కృషితో గెలిచిన స్ఫూర్తితో న్యూజిలాండ్‌తో బుధవారం ఇక్కడి రివర్‌సైడ్ మైదానంలో అమీతుమీ తేల్చుకునేందుకు ఇంగ్లిష్ ఆటగాళ్లు రెడీ అయ్యారు. లీగ్ దశలో 8మ్యాచ్‌ల్లో ఐదు గెలిచిన ఇంగ్లిష్ జట్టు (10పాయింట్లు) పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో కివీస్‌పై గెలిస్తే సెమీస్ స్థానాన్ని పక్కా చేసుకుంటుంది. మరోవైపు టోర్నీలో ఎగిసిన కెరటంలా తొలి ఐదు మ్యాచ్‌లను గెలిచిన కివీస్.. గత రెండు మ్యాచ్‌ల్లో చతికిల పడింది. బలహీనతలను ప్రదర్శిస్తూ సెమీస్ ముంగిట కష్టాలు పడుతున్నది. ప్రస్తుతం 11పాయింట్లతో మూడోస్థానంలో ఉన్నా.. టోర్నీలో ఆ జట్టు భవితవ్యం కాస్త ప్రశ్నార్థకంగానే ఉంది. దీంతో ఇంగ్లిష్ జట్టుపై ఎలాగైనా గెలిచి సెమీస్‌లోకి అడుగుపెట్టాలని విలియమ్సన్ సేన కృత నిశ్చయంతో ఉంది.

# యూరోస్లామ్ లీగ్‌లో స్టెయిన్, గప్టిల్

**న్యూఢిల్లీ:** గాయం కారణంగా ప్రపంచకప్ టోర్నీకి దూరమైన దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ స్టెయిన్.. ఆగస్టు చివర్లో ప్రారంభమయ్యే యూరో స్లామ్ టీ20 లీగ్‌లో ఆడబోతున్నాడు. స్టెయిన్‌తో పాటు న్యూజిలాండ్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ బరిలోకి దిగనున్నాడు. ఈ విషయాన్ని లీగ్ నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. ఇమ్రాన్ తాహిర్, డుమినీ, క్రిస్ లిన్, బాబర్ ఆజమ్, ల్యూక్ రొంచీ ఇప్పటికే మార్క్యూ ప్లేయర్లుగా ఉండగా.. తాజాగా స్టెయిన్ ఆ జాబితాలో చేరాడు.

# మల్టీక్లాస్ సెయిలింగ్ పోటీలు ప్రారంభం


మంగళవారం హైదరాబాద్‌లో సెయిలింగ్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** హైదరాబాద్ నగరం సెయిలింగ్ క్రీడకు చిరునామా అయింది. సీనియర్ మల్టీక్లాస్(ర్యాంకింగ్) సెయిలింగ్ చాంపియన్‌షిప్ అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరై మంగళవారం పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ( సాయ్) సహకారంతో ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు ఈనెల 7 వరకు జరుగుతాయి. మొత్తం 188 మంది సెయిలర్లు పోటీపడుతున్నారు. ఇందులో 21 మంది తెలంగాణ వారు ఉన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ 'సెయిలింగ్ క్రీడకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. హుస్సేన్ సాగర్‌ను వేదికగా చేసుకుని మరింత మంది సెయిలింగ్ చాంపియన్లు వెలుగులోకి రావాలి. ముఖ్యంగా స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన అశ్విని, కీర్తి, అజయ్, సంజయ్ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపచేయాలి' అని గవర్నర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎమ్ఈఎస్‌పీ లెఫ్టినెంట్ జనరల్ పరమ్‌జీత్‌సింగ్, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ అధ్యక్షుడు శశిధర్ బచ్చు, మేజర్ జనరల్ నారాయణన్, బ్రిగేడియర్ జగదీశ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌గా పేరొందిన ఈ పోటీలు ప్రారంభమై 33 ఏండ్లు కావడం విశేషం.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,816 | 11,910 |
| ↗130 | ↗45 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 63.39 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,120 |
| 22 క్యారెట్లు | 33,950 |
| వెండి (కిలో) | 38,500 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.00 | 71.50 |
| యూరో | 74.50 | 80.50 |
| బహ్రెయిన్ దినార్ | 173.80 | 187.80 |
| కువైట్ దినార్ | 218.00 | 232.00 |
| సౌదీ రియాల్ | 17.20 | 18.80 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.50 |

**చికెన్ ధరలు**

| (రూ.లలో) | |
|---|---|
| ఫారం ధర | 105.00 |
| రిటైల్ లైవ్ | 127.00 |
| డ్రెస్డ్ | 184.00 |
| స్కిన్‌లెస్ | 210.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

| (రూ.లలో) | |
|---|---|
| హైదరాబాద్ | 423-00 |
| రంగారెడ్డి | 423-00 |
| మెదక్ | 423-00 |
| కరీంనగర్ | 426-00 |
| వరంగల్ | 426-00 |
| రిటైల్ ప్రైస్ | 4-85 |

# డిఫాల్టర్లపై సీబీఐ కొరడా

దేశవ్యాప్తంగా 61 చోట్ల తనిఖీలు



**న్యూఢిల్లీ, జూలై 2:** రుణ ఎగవేతదారులపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కొరడా ఝుళిపించింది. బ్యాంకింగ్ మోసాల కేసుల్లో మంగళవారం మెరుపు దాడులను చేపట్టింది. దేశవ్యాప్తంగా 18 నగరాల్లోని 61కిపైగా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. బ్యాంకులకు రూ.1,139 కోట్ల నష్టం వాటిల్లిన 17 కేసుల విచారణలో భాగంగా ఈ సోదాలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా కనుసన్నల్లో, ఢిల్లీలోని ఇతర సీనియర్ అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ సోదాల్లో 300లకుపైగా ఆయా ప్రాంతాల అధికారులు పాల్గొన్నారు. వివిధ బ్యాంకుల ఫిర్యాదులు, ఆపై తమ దర్యాప్తులో సేకరించిన ఆధారాల ప్రకారం రుణ ఎగవేతల ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలపై ఈ దాడుల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దాదాపు రూ.640 కోట్ల రుణాలు వడ్డీతోసహా రూ.1,139 కోట్ల బకాయిలుగా మారాయని చెప్పారు. రాత్రి పొద్దుపోయేదాకా ఈ సోదాలు జరుగుతూనే ఉండటం గమనార్హం.

**నీట మునిగిన ముంబైలోనూ..**

భారీ వర్షాలతో నీట మునిగిన ముంబైలోనూ సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. పరారీ వజ్రాల వ్యాపారి జతిన్ మెహెతా నేతృత్వంలోని విన్సమ్ డైమండ్స్‌కు చెందిన డైరెక్టర్లు, ప్రమోటర్ల ఇండ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. మెహెతాపై తాజాగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలోనే ఈ దాడులు జరిగాయి. ఎగ్జిమ్ బ్యాంక్‌ను రూ.202 కోట్లు మోసం చేసిన కేసులో మెహెతాపై ఎఫ్ఐఆర్ నమోదవగా, ఇది మొత్తంగా 16వది కావడం గమనార్హం. ఇప్పటికే రూ.6,500 కోట్ల బ్యాంక్ మోసంలో మెహెతా ప్రధాన నిందితుడన్న విషయం తెలిసిందే. ఇక సుపమ్యాడ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, అసుతి ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సుప్రీం టెక్స్ మార్ట్, ఏగాన్ బ్యాటరీస్, రాంనందీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్, నాఫ్తోగజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎల్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్, సంప్రాప్ష్ ఫుడ్స్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ మెగా ఫుడ్ పార్క్ లిమిటెడ్, రంజిత్ ఆటోమొబైల్స్, జల్ప టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలపై దాడులు జరిగాయి. ఢిల్లీ, ముంబై, లుధియానా, థానే, వల్సాద్, పుణె, పలని, గయ, గురుగ్రామ్, చండీగఢ్, భోపాల్, సూరత్, కోలార్ తదితర ప్రాంతాల్లో ఈ సోదాలు జరుగగా, యూనియన్ బ్యాంక్, ఎస్బీఐ, సెంట్రల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, సిడ్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు ఈ సంస్థలతో నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు.

# రూ.2.62 లక్షల కోట్ల భరణం

భార్య మెకెంజీ బెజోస్‌కు ఇస్తున్న జెఫ్ బెజోస్ ■ ప్రపంచంలోనే భారీ విడాకుల పరిష్కార కేసుగా రికార్డు



**వాషింగ్టన్, జూలై 2:** భార్యభర్తలు విడిపోతే భార్యకు భర్త నుంచి భరణం రావడం మామూలే. ఈ భరణం ఐదో.. పదో లక్షలుగా ఉండటం సాధారణం. మరికొన్ని కేసుల్లో ఈ మొత్తం ఐదో.. పది కోట్లుగా ఉండొచ్చు. ఇంకొన్ని సంపన్న కేసుల్లో మరింత ఎక్కువ కావచ్చు. కానీ ఏకంగా రూ.2.62 లక్షల కోట్లకుపైగా భరణం రావడం ఎప్పుడైనా చూశామా. ఈ వింత అమెజాన్ అధినేత దంపతుల మధ్య జరిగింది మరి. ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్ (55) దంపతులు విడాకులు తీసుకున్నారు. దీంతో భార్య మెకెంజీ బెజోస్ (49)కు సుమారు 38 బిలియన్ డాలర్లను విడాకుల సమస్య పరిష్కారం కింద జెఫ్ ఇస్తున్నారు. ఈ మొత్తం మన కరెన్సీలో చూస్తే రూ.2,62,048 కోట్లు. 26 ఏండ్లుగా కాపురం చేసిన జెఫ్, మెకెంజీలు ఈ ఏడాది ఏప్రిల్‌లో విడిపోదామని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. 1993లో వీరి వివాహం జరుగగా, వీరికి నలుగురు పిల్లలున్నారు. కాగా, విడాకుల నేపథ్యంలో అమెజాన్‌లో ఈ జంటకున్న షేర్లలో 25 శాతం మెకెంజీకి వస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో వీటి విలువ దాదాపు 38 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇదిలావుంటే భార్యకు ఇంత భారీ మొత్తంలో భరణంగా వెళ్లినా.. ప్రపంచ కుబేరుల జాబితాలో జెఫ్ బెజోసే ప్రథముడని బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ చెబుతున్నది. ఇప్పటికీ జెఫ్ నికర సంపద 118 బిలియన్ డాలర్లుగా ఉందని పేర్కొన్నది. 1992లో సీటెల్‌లోని తన గ్యారేజీ నుంచి అమెజాన్ కార్యకలాపాలను జెఫ్ ప్రారంభించారు. ఇది కాలక్రమేణా పెరిగి పెద్దదై.. ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ షాపింగ్ సంస్థగా ఎదిగింది. విడాకుల నిర్ణయం సమయంలో 90 రోజుల్లోగా మెకెంజీకి 38 బిలియన్ డాలర్లను ఇస్తానని జెఫ్ ప్రకటించిన సంగతి విదితమే. దీంతో ఈ వారంలో ఆ సొమ్ము మెకెంజీ చేతికి రానుండగా, ఇందులో సగభాగం సంపదను విరాళంగా ప్రకటించినదీ తెలిసిందే. వారెన్ బఫెట్, బిల్‌గేట్స్ స్థాపించిన 'ది గివింగ్ ప్లెడ్జ్' అనే ఛారిటీ సంస్థకు ఈ సొమ్ము వెళ్తున్నది.

# నీరవ్ మోదీకి సింగపూర్ హైకోర్టు షాక్

ఆయన సోదరికి చెందిన రూ.44 కోట్ల బ్యాంక్ డిపాజిట్ల జప్తు



**న్యూఢిల్లీ, జూలై 2:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ చుట్టు ఉచ్చు మరింత బిగిస్తున్నది. పీఎన్‌బీని మోసం చేసిన కేసులో ఇప్పటికే అరెస్టైన ఆయన కుటుంబ సభ్యులకు విదేశాల్లో ఉన్న ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. ఇప్పటికే పలు దేశాల్లో ఉన్న ఆస్తులను జప్తు చేసిన ఈడీ.. తాజాగా సింగపూర్‌లో నీరవ్ సోదరి పూర్వి మోదీ, బావ మయాంక్ మెహతాకు చెందిన పెవిలియన్ పాయింట్ కార్పొరేషన్‌కు కంపెనీకి సింగపూర్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.44.41 కోట్ల డిపాజిట్లను జప్తు చేసినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఈడీ అభ్యర్థన మేరకు 6.122 మిలియన్ డాలర్ల డిపాజిట్లను జప్తు చేయాలని సింగపూర్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్విస్ బ్యాంకుల్లో నీరవ్, పూర్వి మోదీలకు ఉన్న నాలుగు ఖాతాల్లో రూ.283.16 కోట్ల డిపాజిట్లను జప్తు చేసిన వారం రోజుల తర్వాత సింగపూర్‌లోని ఆస్తులు జప్తు చేయడం విశేషం. ఐదు విదేశీ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.278 కోట్ల డిపాజిట్లను ఇప్పటి వరకు ఈడీ గుర్తించింది. వీరికి సంబంధించిన ఆస్తులను జప్తు చేయాలని సింగపూర్‌కు చెందిన అథార్టీని కోరడం జరిగిందని, అందుకు తగ్గట్టుగా జప్తు చేసిన ఆస్తులకు సంబంధించిన పత్రాలను సైతం అందించినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. పీఎన్‌బీని రూ.13 వేల కోట్ల మోసం చేసిన కేసులో నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీలతోపాటు ఇతరులపై ఈడీ, సీబీఐలు విచారిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది జనవరిలో దొంగచాటున విదేశాలకు పారిపోయిన నీరవ్‌ని ఇటీవల లండన్‌లో అక్కడి పోలీసులు అరెస్ట్‌చేశారు. ప్రస్తుతం ఆయన జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

# ఉపాధికి ఊతమివ్వాలి

ఎగుమతుల రంగంలో అదనపు ఉద్యోగాలిచ్చే సంస్థలకు పన్ను ప్రయోజనాలు అందాలి

బడ్జెట్‌కు ముందు కేంద్రాన్ని కోరిన ఎఫ్ఐఈవో




**న్యూఢిల్లీ, జూలై 2:** రాబోయే బడ్జెట్‌లో ఉపాధి అనుసంధానిత ఆదాయం పన్ను (ఐటీ) ప్రయోజనాలను కల్పించాలని, ఎగుమతుల వృద్ధికి వీలుగా ఓ మార్కెటింగ్ ఆధారిత నిధిని ఏర్పాటు చేయాలని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) మంగళవారం డిమాండ్ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎఫ్ఐఈవో.. కేంద్రానికి పలు విజ్ఞప్తులు చేసింది. ఆర్‌అండ్‌డీ పెట్టుబడులపై పన్నుల కోత, కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు, క్యాపిటల్ గూడ్స్‌పై కస్టమ్స్ సుంకం తగ్గుదలను కోరింది. అలాగే వాణిజ్య మంత్రిత్వ శాఖకు అధిక కేటాయింపులు జరుపాలని సూచించాయి. 'ఎగుమతుల రంగంలో అదనపు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందించే సంస్థలకు ఆదాయం పన్ను ఉపశమనం కలిగించాలని మేము కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఓ ప్రకటనలో ఎఫ్ఐఈవో స్పష్టం చేసింది. చిన్నస్థాయి ఎగుమతిదారులకు.. అంతర్జాతీయ మార్కెట్లలో తమ ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్‌కు వీలైన వాతావరణాన్ని కల్పించాలని సూచించింది. 'మొత్తం ఎగుమతుల విలువలో 0.5 శాతానికి సమానమైన కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలి. దీనివల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లు అంతర్జాతీయ ఎగ్జిబిషన్లు, ట్రేడ్ షోల్లో చురుగ్గా పాల్గొనేందుకు వీలుంటుంది' అని ఎఫ్ఐఈవో ఈ సందర్భంగా అభిప్రాయపడింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో దేశీయ ఎగుమతులు అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18)తో పోల్చితే 9 శాతం పెరిగి 331 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

## జీతం పెరుగాలి.. పింఛన్ అందాలి..



మార్కెట్‌లో అన్ని రకాల వస్తువులు, సేవల ధరలు పెరిగిపోవడంతో సామాన్యుడి బతుకు భారమైపోయిందంటూ రాబోయే బడ్జెట్‌లో కనీస వేతనం.. కనీస పింఛన్‌ను డిమాండ్ చేస్తున్నాయి వాణిజ్య సంఘాలు.

వాణిజ్య సంఘాల డిమాండ్

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ శాఖల సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు ఇప్పటికే ఈ మేరకు విజ్ఞప్తులు అందించాయి. విద్య, వైద్య సదుపాయాలనూ పొందలేని దుర్భర స్థితిలో చాలామంది ఉద్యోగులు, కార్మికులున్నారని వారికి ధైర్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సదరు సంఘాలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాయి. ఈ క్రమంలోనే కనీస వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలని, రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని కల్పించాలని కేంద్రానికి సూచించాయి. ఐటీ శ్లాబుల పరిధిని పెంచి రూ.10 లక్షల వరకు ఆదాయంపై ఎటువంటి పన్ను విధించకూడదని, సీనియర్ సిటిజన్లను రూ.8 లక్షల ఆదాయ శ్లాబులో తేవాలని, వీరి గృహ, ఇతర అలవెన్సులపై పన్ను వేయరాదని కోరాయి. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని, వీటికి మరిన్ని పెట్టుబడులను అందించాలని డిమాండ్ చేశాయి. కార్మికుల్లో నైపుణ్యాల పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరాయి.

## మినహాయింపులివ్వండి: ఈఈపీసీ

ఆదాయం పన్ను మినహాయింపులు ఇవ్వాలని ఇంజినీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీ) కేంద్రాన్ని కోరింది. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎంఎస్ఎంఈలకు మరింత దన్నుగా నిలువాలని విజ్ఞప్తి చేసింది. ఇండియన్ మర్చెండైజ్ ఎక్స్‌పోర్ట్స్ స్కీం (ఎంఈఐఎస్), ఇండియన్ సర్వీస్ ఎక్స్‌పోర్ట్స్ స్కీం (ఎస్ఈఐఎస్)లకు ఐటీ మినహాయింపులు ఇవ్వాలన్నది. దేశీయ ఇంజినీరింగ్ ఎగుమతులు కష్టకాలంలో ఉన్నాయని, అధిక ఉత్పాదక వ్యయం, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారం, ఎంఎస్ఎంఈలకు నిధుల కొరత, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు వేధిస్తున్నాయని ఈఈపీసీ చైర్మన్ రవీ సెహగల్ అన్నారు. వ్యవసాయ గిడ్డంగుల కంపెనీలు సైతం జీఎస్టీ రద్దుకు పట్టుబడుతున్నాయి. రైతులకు లాభం చేకూర్చుతున్న తమపైనా 18 శాతం పన్ను పడుతున్నదని జపాన్‌కు చెందిన కవాసాకి రికుసో సంస్థ ట్రాన్స్‌పోర్టేషన్ డైరెక్టర్ పరణ్ దాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# సింభౌలీ షుగర్ రూ.110 కోట్ల ఆస్తుల జప్తు

SIMBHAOLI SUGARS

**న్యూఢిల్లీ, జూలై 2:** దేశంలో అతిపెద్ద చక్కెర మిల్లుల్లో ఒకటైన సింభౌలీ షుగర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరో షాకిచ్చింది. పలు బ్యాంకుల వద్ద భారీగా రుణాలు తీసుకొన్ని ఎగ్గొట్టిన కేసులో కంపెనీకి చెందిన రూ.110 కోట్ల విలువైన ఆస్తులను మంగళవారం ఈడీ జప్తు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) కింద సంస్థ విచారణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ విచారణలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ వద్ద ఉన్న ప్లాంట్‌కు సంబంధించిన భూములు, భవనాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. వీటి మొత్తం విలువ రూ.109.8 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనావేస్తున్నది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ)ను మోసం చేసిన కేసుతో గతేడాది మార్చిలోనే కంపెనీకి వ్యతిరేకంగా సీబీఐ తొలి ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది. 5,762 మంది రైతులకు చెల్లించాల్సిన బకాయిల కోసం ఓబీసీ వద్ద తీసుకున్న రూ.148.59 కోట్ల రుణాన్ని రైతులకు చెల్లించకుండా, ఇతర వాటికి మళ్లించినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. దీంతో కంపెనీ చైర్మన్ గుర్మిత్ సింగ్, డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్, సీఈవో జీఎస్‌సీ రావు, సీఎఫ్‌వో త్రప్రియ, ఈడీ గుర్సిమ్రాన్ కౌర్‌లతోపాటు ఐదుగురు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై కేసును దాఖలు చేసింది. పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్ అల్లుడే గుర్పాల్ సింగ్ కావడం విశేషం.




మంగళవారం తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకులో రాష్ట్ర, జిల్లా సహకార బ్యాంకుల పాలకవర్గ సభ్యులకు కార్పొరేట్ గవర్నెన్స్‌పై జరుగుతున్న శిక్షణా కార్యక్రమం. పాల్గొన్న అపెక్స్ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు తదితరులు

# మాల్యాకు ఊరట!

భారత్‌కు అప్పగింత కేసులో అప్పీల్‌కు బ్రిటన్ హైకోర్టు అవకాశం

వెస్ట్‌మినిస్టర్ కోర్టు ఆదేశాలపై మళ్లీ విచారణ



**లండన్, జూలై 2:** లిక్కర్ వ్యాపారి విజయ్ మాల్యాకు బ్రిటన్ హైకోర్టు ఊరటనిచ్చింది. భారత్‌కు అప్పగింత కేసులో అప్పీల్‌కు అనుమతినిచ్చింది. వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు.. మాల్యాను భారత్‌కు అప్పగించాలని తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి హోం కార్యదర్శి సాజిద్ జావిద్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేయగా, దీన్ని సవాల్ చేసేందుకు అనుమతినివ్వాలని మాల్యా పైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే మాల్యా తరపు న్యాయవాది క్లారా మాంట్గోమరి వాదనలను మంగళవారం విన్న జస్టిస్ జార్జ్ లెగ్గట్, జస్టిస్ ఆండ్రూ పొప్పెవాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అప్పీల్‌కు అనుమతినిచ్చింది. వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు న్యాయమూర్తి ఎమ్మా ఆర్బుత్నట్ తీర్పుపై మాల్యా వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకునేలాగే ఉన్నాయని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ క్రమంలోనే తదుపరి విచారణ కోసం తగిన మార్గదర్శకాలను విడుదల చేస్తామని చెప్పింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి రూ.9,000 కోట్లకుపైగా దేశీయ బ్యాంకులకు బకాయిపడి 2016లో మాల్యా లండన్‌కు పారిపోయిన సంగతి విదితమే. కాగా, మాల్యా.. కోర్టుకు తన కొడుకు సిద్ధార్థ్, భాగస్వామి పింకి లల్వానీలతో హాజరైయ్యారు. లండన్‌లోని భారత హై కమిషన్ ప్రతినిధులూ వచ్చారు. కోర్టు వద్ద విలేఖరులతో మాల్యా మాట్లాడుతూ ఈ కేసులో తనకు న్యాయం జరుగుతుందన్న భావన కలుగుతున్నదని, క్లీన్‌చిట్ వచ్చిందన్న సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ కేసులో భారత్ తరపున సీపీఎస్ వాదిస్తున్న విషయం తెలిసిందే.

## స్పైస్‌జెట్ వర్షాకాల ఆఫర్




**న్యూఢిల్లీ, జూలై 2:** ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్‌జెట్..వర్షాకాల ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 6 వరకు అమలులో ఉండనున్న ఈ ఆఫర్ కింద దేశీయంగా ప్రారంభ విమాన టిక్కెట్టు ధరను రూ.888గా నిర్ణయించింది. పరిమిత కాల ఆఫర్‌లో బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు ఈ ఏడాది సెప్టెంబర్ 25 లోగా ప్రయాణించాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. పరిమిత సీట్లు కలిగిన ఈ ఆఫర్ కింద ముందుగా బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే లభించనున్నట్లు ఒక ప్రకటనలో సంస్థ తెలిపింది. అంతర్జాతీయ రూట్లలో కూడా వర్తించనున్న ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టిక్కెట్టును రూ.3,499కి విక్రయిస్తున్నది.

## శింకో నూతన స్మార్ట్‌టీవీ

ధర రూ.23,999



**న్యూఢిల్లీ, జూలై 2:** చౌక టీవీల విక్రయ సంస్థ శింకో..దేశీయ మార్కెట్లోకి మరో స్మార్ట్ టీవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. పూర్తిస్థాయి హెచ్‌డీ కలిగిన 124 సెంటీమీటర్ల(49 అంగుళాల) కలిగిన ఈ టీవీ ధరను రూ.23,999గా నిర్ణయించింది. కంపెనీ వెబ్‌సైట్‌తోపాటు అమెజాన్‌లోనూ ఈ టీవీ లభించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా సంస్థ ఈ టీవీని ఇక్కడే తయారు చేసింది. 2 హెచ్‌డీఎంఐ పోర్ట్స్, 2 యూఎస్‌బీ పోర్ట్స్ ఉన్న ఈ టీవీలో కార్టెక్స్-ఏ53 క్వాడ్ కోర్ 804 మెగాహెర్ట్జ్ ప్రాసెసర్, జీపీయూ డ్యూయల్ కోర్ మాలి 450, 1జీబీ ర్యామ్, 8జీబీ రోమ్, ఆండ్రాయిడ్ వెర్షన్ వంటి ఫీచర్స్‌తో రూపొందించింది. యాప్స్ స్టోర్ ద్వారా నచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా ఉన్నది.

# ఫ్లాట్ల అమ్మకాల్లో హైదరాబాద్ దూకుడు

తొలి స్థానానికి చేరుకున్న భాగ్యనగరం ■ 2019 ప్రథమార్ధ నివేదికలో జేఎల్ఎల్ వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇండ్ల అమ్మకాల్లో దేశంలోనే హైదరాబాద్ తొలిస్థానంలో నిలిచిందని ప్రముఖ రియల్ ఎస్టేట్ సేవల సంస్థ జేఎల్ఎల్ తాజా నివేదిక వెల్లడించింది. 2019 ప్రథమార్ధంలో దేశవ్యాప్తంగా ఉన్న ఏడు నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం స్థితిగతులపై అధ్యయనం చేసింది. ఫ్లాట్ల అమ్మకాల్లో ఇతర నగరాల్ని వెనక్కి నెట్టేసిన భాగ్యనగరం ముందంజలో నిలిచిందని తెలియజేసింది. జనవరి నుంచి జూన్ లోపు ఒక్క భాగ్యనగరంలోనే దాదాపు 65 శాతం అమ్మకాలు జరిగాయని పేర్కొన్నది. ఆ తర్వాతి స్థానాల్లో ముంబై, బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్ నిలిచాయని తెలియజేసింది. పశ్చిమ హైదరాబాద్‌లో నివాస సముదాయాలకు అధిక గిరాకీ ఉన్నదని.. ఈ ఏడాది ప్రథమార్ధంలో ఈ ప్రాంతంలోనే అమ్మకాలు అధికంగా జరిగాయని తెలియజేసింది. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఇండ్ల రేట్లు దాదాపు ఆరు శాతం పెరిగాయని వెల్లడించింది.

**తగ్గిన కొత్త ప్రాజెక్టులు..**

హైదరాబాద్ రియల్ రంగంలో తాత్కాలికంగా కొంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కొత్త నివాస సముదాయాల ప్రాజెక్టులు ప్రారంభం కాకపోవడమేనని జేఎల్ఎల్ చెబుతున్నది. 2019 ప్రథమార్ధంలో కొత్త నిర్మాణాలు దాదాపు యాభై శాతం తగ్గుముఖం పట్టాయని తెలియజేసింది. ఇందుకు గల పలు కీలక కారణాలని విశ్లేషించింది. 2018 ఆగస్టులో 'రెరా' అమల్లోకి రావడం, ఆతర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు వంటివి కారణమని పేర్కొన్నది. ఇదే సమయంలో పలు సంస్థలు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్ని పూర్తి చేయడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం గమనార్హం. 2019 మొదటి ఆరునెలల్లో ఆరంభమైన ప్రాజెక్టుల్లోనూ పశ్చిమ హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉండటం విశేషం.

**తూర్పు నగరంపై దృష్టి..**

మెట్రో రైలు మొదలు కావడంతో అధికశాతం మంది తూర్పు హైదరాబాద్ వైపు దృష్టి సారిస్తున్నారు. ఎల్బీనగర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు మరిన్ని రానున్నాయని వెల్లడించింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న షాపింగ్ మాళ్లు పూర్తయ్యితే, ఇక్కడి చుట్టుపక్కల ప్రాంతాలకు మంచి గిరాకీ ఏర్పడుతుందని తెలియజేసింది.

## 31 వరకు రెరా తుది గడువు

RERA

తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నది. 2017 జనవరి 1 నుంచి 2018 ఆగస్టు 31 దాకా.. రాష్ట్రంలో 500 చదరపు మీటర్లు లేదా ఆపై విస్తీర్ణంలో నిర్మితమైన కొత్త అపార్టుమెంట్లు, లే-అవుట్లు, వాణిజ్య సముదాయాలు, వ్యక్తిగత గృహాల సముదాయాలను ప్రారంభించిన ప్రమోటర్లు ఈ నెల చివరి లోగా రెరాలో నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించింది. ఇందుకోసం రూ.3 లక్షల అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ రెరా అథారిటీ చైర్మన్ రాజేశ్వర్ తివారీ కోరారు.

## 30% వృద్ధి: క్రెడాయ్

హైదరాబాద్ రియల్ రంగం దాదాపు 30 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని క్రెడాయ్ హైదరాబాద్ నూతన అధ్యక్షుడు రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం క్రెడాయ్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని పరిచయం చేయడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆఫీస్ స్పేస్ విభాగంలో బెంగళూరును భాగ్యనగరం దాటేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు మౌలిక సదుపాయాల్ని అభివృద్ధి చేసేందుకు మెరుగైన నిర్ణయాల్ని తీసుకుంటున్నారని కితాబిచ్చారు. తెలంగాణ రియల్ రంగంలో ఏకగవాక్ష విధానాన్ని అమలు చేస్తే నిర్మాణ రంగం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోనే హైదరాబాద్ రియల్ రంగం అనూహ్యంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

## ఈసీబీ అధ్యక్షురాలిగా లగార్డేకే ఈయూ ఓటు



**ఫ్రాంక్‌ఫర్ట్, జూలై 2:** అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఎండీ క్రిస్టిన్ లగార్డే యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) కొత్త అధ్యక్షురాలిగా నామినేట్ అయ్యారు. మంగళవారం లగార్డేను యూరోపియన్ యూనియన్ (ఈయూ) అధికారికంగా ఎన్నుకుంది. 2011 నుంచి ఐఎంఎఫ్ చీఫ్‌గానే లగార్డే ఉన్న విషయం తెలిసిందే. కాగా, ఈసీబీ అధ్యక్షురాలిగా తనను ఎన్నుకున్నారని, తాత్కాలికంగా ఐఎంఎఫ్ బాధ్యతల్ని వదిలేస్తున్నానని లగార్డే చెప్పారు. అయితే ఈయూ నిర్ణయం యూరోపియన్ పార్లమెంట్‌లో ఆమోదం పొందాల్సి ఉంది. అనుమతి వస్తే మారియో డ్రాఘీ స్థానంలో లగార్డే బాధ్యతలు చేపడుతారు.

# క్రీడలకు ప్రోత్సాహం

ఎయిర్‌టెల్ మారథాన్ సన్నాహక కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ర్టాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్నదని, ఆటలు చూసి ఆస్వాదించడంతోపాటు క్రీడాస్ఫూర్తితో ప్రతిఒక్కరు జీవించాలని క్రీడలు, టూరిజం, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించినప్పుడే అందమైన జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. హోటల్ తాజ్‌కృష్ణలో మంగళవారం నిర్వహించిన ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్ సన్నాహక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. హైదరాబాద్ గొప్ప నగరం అని, ఎయిర్‌టెల్ మారథాన్ హైదరాబాద్‌లో నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన మారథాన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పాల్గొన్న విషయం గుర్తుచేశారు. ఆగస్టు 24, 25 తేదీల్లో జరుగనున్న మారథాన్‌కు సంబంధించిన లోగో, టీషర్ట్, మెడల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారతి ఎయిర్‌టెల్ తెలంగాణ, ఏపీ సీఈవో అవ్నీత్ సింగ్ పురి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మురళి నన్నపనేని, రేస్ డైరెక్టర్ అభిజిత్ మద్నూర్కర్ పాల్గొన్నారు. మారథాన్ నిర్వహణకు అన్నివిధాలుగా సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



మారథాన్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

సోలార్ విద్యుదుత్పత్తికి రంగం సిద్ధం: సీఎండీ శ్రీధర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం 37వ స్ట్రక్చర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేండ్లలో గుర్తింపు కార్మిక సంఘంతో కొత్తక్యాడర్ స్కీం, బదిలీల రెగ్యులరైజేషన్, అలవెన్సుల పెంపుదల వంటివాటిపై ఒప్పందాలు చేసుకున్నామని, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలను అమలుచేశామని, ఇప్పటికే మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల వారసులు దాదాపు ఐదువేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. సొంత గృహ నిర్మాణానికి రూ.10 లక్షల రుణంపై వడ్డీచెల్లింపులో భాగంగా జూన్ జీతంలో వడ్డీ సొమ్ము చెల్లించామని, 14,500 ఇళ్లకు ఏసీ కనెక్షన్లు ఇప్పించామని అన్నారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని థర్మల్‌తో పాటు ఈ ఏడాది చివరికి 130 మెగావాట్లు, వచ్చే ఏడాది మరో 80 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పతికి సన్నాహాలు చేశామన్నారు. దేశంలో నంబర్‌వన్‌గా నిలిచిన సింగరేణిని ముందుకు తీసుకువెళ్లడానికి కార్మికులను సమాయత్తం చేస్తామని గుర్తింపు కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి తెలిపారు. సమస్యల విషయంతో యజమాన్యం ఉదారంగా వ్యవహరించాలని కోరారు.



## చెదపురుగుల్లా తినేసి సుమతీ శతకాలా?

టీడీపీపై ఎంపీ విజయసాయిరెడ్డి ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీడీపీ నేతల తీరుపై వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మంగళవారం ట్విట్టర్‌లో ఘాటుగా విమర్శించారు. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనను గాలికి వదిలి రాజకీయ కక్షసాధింపునకు పాల్పడుతున్నారంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. 'నిజాయితీగా పనిచేశామని బాజాకొట్టుకుంటారు. మరోవైపు విచారణకు ఆదేశించి కక్షసాధింపులకు పాల్పడుతున్నారంటారు. ఏ తప్పుచేయనివారికి ఆందోళన ఎందుకు? రాష్ర్టాన్ని చెదపురుగుల్లా తినేసి ఇప్పుడు సుమతీ శతకాలు వల్లిస్తే ప్రజలు నమ్మేస్తారా?' అని ప్రశ్నించారు.

## ఎన్నికల ముందు తాయిలాలేల?

- వివరణ ఇవ్వాలంటూ ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నికలకు ముందు ప్రభుత్వాలు అకస్మాత్తుగా వివిధ పథకాలను ప్రకటించి, ప్రజలకు నగదు బదిలీ చేయడంపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసింది. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నగదు బదిలీ పథకాలు అమలుచేయడం అవినీతే అని పేర్కొంటూ లోక్‌సభ ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీచేసిన పెంటపాటి పుల్లారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వాలు ఉచిత పథకాలను ప్రవేశపెట్టే అంశంపై మార్గదర్శకాలు రూపొందించేలా ఈసీని ఆదేశించాలని తన పిటిషన్‌లో కోరారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం ఏపీలో రూ.9,400 కోట్లను పసుపు కుంకుమ వంటి పథకాల పేరిట ప్రజలకు నగదు బదిలీ చేసిందని పేర్కొన్నారు. ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఈ మొత్తం నిధులను మళ్లించారని, దీని వల్ల కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు, ఇతర అత్యవసర ఖర్చులకు నిధులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈసీకి నోటీసులు జారీచేసింది.

## చంద్రబాబు భద్రత కోసం 74 మంది

హైకోర్టులో ఏపీ ప్రభుత్వం అఫిడవిట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు భద్రతను తగ్గించలేదని మంగళవారం ఏపీ ప్రభుత్వం తెలిపింది. మాజీ సీఎం హోదాలో చంద్రబాబుకు 58 మంది భద్రతాసిబ్బంది ఉండాల్సినప్పటికీ తాము 74 మందిని ఇచ్చామని ఏపీ ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టులో అఫిడవిట్ దాఖలుచేశారు. తన భద్రతను తగ్గిస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల తన ప్రాణాలకు ముప్పుందని చంద్రబాబు హైకోర్టులో పిటిషన్‌వేసిన సంగతి తెలిసిందే. 74 మందితో భద్రత ఎక్కడెక్కడ కల్పిస్తున్నారో అఫిడవిట్ దాఖలుచేయాలని హైకోర్టు ఆదేశించింది.

నమస్తే తెలంగాణ దినపత్రికకు
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పత్రికారంగంలో తనదైన ముద్రవేసుకొని ప్రజలను
చైతన్యపరుస్తున్న 'నమస్తే తెలంగాణ' దినపత్రిక యాజమాన్యానికి
మరియు సిబ్బందికి 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
KLSR
INFRATECH LTD
Address:
H.No: 2-56/D/213/9A & 9B,F No. 4B,
KLSR TOWERS, AYYAPPA SOCIETY,
MADHAPUR, HYDERABAD-500081




Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

Best Deal Honda Buy. Sell. Exchange | ALWAYS WEAR HELMET WHILE RIDING
Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**
Follow us on

Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR: Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; JAGATIAL: Samrat Honda - 9701200045, 9704500045; HUZURABAD: Samrat Honda - 8099979050; SIRCILLA: Srikanth Honda - 08723-233336, 7799700245; PEDDAPALLY: Srikanth Honda - 7799700259; SULTANABAD: Aradhna Honda - 9849885862; VEMULAWADA: Srikanth Honda - 9177662757; METPALLY: Saanvi Honda - 9581295818; JAMMIKUNTA: Srikanth Honda - 7799700263; DHARMARAM: Sairam Honda - 9642828885, 08728-270950; HUSANABAD: Laxmi Honda - 9949915222; ADILABAD: Sree Mahalakshmi Honda - 9010977757; RAMAGUNDAM: Sai Ram Krishna Honda - 8100779999; MANCHERIAL: Jagadamba Honda - 08736-259303; BELLAMPALLY: Thirumala Honda - 08735225975; 9059979909; NIRMAL: Sree Mahalakshmi Honda - 9010977757; ASIFABAD: Sainath Honda - 9010431431, 8500612233; KHANAPUR: Sri Ganesh Honda - 9010977757; BHAINSA: Sree Mahalakshmi Honda - 9010977757; KAGAZNAGAR: Sree Mahalakshmi Honda - 9010977757; ICHODA: Sree Mahalakshmi Honda - 9010977757.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

## పాలతో మతిమరుపు మాయం!



**పాలు, పాల పదార్థాలంటే చాలామందికి ఇష్టం. కానీ కొందరు పాల పదార్థాలను అసహ్యించుకుంటారు. అలాంటి వారు చాలా శక్తిని కోల్పోయినట్లే. పాలలో ఉండే పోషకాల వల్ల శరీరానికి ఏయే లాభాలు కలుగుతాయో చూద్దాం.**

- పాలల్లో ఉండే గ్లూటథయోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వల్ల మెదడు కణాలు ఆరోగ్యంగా ఉంటాయట. రోజూ మూడు గ్లాసుల పాలు తాగే వారు వ్యాధులకు దూరంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. దీనివల్ల అల్జీమర్స్ సమస్యలు దరి చేరవని చెబుతున్నారు.
- జీవక్రియల్లో భాగంగా విడుదలయ్యే హానికర రసాయనాల నుంచి కూడా పాలు రక్షిస్తాయి.
- కండరాలకు, ఎముకలకు పాలు బలాన్ని చేకూరుస్తాయి. ఇతరత్రా కారణాల వల్ల కూడా పాలు తాగడం మంచిది. రోజు వారి వ్యాయామం అనంతరం గ్లాసుడు పాలు తాగడం ద్వారా తక్షణ శక్తి లభిస్తుంది. ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.
- గ్లాసుడు పాలల్లో చిటికెడు పసుపు వేసుకుని తాగితే ఆరోగ్యానికి మంచిది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముక్కు దిబ్బడ, తలనొప్పి, ఇతర నొప్పులు తగ్గుతాయి. కీళ్లవాపులు, నొప్పులు తగ్గాలంటే పసుపు పాలను క్రమం తప్పకుండా తాగాలి.
- దగ్గుతో బాధపడే వారు వెచ్చని పాలు తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. ఇవి పసుపులో ఉండే వైటల్ న్యూట్రియంట్స్‌తో కలిసి ఒత్తిడిని తొలిగిస్తాయి. దానివల్ల హాయిగా నిద్రపడుతుంది.

## అగ్నిమాపకదళంలో తొలి మహిళ!



**పట్టుదల ఉంటే అదే మనిషిని గమ్యానికి చేరుస్తుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే కచ్చితంగా విజయం వరిస్తుందనడానికి సరైన ఉదాహరణ ఈ మహిళ . అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకొని దేశంలోనే తొలి మహిళా అధికారిణిగా అగ్నిమాపక దళంలో చేరింది. పురుషులకు దీటుగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటున్నదీ ఫైర్ లేడీ.**

**అతివలు** అరుదైన రంగాల్లో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. మహిళలకు అవకాశం కల్పించాలే గానీ ఎటువంటి రంగంలోనైనా రాణించగలుగుతారు. ఇప్పటి వరకూ అడుగు పెట్టని రంగాల్లో సైతం ప్రవేశించి అవార్డులు అందుకుంటున్నారు. గుజరాత్‌కు చెందిన హర్షిణికన్‌హేకర్ పాఠశాలలో చదువుకునే సమయంలో వివిధ రంగాల్లో విజయం సాధించిన మహిళల గాథలను తెలుసుకున్నది. భారతవైమానిక దళంలో మొదటి మహిళా పైలెట్ శివానీ కులకర్ణి గురించి చదివిన హర్షిణి.. ఆమెనే స్ఫూర్తిగా తీసుకున్నది. అగ్నిమాపకదళంలో చేరాలని కలలు కన్నది. ఆ కలలను సాకారం చేసుకునేందుకు పాటుపడింది. హర్షిణి స్కూల్లో చదివే సమయంలో ఎన్‌సీసీలో చేరింది. చిన్నప్పటి నుంచే పురుషులకు దీటుగా అన్ని పోటీల్లో పాల్గొనేది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్‌లో ఫైర్ ఇంజినీరింగ్ కోర్సు చదివేందుకు దరఖాస్తు చేసుకున్నది. క్యాంపస్ సీటు వచ్చినా అక్కడ ఉండేందుకు ఆమెకు సరైన సౌకర్యాలు లేవు. ఆ కాలేజ్‌లో అందరూ అబ్బాయిలే, హర్షిణి ఒక్కతే అమ్మాయి. దీంతో ప్రతి రోజూ ఇంటికి వెళ్లి తరగతులకు మాత్రమే హాజరయ్యేందుకు ప్రత్యేకంగా అనుమతి పొందింది. కోర్సు పూర్తి చేసిన తర్వాత 2006లో హర్షిణికి గుజరాత్‌లోని మెహసన ఫైర్ స్టేషన్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్నాళ్లు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ)లో పనిచేసింది. ఆ తర్వాత ఆమె ప్రతిభను గుర్తించిన అధికారులు ముంబైలోని డ్రిల్లింగ్ సర్వీస్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. అత్యంత భయంకరమైన అగ్ని ప్రమాదాల్లో చాకచక్యంగా వ్యవహరించినందుకు ఆమె సేవలను గుర్తించారు. అగ్నిమాపక రంగంలోనే ప్రతిష్ఠాత్మకమైన ట్రోఫీని అందించారు. అరుదైన రంగాల్లో మహిళలు రాణించాలంటే అందుకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా అవసరమని చెబుతున్నది హర్షిణికన్‌హేకర్.

## ముఖవర్చస్సు కోసం..



**టమాటాతో ముఖారవిందాన్ని పొందవచ్చు. శనగపిండితో తక్షణ నిగారింపును పొందవచ్చు. టమాటా శనగపిండి కాంబినేషన్‌తో మృతకణాలను తొలగించుకోవచ్చు. అందమైన నిగారింపైన చర్మం కోసం వంటింట్లో లభ్యమయ్యే వాటిని వినియోగించుకోండి. ఈ చిట్కాలు తెలుసుకోండి.**

- మూడు చెంచాల చిక్కటి పెరుగులో రెండు చెంచాల టమాటా గుజ్జు కులుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని బాగా కలిపి ముఖానికి పట్టించాలి. ఆ తర్వాత పదినిమిషాలకు గోరు వెచ్చని నీటితో కడుక్కోవాలి. ఈ చిట్కాను నెల రోజులు క్రమం తప్పకుండా వాడితే మంచి ఫలితాలు కనిపిస్తాయి.
- టమాటాలోని బ్లీచింగ్ కారకాలు చర్మాన్ని తెల్లగా మారుస్తాయి. టమాటా రసంలో కొద్దిగా పసుపు కలుపుకుని ముఖానికి పట్టించాలి. ఆ తర్వాత పదినిమిషాలకు కడిగేసుకోవాలి. రాత్రి పడుకునే ముందు రాస్తే మంచిది. వారానికి ఒక్కసారి ఈ ఫేస్‌క్రీంను అప్లై చేయాలి. నాలుగు వారాల పాటు ఇలా చేస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- ఆయిల్ స్కిన్ ఉన్న వారు ఈ చిట్కా పాటిస్తే నిగారింపు సొంతమవుతుంది. మూడు టీ స్పూన్ల పచ్చి పాలను ఒక గిన్నెలో తీసుకుని అందులో ఒక అర టీ స్పూన్ పసుపు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత పదినిమిషాలు ఉంచుకుని కడుక్కోవాలి. వారానికి ఒక సారి మాత్రమే చేయాలి. ఈ చిట్కా పాటించిన వెంటనే సబ్బుతో కడుక్కోవద్దు. గంట తర్వాత కడిగితే సరిపోతుంది.
- రెండు టీ స్పూన్ల పాలల్లో, రెండు టీ స్పూన్ల పసుపు వేసి బాగా కలపాలి. దీనిని రోజూ రాత్రి పూట ముఖానికి అప్లై చేసుకుని పడుకోవాలి. ఏ వయసు వారైనా ఈ చిట్కాను పాటించవచ్చు. దీని వల్ల ముఖంపై ఉన్న జిడ్డు తొలిగిపోతుంది.
- రెండు స్పూన్ల నాణ్యమైన శనగపిండి, రెండు స్పూన్ల మిల్క్ పౌడర్‌ను ఒక గిన్నెలో వేసి బాగా కలిపాక కొద్దిగా రోజ్ వాటర్ వేసి కలపాలి. చిక్కటి పేస్టు మాదిరిగా అయిన ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఆ తర్వాత పదినిమిషాలకు శుభ్రంచేస్తే తక్షణ గ్లో వస్తుంది.

**స్మార్ట్‌ఫోన్ లేని కాలంలో పిల్లలు ఎక్కువగా బయట ఆడుకోవడానికే ఇష్టపడేవారు. దీంతో పిల్లలు ఇంటిపట్టున ఉండడం లేదని తిట్ల దండకం అందుకునేవారు తల్లిదండ్రులు. అయితే ఈ స్మార్ట్ యుగంలోనూ పిల్లలకు తిట్లదండకం తప్పడం లేదు. కారణం.. పిల్లలు ఇంట్లో నుంచి బయటికి రాకుండా రోజంతా ఫోన్‌తో గడుపుతుండడమే. దీంతో చిన్నవయసులోనే ఎన్నో అనారోగ్య సమస్యలు. కొత్త పోకడలు, వింత అలవాట్లు. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా ఇద్దరు తల్లులు కొత్త కాన్సెప్ట్‌తో పిల్లలను ఆకర్షిస్తున్నారు. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలా ముందుకొచ్చారు.**




# చిట్టిచేతులు అద్భుతాలు చేసేలా..



సింధూరి

శ్రుతిరెడ్డి

**ప్రతి** తల్లి.. తన పిల్లలు ఉత్సాహంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటుంది. ఇలా ప్రతి తల్లికి సంతోషాన్ని పంచేందుకు ఈ ఇద్దరు మాతృమూర్తులు కొత్త పంథాతో పిల్లల దృష్టిని మరల్చుతున్నారు. ఆ కొత్త కాన్సెప్ట్ పేరే 'టెన్ లిటిల్ ఫింగర్స్'. ఇది పిల్లల్లో కళాత్మకతను వెలికితీసే సరికొత్త కార్యక్రమం. దీనిలో ముఖ్యమైంది 'డై స్టేషన్'. ఇందులో క్రిస్టల్ డైమండ్ మొసాయిక్ ఆర్ట్, డై క్లాక్స్, రైన్‌స్టోర్ ఆర్ట్, వాటర్ బీడ్స్, క్రిస్టల్ ఆర్ట్ పెయింటింగ్, క్రాఫ్ట్ కార్స్ డై, స్నో క్లే పెయింటింగ్, డై బ్యాగులు, లెగో క్యాప్స్, సాండ్ స్నో క్లే, కీ చెయిన్స్ వంటివి ఎలా తయారు చేయాలో నేర్పిస్తున్నారు. పిల్లలు కొత్తగా ఎలా తయారు చేయాలో, వాటికి ఎలాంటి తుదిరూపు తీసుకు రావాలో దగ్గరుండి నేర్పిస్తున్నారు. పిల్లలకు టైంపాస్‌తో పాటు, నాలెడ్జ్‌ను పెంచే ఎన్నో బొమ్మలు ఇక్కడ నేర్పిస్తున్నారు శ్రుతిరెడ్డి, సింధూరి ఉప్పుల. హైదరాబాద్‌కు చెందిన ఈ యంగ్ మదర్స్ పిల్లల్లో క్రియేటివిటీని వెలికి తీసేందుకు ఇలా నిరంతరం శ్రమిస్తున్నారు.



### పిల్లలకు ఏం నేర్పుతారంటే?

డై స్టేషన్‌లో ఒక్కొక్కరికి ఒక్కో కిట్ ఇస్తారు. ఆ కిట్‌తో ఎలాంటి బొమ్మలు రూపొందించాలో పిల్లలే నిర్ణయించుకోవాలి. మరో కాన్సెప్ట్‌లో పిల్లలకు ఒక బొమ్మకు సంబంధించిన కిట్ ఇస్తారు. ఆ కిట్‌లోని పరికరాలను ఉపయోగించి రంగులు వేయాల్సింది పిల్లలే. బొమ్మను బట్టి.. కిట్ ధర ఉంటుంది. రూ.200 నుంచి రూ.1200 వరకూ అందుబాటులో ఉన్నాయి. ఆ కిట్‌లో స్టిక్కర్, టేపు, గమ్.. డిజైన్ తయారీకి కావాల్సిన పరికరాలు ఉంటాయి. ఆ కిట్‌ను ఉపయోగించి చేతులకు, బట్టలకు రంగు అంటకుండా పెయింట్ చెయ్యవచ్చు. ఈ డై స్టేషన్‌లో ప్రత్యేకమైంది 'మాగ్నెటిక్ బేకింగ్'. ఇందుకు ప్రత్యేకంగా ప్రతిమలు ఉంటాయి. వాటిల్లో రంగు రంగుల పెయింట్ నింపి, దానిని కొద్ది సేపు వేడి చేస్తే మాగ్నటిక్ బొమ్మ రెడీ అవుతుంది. దానిని గోడలు, ఫ్రిజ్, కీబోర్డులు, తలుపులకు అతికించుకోవచ్చు. వీటితో పాటు క్రిస్టల్ ఆర్ట్, బ్యాగులు, డైమండ్ స్టిక్కరింగ్ ఆర్ట్ వంటివి డిజైన్‌కు తగినట్లుగా పిల్లలతో తయారు చేయిస్తారు. ఇందుకు కావాల్సిన రంగులు, ఫ్రేమ్‌లు, డిజైన్లన్నీ సింగపూర్, హాంకాంగ్ నుంచి దిగుమతి చేసుకుంటారు. ఈ టెన్ లిటిల్ ఫింగర్స్‌లో పిల్లలు చాలా ఉత్సాహంగా చురుగ్గా పాల్గొంటున్నారు. ఇవేకాకుండా.. గడియారంలో నంబర్లకు బదులు పిల్లల బొమ్మలతో అలంకరిస్తున్నారు పిల్లలు. ఇంకా లారీలు, బస్సులు, బేబీడాల్స్, వాటర్ బీడ్స్‌తో కీ చైన్లు వంటివి వారే తయారు చేస్తూ.. 'ఔరా' అనిపిస్తున్నారు. ఇలా ఎడ్యుకేషనల్‌గా, ఎంటర్‌టైన్‌మెంట్‌గా పిల్లలకు సరికొత్త విజ్ఞానాన్ని అందిస్తున్నారు శృతి, సింధు.

### హైదరాబాద్‌లో తొలిసారి!

హైదరాబాద్‌కు చెందిన శ్రుతి, సింధూరి ఒక రోజు సింగపూర్ వెళ్లారు. అక్కడ 'డై క్రియేటివ్ జోన్' వీరిని ఆకర్షించింది. పెద్దలకే ఇలా ఉంటే.. పిల్లలను ఇవెంతగా ఆకట్టుకుంటాయోననే ఆలోచనకు వచ్చారు. ఈ డై స్టేషన్ ఐడియాను ఎలాగైనా హైదరాబాద్‌కు పరిచయం చేయాలనే ఉద్దేశంతో భర్తల సహకారం తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రదేశం.. హాలిడే స్పాట్, హైదరాబాద్‌లోనే బిగ్ థియేటర్ అయిన ఐమాక్స్‌ను వేదికగా ఎంచుకున్నారు. దీనికి సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండేందుకు '10 లిటిల్ ఫింగర్స్' అని పేరు పెట్టారు. ఈ కాన్సెప్ట్ లోగోకు ఆక్టోపస్‌ను ఎంచుకున్నారు.

ప్రస్తుతం ఐమాక్స్, హిమాయత్‌నగర్‌లో ఓ ప్లే దగ్గర స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ నుంచి పిల్లలకు కావాల్సిన బొమ్మల కిట్‌లు కొనుకోలు చేయవచ్చు. ఈ ఆర్ట్‌తో పిల్లలకు ఏకాగ్రత పెరుగుతుంది, దేన్నైనా సులువుగా అర్థం చేసుకుంటున్నారని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు. వచ్చే ఇంటర్నేషనల్ ఫెయిర్‌కు వెళ్లి 200 నుంచి 300 వరకు డిజైన్లను పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు శ్రుతి, సింధూరి.

### అన్ని నగరాల్లోనూ..

ఈ డై స్టేషన్ ఇప్పటివరకు ఇండియాలోనే లేదు. మొదటిసారి దీన్ని హైదరాబాద్‌కు పరిచయం చేశారు శ్రుతి, సింధూరి. భవిష్యత్‌లో ఫోరంమాల్, ఇనార్బిట్‌మాల్, ఎయిర్‌పోర్ట్, ఇతర మాల్స్‌లలో ప్రవేశపెట్టే యోచనలో ఉన్నారు. అంతేకాకుండా మన దేశంలోని ప్రముఖ నగరాల్లో ఈ డైస్టేషన్‌ను విస్తరించాలనే ఉద్దేశంతో ఉన్నారు. వీటితో పాటు పుట్టినరోజు వేడుకలకు స్పెషల్‌గా మొబైల్ ఎక్విప్‌మెంట్‌తో కౌంటర్స్ పెట్టి, లైవ్ మాగ్నెట్ స్టేషన్‌ను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నారు శ్రుతి, సింధూరి. పలు స్కూళ్లకు వెళ్లి పిల్లలతో బొమ్మలు తయారు చేయించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. ఒకసారి ఈ డై స్టేషన్‌ను సందర్శించిన పిల్లలు తరచూ వస్తున్నారని, అందుకు చాలా సంతోషంగా ఉందని అంటున్నారు ఈ మిత్ర ద్వయం. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు డై స్టేషన్ స్టాల్స్ అందుబాటులో ఉంటాయి.

...వనజ వనిపెంట

బేగంపేట్ సంజయ్ చారి

### హాలీడేస్‌లో వర్క్‌షాపులు

మా పిల్లలతో పాటు అందరి పిల్లలను ఎంటర్‌టైన్ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. స్మార్ట్‌ఫోన్‌కు అడిక్ట్ అయిన పిల్లలను దారిలోకి తెచ్చేందుకు ఈ డై స్టేషన్ చాలా ఉపయోగపడుతుంది. అందుకే హాలీడేస్‌లో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని అనుకుంటున్నాం. పిల్లలు ఉదయం లేచింది మొదలు టీవీ, వీడియో గేమ్స్, య్యూటూబ్, టిక్‌టాక్‌లతో రోజంతా గడుపుతున్నారు. వీటివల్ల పక్కనున్న వారితో మాట్లాడడానికి కూడా సమయం ఉండడంలేదు. అందుకే ఈ కొత్త కాన్సెప్ట్. పూర్తి వివరాల కోసం https://www.facebook.com/10littlefingersss/ని సంప్రదించండి.

**- సింధూరి, శ్రుతిరెడ్డి,** డై స్టేషన్ నిర్వాహకులు

## కీలుమార్పిడి తర్వాత తేలిగ్గా నడవొచ్చా?




**నా వయసు 50 ఏండ్లు. కొంతకాలంగా మోకాళ్ల నొప్పి సమస్య వేధిస్తున్నది. నొప్పి నివారణ కోసం చాలా మందులు వాడాను. ఏవి చేసినా తాత్కాలిక ఉపశమనం కలిగించాయే తప్ప శాశ్వత పరిష్కారం చూపించలేదు. మోకాలు కీలుమార్పిడి చికిత్స ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని విన్నాను. ఇది ఎలా చేస్తారు? కీలు మార్పిడి చికిత్స తర్వాత ఎప్పటివలె నడవొచ్చా? మంచానికే పరిమితమవ్వాల్సి ఉంటుందా? ఆపరేషన్ తర్వాత నొప్పి ఎక్కువగా ఉంటుందా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది? తెలియజేయగలరు.**

**- సరోజ,** జడ్చర్ల

మీరు తెలిపిన లక్షణాలను బట్టి చూస్తే కీలుమార్పిడి ఆపరేషన్ ద్వారానే మీ సమస్యను పరిష్కరించవచ్చు. అయితే కీలు మార్పిడి చికిత్స గురించి ఎలాంటి అపోహలు వద్దు. మీరు అన్నట్లుగా ఈ చికిత్స చేసుకున్న తర్వాత మంచానికే పరిమితం కావాల్సిన అవసరం లేదు. శస్త్ర చికిత్స అయిన మూడవ రోజు నుంచే నడిచే అవకాశాలున్నాయి. అంతేకాదు మెట్లు కూడా ఎక్కవచ్చు. ఆపరేషన్ తర్వాత తీవ్రమైన నొప్పి ఏమీ ఉండదు. ఒకవేళ సాధారణ నొప్పులేమైనా వస్తే కొన్ని రకాల నొప్పి నివారణ మాత్రలు, ఇంజెక్షన్లు తీసుకొని ఉపశమనం పొందవచ్చు. అయితే చికిత్స తర్వాత ఎక్కువ బరువు మోయొద్దు. ఎలాగో మెట్లు ఎక్కొచ్చు కదా అని అదే పనిగా చేయొద్దు. కొవ్వు పదార్థాలు తీసుకోవద్దు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వీటివల్ల శరీరం బరువు పెరుగదు, కీళ్లు ఎక్కువకాలం దృఢంగా ఉంటాయి. రన్నింగ్ చేయొద్దు. ఫైనల్‌గా చెప్పేదేంటంటే.. మోకాలు కీలు మార్పిడి చికిత్స ద్వారా కదల్లేని వ్యక్తికి కొత్త జీవితాన్ని ఇవ్వొచ్చు.

**డాక్టర్ హరీష్**
కన్సల్టెంట్
ఆర్థోపెడిక్ సర్జన్
కేర్ హాస్పిటల్స్
బంజారాహిల్స్



### వంటింటి చిట్కాలు



- పుసుపు, కారం, కరివేపాకు పొడిలాంటివి నిల్వ చేసేటప్పుడు చిటికెడు ఇంగువ కలిపితే ఏడాదిపాటు నిల్వ ఉంటాయి.
- కారప్పొడిలో కాసిన్ని వేరుశనగ గింజలను వేయించి పొడిగొట్టి కలుపుకొంటే.. ఇడ్లీలు, దోశల్లోకి బాగుంటుంది.
- కాఫీల రుచి పెరగాలంటే.. డికాషిన్‌లో నిమ్మకాయ చెక్క వేసుకోవాలి.
- పెరుగు సరిగ్గా తోడుకోకుండా పల్చగా ఉంటే.. ఓ బేసిన్‌లో వేడినీళ్లు పోసి ఆ గిన్నెను ఆ నీటిలో ఉంచి మళ్లీ నీళ్లను మరగపెడితే కొద్దిసేపట్లో గడ్డ పెరుగు తయారవుతుంది.

నమస్తే తెలంగాణ
యువ
[ కరీంనగర్ ]
బుధవారం 3 జూలై 2019

# నృత్య తరంగం నిహారిక





**కళ్లల్లోంచి వీరం. కనుబొమ్మల్లోంచి రౌద్రం. ముఖ కవళికల్లోంచి భయానకం. పెదాల్లోంచి హాస్యం. హృదయాంతరాలలోంచి కరుణ. చేతులు చూపించే శాంతం, ఆద్యంతం ఆమె నృత్యం అద్భుతం. నవరసాలు పలికించే ప్రతిభ ఆమె సొంతం. ఆమె స్టేజీ ఎక్కితే ప్రతిధ్వనిస్తాయి చప్పట్ల శబ్దాలు. నటరాజును తలపించే నృత్యం, కోయిలమ్మను అనుసరించే గాత్రం.. భావం, రాగం తాళం ఏకమైన సమయం. మనసు పులకించే సమయం. అతిచిన్న వయసులోనే భరతనాట్యంతో అద్భుత భావాలు పలికిస్తూ ఇటీవలే అరంగేట్రం చేసిన యువతి మనోగతమిది..**

**పాదం** నేలను ముద్దాడే సమయంలో ఆమె చేతులు పంచభూతాలకు ప్రణామం చేస్తాయి. రాగం చెవిని చేరే సమయాన ఆమె గుండె లయ తాళమై ప్రతిధ్వనిస్తుంది. నవరసాలు పలికించే పురాతన నృత్యంలో ఆమె తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకుంటుంది. ఒక్కో భంగిమ వేల భావాల్ని పలికిస్తుంటే రోజులు గడిచినా ఆమె నాట్యం ప్రేక్షకుల కళ్లల్లో కదలాడుతూనే ఉంటుంది..

దొంతినేని నిహారిక స్వస్థలం హైదరాబాద్. ఆమె ప్రస్తుతం బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుతున్నది. బాల్యం నుంచి నిహారికకు కళలంటే ఆసక్తి. ఇంట్లోని వారు కూడా ఆమెకు సహకరించడంతో 9వ ఏట నుంచే భరతనాట్యం సాధన చేయడం ప్రారంభించింది. తన సోదరి మాళవిక కూచిపూడి నృత్యకారిణి కావడంతో ఆమె ప్రోత్సాహంతో నిహారికకు భరతనాట్యం నేర్చుకోవాలనే ఆసక్తి ఏర్పడింది. కొన్నాళ్లు ఇంట్లోనే సాధన చేసింది. ఆ తర్వాత నృత్య గురువు హేమమాళిని దగ్గర భరత నాట్యం నేర్చుకున్నది. నిత్యం సాధన చేస్తూ కళ కోసం ఏండ్లుగా తపస్సు చేస్తున్నది. తన సోదరి మాళవిక ప్రోత్సాహంతో ఇంట్లో చిన్నచిన్నగా సాధన చేసిన నిహారిక ప్రారంభంలో చాలా ఇబ్బంది పడినప్పటికీ హేమమాళిని అర్ని దగ్గర మెళకువలు నేర్చుకున్నది.

**మొదటి ప్రదర్శన:** హైదరాబాద్‌లోని కొండాపూర్ రామాలయంలో 2012లో నృత్య రూపక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మొదట ఇద్దరు ముగ్గురు నృత్య ప్రదర్శనలు చేసిన తర్వాత ప్రదర్శన ఇవ్వాలని చిన్నారుల బృందాన్ని స్టేజీపైకి పిలిచారు. అక్కడున్న వారంతా ఈ చిన్నారులేం ఏం ప్రదర్శన ఇస్తారులే అని అనుకున్నారు. కానీ ఆ బృందంలోని చిన్నారి నిహారిక మాత్రం అక్కడున్న వారందరి దృష్టిని ఆకర్షించింది.

నృత్యం ప్రారంభించిన తర్వాత ఆ ప్రదేశం కరతాళ ధ్వనులతో మార్మోగింది. 12 ఏండ్ల వయసులో నిహారిక మొదటిసారి తన కళను అద్భుతంగా ప్రదర్శించడంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. అప్పటి నుంచి మరింత కష్టపడుతూ నిత్యం సాధన చేసింది నిహారిక. 15 ఏండ్ల వయసులో భరత నాట్యగురువు గీతా గణేషన్ దగ్గర మరిన్ని మెళకువలు నేర్చుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 20కి పైగా ప్రదర్శనలు ఇచ్చింది.

### కళను పేదలకు పరిచయం చేస్తా..

భరతనాట్యం కేవలం కళ మాత్రమే కాదు. ఆత్మస్థైర్యం పెంపొందించడానికి సాధనం. బాడీలాంగ్వేజ్ డెవలప్ కావడానికి మార్గం. జీవితంలో తన కాళ్లమీద తాను నిలబడగలననే ఆత్మస్థైర్యం. నిత్య జీవితంలో సన్మార్గంలో జీవించడానికి భరతనాట్యం ఒక మార్గం. ఈ కళను పేద కళాకారులకు నేర్పిస్తా. 2020లో మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం మాళవిక, రిషిక నేను కలిసి 'దొంతినేని సిస్టర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్ అండ్ కల్చర్ ఆర్ట్స్' అని ట్రస్టు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. గ్రామీణ పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించి కళల్ని నేర్పించాలనుకుంటున్నాం. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, అండగా నిలిచిన గురువులకు రుణపడి ఉంటాను.

**- దొంతినేని నిహారిక,**
భరతనాట్య కళాకారిణి

**కూతురు కోసం ఇంజినీర్ ఉద్యోగం వదిలి:** దొంతినేని రవీందర్ రావు, రమ్య దంపతుల మూడో కుమార్తె నిహారిక. వీరి కుటుంబానికి కళలకు విడదీయలేని బంధం ఉంది. నిహారిక సోదరి మాళవిక కూచిపూడి నృత్యకారిణి. మరో సోదరి రిషిక సంగీతంలో దిట్ట. బాల్యం నుంచి కళల ప్రపంచంలో పెరగడంతో నిహారికకు కూడా భరతనాట్యంపై, సంగీతంపై ఆసక్తి బాగా పెరిగింది. నిహారిక తల్లి రమ్య ఇంజినీర్. తన కూతుళ్ల కోసం వృత్తిని వదిలేసింది. కూతుళ్లకు కళలు నేర్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నది. నిహారిక పాఠశాల స్థాయి నుంచి ఎన్నో అవార్డులు, బహుమతులు గెలుచుకుంది.

**ప్రత్యేకతలు:** భరతనాట్యం అందరూ చేస్తారు. కానీ కొందరే అన్ని రసాలను పలికిస్తారు. ఒక్కసారి చూస్తే కండ్లల్లో మెదిలే కళను ప్రదర్శిస్తారు. ఆ కోవకు చెందిన వారే నిహారిక. తన కళ ద్వారా ముఖ కవలికల ద్వారా అద్భుత కళను నిహారిక ప్రదర్శిస్తున్నది. ఒక్క భరతనాట్యమే కాకుండా బేకరీ ఐటమ్స్ తయారు చేయడంలోనూ నిష్ణాతురాలు. అంతేకాకుండా ఐదేళ్ల క్రితం నుంచి ఫణినారాయణ దగ్గర సంగీతంలో మెళకువలు నేర్చుకుంటున్నది.

... పడమటింటి రవికుమార్ ■ జి. చిన్న యాదగిరిగౌడ్

# శత్రువులు ప్రేమలో పడ్డారు!



**30 ఏండ్ల పాటు అంతర్యుద్ధంతో అతలాకుతలమైంది శ్రీలక. ఇంత పెద్ద యుద్ధంలోనూ రెండు మనసులు ఒక్కటయ్యాయి. ఇది సినిమా కథ ఏమాత్రం కాదు. అంతకు మించి స్వచ్ఛమైన ప్రేమకథ. ప్రస్తుతం ఈ ప్రేమికుల వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్ అవుతున్నది.**

రోషన్ శ్రీలంక భద్రతాదళ అధికారి. గౌరీ ఎల్‌టీటీఈలో పనిచేసేది. ఇరు వర్గాలకు ఎప్పుడూ యుద్ధం జరుగుతూనే ఉండేది. ఉద్యోగ రీత్యా ఇద్దరు శత్రువులు. రోషన్ సింహళ సంప్రదాయానికి చెందిన వాడు కాగా గౌరి తమిళ అమ్మాయి. 2009లో శ్రీలంక అంతర్యుద్ధంలో ఆమె తమిళ టైగర్ల తరపున పోరాడారు. యుద్ధ సమయంలో రోషన్‌కు గౌరీ ఎదురుపడింది. ఆ సమయంలో తనను చంపేస్తాడేమోనని గౌరీ భయపడింది. కానీ ఆమె కళ్లల్లోకి చూస్తూ రోషన్ ఉండిపోయాడు. అప్పుడు పుట్టిన ప్రేమ వివాహం వరకూ వెళ్లింది. ప్రస్తుతం వీరికి ఒక పాప. ఆమెకు గౌరీ, రోషన్ వారి వారి సంప్రదాయాలను నేర్పిస్తున్నారు. 'శత్రువులను సైతం ఒక్కటి చేసే శక్తి ఒక్క ప్రేమకు మాత్రమే ఉంది'. అని వీరి వీడియోను యువత సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నది.

# గడ్డం ఆరోగ్యానికి అడ్డం



**ఇటీవల గడ్డం పెంచే యువత సంఖ్య పెరిగిపోతున్నది. ఈ క్రమంలో గడ్డం పెంచితే అనారోగ్యం పాలవడం ఖాయమని ఒక అధ్యయనం ద్వారా వెల్లడైంది. శునకాల బొచ్చుతో పోలిస్తే పురుషుల గడ్డంలోనే ఎక్కువ క్రిములు ఉంటున్నట్లు తెలుస్తున్నది ఈ అధ్యయనం.**

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు బియర్డ్(గడ్డం పెంచడం) ట్రెండ్ కొనసాగుతున్నది. సర్కిల్ బియర్డ్, రాయల్ బియర్డ్, వాన్ డైక్ బియర్డ్ అంటూ రకరకాల షేపుల్లో గడ్డం పెంచుతున్నారు మగవాళ్లు. ఆకట్టుకునే ముఖం కోసం, ఫ్యాషన్ కోసం ఒకరిని చూసి మరొకరు ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా గడ్డంలో క్రిములు పేరుకుపోయి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల స్విట్జర్లాండ్‌లోని హిర్స్లాండెన్ క్లినిక్ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఆండ్రియాస్ గుట్ జీట్ నేతృత్వంలో ఓ అధ్యయనం నిర్వహించారు. ఈ అధ్యయనంలో భాగంగా వారు ఎంఆర్ఐ స్కానర్‌లోకి శునకాలను పంపారు. తర్వాత మరో రెండు స్కానర్లలోకి గడ్డం ఉన్న వ్యక్తులను పంపి పరిశీలించారు. రెండింటినీ పోల్చి చూశారు. ఆండ్రియస్ బృందం పరిశీలనలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. శునకాల బొచ్చుతో పోలిస్తే ఆ పురుషుల గడ్డంలోనే ఎక్కువగా బ్యాక్టీరియా, ఇతర క్రిములు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. గడ్డాన్ని వీలైనంత తక్కువగా పెంచుకుంటే మంచిదని వారు చెబుతున్నారు.



# ఓల్డ్ ఈజ్ గోల్డ్

**ఫ్యాషన్ ప్రపంచం ఎప్పుడు ఎలా మారుతుందో తెలియదు. ఈ రోజు మార్కెట్లో ఉన్న ట్రెండ్ రేపు మారొచ్చు. పెద్ద గల్లా చొక్కా, పొట్టి నిక్కరు ముప్పై ఏండ్ల కిందట ఫేమస్. కాలక్రమంలో అవి మరుగున పడిపోయాయి. కానీ ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ ప్యారిస్‌కు చెందిన ఓ మోడల్ ధరించిన దుస్తులు ప్రస్తుతం సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నవి.**

ప్యారిస్‌లో ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభంలో రేస్‌ట్రాక్ నిర్వహిస్తూ ఉంటారు. ఇందులో అక్కడి మోడల్స్ వివిధ రకాల దుస్తులు ధరించి రేస్ ట్రాక్ పై నడుస్తారు. అయితే ఇటీవల జరిగిన రేస్ ట్రాక్‌లో మియూ మియూ అనే మోడల్ 1930 కాలం నాటి దస్తుల్ని ధరించి ట్రాక్‌పై నడిచింది. అక్కడున్న వారందరి చూపును తన వైపునకు తిప్పుకున్నది. పొట్టి నెక్కరు, షర్టు ధరించింది. వీటిపై నుంచి పెద్ద గల్లా ఉన్న ఓ పొడవాటి సూట్‌ను ధరించింది. రంగు రంగుల షూ వేసుకుని మియూ మియూ ట్రాక్‌పై నడుస్తుంటే అక్కడున్న వారంతా కేరింతలు కొట్టారు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ కేకలు పెట్టారు. ఈ షో అనంతరం అక్కడి షాపింగ్ మాళ్లలో ఈ మాదిరి దుస్తులు చాలామంది అడిగారట. ప్రస్తుతం అన్ని షాపింగ్ మాళ్లలో మియూ మియూ మోడల్ డ్రెసెస్ అందుబాటులో ఉన్నాయి. అక్కడి మార్కెట్లో సైతం వాటికి భారీ డిమాండ్ ఉన్నది.

# బ్రాస్‌లైట్ లాంటి వాచ్!

**చేతికి బ్రాస్‌లైట్ అందం. కానీ అదే బ్రాస్‌లైట్‌లో వాచీ కూడా దాగుంటే మరింత అందం. ప్రస్తుతం మార్కెట్లో లభించే వాచీలు బ్రాస్‌లైట్ మాదిరిగా కూడా ఉపయోగపడుతున్నాయి. యువతను ఆకర్షించే వాచీల్లో ఒకటి ఫోసిల్ డిజిటల్ బ్ల్యూ డయల్ యూనిసెక్స్ వాచ్.**

పూర్తిగా లెదర్‌తో తయారు చేసిన ఫాసిల్ డిజిటల్ బ్ల్యూ డయల్ యునిసెక్స్ వాచ్ ధర రూ.7 వేలు. ప్రస్తుతం అమెజాన్ ఫ్లిప్‌కార్ట్‌లలో ఈ వాచీలు అందుబాటులో ఉన్నాయి. బ్రాస్లైట్ మాదిరిగా ఉన్న ఈ వాచీ డిజిటల్ తెరపై సమయం చూపిస్తుంది. రెండు సంవత్సరాల వారంటీతో లభిస్తుంది. అంతే కాదు. ఈఎంఐలోనూ ఈ వాచీ లభిస్తుంది. ఐదు గ్రాముల బరువుండే ఈ వాచీ పూర్తిగా వాటర్‌ప్రూఫ్. దీన్ని బ్రాస్‌లైట్ మాదిరిగా కూడా యువత వాడుతున్నది. వివాహ సమయాల్లో, పుట్టిన రోజుకు ప్రత్యేకంగా బహుమతిగా కూడా ఇస్తున్నారు. ఈ వాచీ ఒక్కసారి కొంటే భవిష్యత్‌లో మళ్లీ వాచీ కొనాల్సిన అవసరం లేదంటూ ఆ సంస్థ మార్కెటింగ్ చేస్తున్నది. అంత నాణ్యతతో తయారైన వాచీని కొనుగోలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.



## సుడోకు

డైలీ సుడోకు 79 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 7 | 9 | 2 | 5 | 1 | 8 | 4 | 6 |
| 1 | 5 | 4 | 7 | 6 | 8 | 9 | 2 | 3 |
| 2 | 6 | 8 | 3 | 9 | 4 | 5 | 1 | 7 |
| 7 | 3 | 2 | 6 | 4 | 9 | 1 | 8 | 5 |
| 5 | 9 | 1 | 8 | 3 | 2 | 7 | 6 | 4 |
| 8 | 4 | 6 | 1 | 7 | 5 | 2 | 3 | 9 |
| 9 | 1 | 3 | 4 | 2 | 7 | 6 | 5 | 8 |
| 4 | 8 | 5 | 9 | 1 | 6 | 3 | 7 | 2 |
| 6 | 2 | 7 | 5 | 8 | 3 | 4 | 9 | 1 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -80


| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 | 9 | 3 | | | | |
| | 8 | 1 | | | 6 | | | |
| | | | 1 | | | 3 | 4 | 8 |
| | 2 | 7 | | | | | 3 | |
| | | | | | | | | |
| | 1 | | | | | 8 | 9 | |
| 6 | 4 | 5 | | | 1 | | | |
| | | | 5 | | | 7 | 6 | |
| | | | | 6 | 9 | 2 | | |

## ట్వీట్



హాయ్ డార్లింగ్స్. ఆస్ట్రేలియాలోని ఇన్స్‌బ్రక్, టిరోల్ ప్రాంతంలో షూటింగ్ జరుగుతున్నది. ఇక్కడ నా అనుభవాలు అద్భుతమనుకోండి. దాంట్లో ఇదొక్కటి.

ప్రభాస్
@PrabhasRaju



ప్రభాస్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య

1,42,8460

## కామన్‌మ్యాన్ వాయిస్

పసిపిల్లలపై అత్యాచారాలకు ఉరిశిక్ష ఖరారు చేస్తూ ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి సంతకం చేశారు కదా. ఈ శిక్ష అమలుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చేలా ఒత్తిడి తెచ్చిన శ్రీహిత నిండు ప్రాణం చీకటిలో కలిసి పోయినా మరో బిడ్డకు ఈ గతి రాకుండా ఉంటే చాలు!
– Swapna Satheesh Kumar

టీవీలో, న్యూస్ పేపర్లో తప్ప మోదీ మన్‌కీ బాత్ రేడియోలో వినేవాళ్లు ఎవరన్నా ఉన్నారా?
– Nawin Samala

ఆస్తిని ప్రేమించే వారికంటే.. తన వాళ్లనే ఆస్తిగా భావించేవాళ్లే ముఖ్యం!
– Raghu K Shetti

## వైరల్ వీడియో




**రియల్ స్టార్ శ్రీహరి కొడుకు మేఘాంశ్ హీరోగా నటిస్తున్న చిత్రం రాజ్‌దూత్. బైక్ నేపథ్యంలో సాగే ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ యూట్యూబ్‌లో సందడి చేస్తున్నది.**

RajDooth Theatrical Trailer | Meghamsh Srihari | 2019 Latest Telugu Movies | Telugu FilmNagar

Total views : 376,933+


Published on Jun 30, 2019

నమస్తే తెలంగాణ
# సంకేత
[ కరీంనగర్ ]
బుధవారం 3 జూలై 2019
టెక్నాలెడ్జీ 2.0

టెక్ చిట్కాలు

## ఎక్కువ సైజ్ డేటా మెయిల్ చేయాలా?


**ఫైల్ ట్రాన్స్‌ఫర్ కోసం మనం మెయిల్‌ను ఎక్కువగా వాడుతుంటాం. కానీ 25 ఎంబీల కంటే ఎక్కువ సైజ్ ఉంటే అది డ్రైవ్ లోకి వెళ్తుంది. అప్‌లోడింగ్‌కు కూడా ఎక్కువ టైం పడుతుంది. అనవసరం అనుకున్న డేటా అంతా డ్రైవ్‌లో సేవ్ అవుతుంది. ఇలాంటి డేటాను క్షణాల్లో ట్రాన్స్‌ఫర్ చేయాలంటే ఎలా?**




ఎక్కువ సైజ్ ఉన్న డేటాను క్షణాల్లో ట్రాన్స్‌ఫర్ చేయడానికి wetransfer.com చక్కని ప్లాట్ ఫామ్. 2 జీబీ సామర్థ్యం ఉన్న ఫైల్స్‌ను కూడా క్షణాల్లో అవతలి వారికి పంపవచ్చు. ఇదంతా వారికి రెగ్యులర్ ఈమెయిల్ ద్వారా అందుతుంది. wetransfer లోకి వెళ్లి ఇందులో ఫైల్స్‌ను అప్‌లోడ్ చేయాలి. తర్వాత అవతలి వారి మెయిల్ అడ్రస్‌ను ఎంటర్ చేయాలి. అప్‌లోడ్ అయ్యాక సెండ్ చేయాలి అంతే. వెంటనే వారికి మెయిల్‌లో ఒక లింక్ వెళ్తుంది. ఆ లింక్ ద్వారా మీరు పంపిన డేటాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## వాట్సప్ నుంచి మల్టీ చాటింగ్

**వాట్సప్ ఎప్పటికప్పుడూ కొత్త ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నది. ఇప్పుడు తాజాగా మరో ఫీచర్‌ను జోడించబోతున్నది.**



వాట్సప్‌లో మల్టీ చాటింగ్ ఫీచర్ అందుబాటులోకి రానున్నది. ఈ ఫీచర్ ద్వారా ఒకే ప్లాట్ ఫాం నుంచి మల్టిపుల్ ప్లాట్ ఫాంలపై చాటింగ్ చేసుకోవచ్చు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, జీమెయిల్, గూగుల్ ఫొటోలు ప్లాట్ ఫాలంపై స్టోరీల స్టేటస్ పోస్టులను షేర్ చేసుకోవచ్చు. ప్రస్తుతానికి ఈ ఫీచర్ టెస్టింగ్ దశలో ఉంది. వాట్సప్ యూజర్లు తమ స్టేటస్ పోస్టులను షేర్ చేయాలంటే తమ అకౌంట్లను ఫేస్‌బుక్ అకౌంట్‌కు లింక్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్ ల్లోని API టెక్నాలజీ డేటా షేరింగ్ ద్వారా వాట్సప్‌లోని స్టేటస్ పోస్టుకు మరో ప్లాట్ ఫాంలోకి షేర్ చేసుకునే అవకాశం ఉంది. API ఎనేబుల్ ఇతర ఏ యాప్స్‌తోనేనైనా తమ స్టేటస్ పోస్టులను యూజర్లు షేరింగ్ చేసుకోవచ్చు.




# హైదరాబాద్ అరచేతిలో..

**హైదరాబాద్ విస్తరిస్తున్న పెద్ద నగరం. రోజుకు వేల మంది వస్తుంటారు. చదువు కోసమో, ఉద్యోగం కోసమో, వృత్తి కోసమో, ఉపాధి కోసమో హైదరాబాద్‌లో అడుగు పెడతారు. అంతా కొత్తగా ఉంటుంది. ఎవరికీ ఎవరూ తెలియరు. కొందరికి ఎలాంటి పరిచయాలుండవు. కొన్ని రోజులు అయోమయ పరిస్థితులు ఏర్పడతాయి. ఇలాంటి సమయంలోనే హైదరాబాద్‌లో కొన్ని మొబైల్ యాప్‌లు సాటి మనిషిలా సాయపడతాయి. హైదరాబాద్‌కు వచ్చే ముందు వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.**

**అర్ధరాత్రి** బస్ దిగారు. బస్సులు, ఆటోలు అందుబాటులో ఉన్నట్టుగా అనిపించడం లేదు. ఏమీ చేయాలో తోచడం లేదు. వెంటనే మొబైల్ తీసి క్యాబ్ బుక్ చేయొచ్చు. ఉదయాన్నే లేచి మీరు ఒక ప్లేస్‌కు వెళ్లాలి. కానీ సరైన దారి తెలియదు. ఎవరిని అడిగినా క్లియర్‌గా చెప్పరు. అందుకే వెళ్లాల్సిన ప్రదేశాన్ని సెర్చ్ చేస్తే మీకు దారి చూపించే బాధ్యత ఇంటర్‌నెట్ తీసుకుంటుంది. మీరు రూంలో ఉంటారు. ఆకలవుతుంది. వండుకొనే ఓపిక ఉండదు. హడావుడి పడాల్సిన అవసరం లేదు. ఓ యాప్ ఓపెన్ చేసి ఫుడ్ ఆర్డర్ చేయొచ్చు. ఇలా సందర్భమేదైనా, సమయమేదైనా హైదరాబాద్ వచ్చే ఎవరికైనా సరే ఈ యాప్స్ హెల్ప్ చేయడానికి రెడీగా ఉన్నాయి.

### సిటీ బస్ ప్రయాణం



బస్టాప్‌లో నిల్చున్నారు. రకరకాల బస్సులు వస్తున్నాయి. ఏవేవో నంబర్లు వేసి ఉన్నాయి. కానీ మీరు వెళ్లాల్సిన ఏరియాకు ఏ బస్ వెళ్తుందో తెలియదు. మరి ఏ బస్ వెళ్తుందో ఎలా గుర్తు పట్టాలి. ఆ ఏరియాకు వెళ్లాలంటే ఏ నంబర్ బస్సెక్కాలి. ఇలా సిటీ బస్ వివరాలను తెలపడానికి హైదరాబాద్ ఆర్టీసీ పేరుతో యాప్ ఉంది. హైదరాబాద్‌లో ఆర్టీసీ నడిపే సిటీ బస్సులు నగరవాసులకే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారికి నిత్యం ఉపయోగపడుతున్నాయి. హైదరాబాద్ ఆర్టీసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నామంటే బస్సుల సమాచారం అంతా అరచేతిలో ఉన్నట్టే..

### సాయం కావాలా?




నగరాల్లో ఎలాంటి సమాచారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉంది 'జస్ట్ డయల్'. ఆస్పత్రులు, హోటళ్లు, కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు, సినిమా థియేటర్లు, ట్రావెలింగ్ సర్వీస్‌లు ఇలా సరైన వివరాలు అందిస్తుంది జస్ట్ డయల్. మీ పరిధిలో ఉండే దేని వివరాలైన తెలుసుకోవాలంటే జస్ట్ డయల్‌ను సంప్రదించవచ్చు. ఇది యూజర్‌కు లోకల్ సెర్చ్ ఇంజిన్‌గా పని చేస్తుంది. వివిధ రకాల సర్వీస్‌ల సమాచారాన్ని వినియోగదారులకు అందిస్తుంది.

### మెట్రో ప్రయాణమా?



హైదరాబాద్ మెట్రో ప్రయాణం అంటే కాదనని వారు ఉండరు. సులభంగా, సాఫీగా ప్రయాణం చేయడానికి మెట్రోను వినియోగించుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా సమయాన్ని ఆదా చేసుకోవడానికి మెట్రో ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి ప్రయాణికుల కోసం మెట్రో ప్రత్యేకమైన స్మార్ట్ ఫోన్ యాప్‌ను తయారు చేసింది. Tsavaari పేరుతో ఇది ఆండ్రాయిడ్, ఐఓస్ కోసం అందుబాటులో ఉంది. ఇందులో మెట్రో వివరాలు, చార్జీలు, దూరం, సమయం అన్నీ క్లుప్తంగా ఉంటాయి. దగ్గర్లోని మెట్రోస్టేషన్ లోకేషన్లను కూడా చూపిస్తుంది. అవసరం అయితే క్యాబ్‌లను కూడా ఈ యాప్ నుంచి బుక్ చేసుకోవచ్చు. అలాగే లోకల్‌లో ప్రయాణించడానికి ఎంఎంటీఎస్‌లు కూడా ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవడానికి mmts 4u యాప్ అందుబాటులో ఉంది.

### సినిమాకు వెళ్తున్నారా?




అభిమాన హీరో సినిమాను మొదటి రోజు, మార్నింగ్ షో చూడాలంటే ఎంతకష్టం!. అసలు టికెట్లు దొరుకుతాయో లేదో అనే సందేహం! దొరకాలంటే ఎంత కష్టపడాలి. ఎంత సేపు లైన్లో నిలబడాలి? అనే సందేహాలు సహజంగానే వస్తాయి. అసలు ఇప్పుడు సినిమా చూడాలంటే లైన్లో నిలబడాల్సిన పని లేదు. చేతిలో ఫోన్, డేటా, బ్యాంకులో బ్యాలెన్స్ ఉంటే చాలు. ఏ సినిమా అయినా, ఏ షో టికెట్టయినా ఈజీగా బుక్ చేసుకోవచ్చు. book my show యాప్‌తో నగరంలోని థియేటర్లలో టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఇది దేశవాప్తంగా సర్వీస్ ఇస్తున్న యాప్. ఆఫర్లు, డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్‌లు పొందవచ్చు.

### ప్రయాణమా?



నగరంలో అర్జంట్‌గా ఒక ప్రదేశానికి వెళ్లాలి. బస్టాప్ దూరంగా ఉంది. ఒకవేళ అక్కడికి వెళ్లినా బస్ ఏ టైంకు వస్తుందో తెలియదు. అలాంటి టైంలోనే క్యాబ్ ఉంటే బాగుండు అనిపిస్తుంది. కానీ ఎవరిని అడగాలో తెలియదు. అలాంటి వారి కోసమే మీకు క్యాబ్‌ను ఐదు నిమిషాల్లో అరేంజ్ చేస్తాం అంటున్నాయి ఎన్నో సంస్థలు. హైదరాబాద్ క్యాబ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్కోండి. అన్ని రకాల క్యాబ్‌ల సమాచారం అందుబాటులో ఉంటుంది. ఓలా, ఉబర్, స్కై క్యాబ్స్ కంపెనీలు ప్రయాణికులకోసం క్యాబ్‌లు అందిస్తున్నాయి. సిటీ లోపల, సిటీ బయట తదితర కేటగిరీల్లో క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయి. కారు కాకుండా బైక్ మీద వెళ్లాలి అనుకుంటే 'ర్యాపిడో' ఉంది. బైక్‌ను అద్దెకు తీసుకోవాలనుకుంటే 'vogo bikes' ఉంది. బస చేయడానికి ఓయో, ఫ్యాబ్ యాప్‌ల ద్వారా హోటళ్లను బుక్ చేసుకోవచ్చు.

... వినో..

## ఎల్ జీ కొత్త ఫోన్

**ఎల్‌జీ స్టైల్ 5 ఫోన్‌ను ఆ కంపెనీ రెండ్రోజుల క్రితం విడుదల చేసింది. సాధారణ బడ్జెట్ ధరలో ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి.**




| | | |
|---|---|---|
| డిస్‌ప్లే | : | 6.20 అంగుళాల ఫుల్ హెడీ |
| ప్రాసెసర్ | : | 1.8 జీహెచ్‌జడ్ అక్టా కోర్ |
| ర్యామ్ | : | 3, 4 జీబీ వేరియేషన్ |
| స్టోరేజీ | : | 32, 64 జీబీ వేరియేషన్ |
| ఓఎస్ | : | ఆండ్రాయిడ్ 9 పై |
| రియర్ కెమెరా | : | 13 మెగాపిక్సెల్స్ |
| ఫ్రంట్ కెమెరా | : | 5 మెగాపిక్సెల్స్ |
| బ్యాటరీ | : | 3500mAh |
| ధర | : | రూ.15 వేలు |

## గూగుల్.. కొత్త టూల్..



**గూగుల్ కొత్త టూల్‌ను పరిచయం చేసింది. గూగుల్ సెర్చ్‌లో వెతికిన యూజర్ల డేటాను ఇప్పటి వరకూ మాన్యువల్‌గా డిలీట్ చేయాల్సి ఉండేది. ఇక నుంచి అలా అవసరం లేదు. సెర్చ్ డేటాను ఆటోమేటిక్‌గా డిలీట్ చేసే ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది.**

ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్ రెండిటీలో యూజర్లు సెర్చ్ చేసిన డేటాను ఆటోమేటిక్‌గా, మాన్యువల్‌గా కూడా డిలీట్ చేసుకోవచ్చు. లొకేషన్ ట్రాకింగ్,వెబ్, యాప్ యాక్టివిటీ హిస్టరీని కంట్రోల్ చేయవచ్చు. ఇప్పటి నుంచి యూజర్లు తమ బ్రౌజర్ లో ట్రాకింగ్ ప్రిఫెరెన్సెస్ సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. 3 నెలలు లేదా 18 నెలలు వరకు సెట్ చేసుకోవచ్చు. ఎలా సెట్ చేసుకుంటే అలా.. మీ డేటా ఆటోమాటిక్ గా ఆ సమయానికి డిలీట్ అయిపోతుంది. ఇందుకోసం గూగుల్ 'Auto-Delete Tool' ను ప్రవేశపెట్టింది. యూజర్ ప్రైవసీ సమస్యపై ఇటీవల జరిగిన డెవలపర్ కాన్ఫిరెన్స్‌లో గూగుల్, ఆపిల్ సహా ఇతర టెక్ దిగ్గజాలు సుదీర్ఘంగా చర్చించాయి. ఈ సమావేశంలో యూజర్ల ప్రైవసీ కోసం కొత్త టూల్స్ ప్రవేశపెట్టాలని నిర్ణయించాయి. థర్డ్ పార్టీ యాప్స్‌ల్లో యూజర్లు షేర్ చేసిన డేటా దుర్వినియోగం కాకుండా ఉండాలంటే ఆటో డిలీట్ టూల్ వంటి ఫీచర్లు ప్రవేశపెట్టాలని నిర్ణయించాయి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## బార్క్‌లో జేఆర్ఎఫ్

**డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ) కి చెందిన బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) ఖాళీగా ఉన్న జూనియర్ రిసెర్చ్ ఫెలో కోసం ప్రకటన విడుదల చేసింది.**

- జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)
- **మొత్తం ఖాళీలు:** 25
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్‌ల్లో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణత. యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్ లేదా జెస్ట్, ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్, ఐసీఏఆర్ జేఆర్ఎఫ్, డీబీటీ-జేఆర్‌బీ బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- **స్టయిఫండ్:** రెండేండ్ల వరకు రూ. 31,000/-, మూడో ఏడాదిలో ఎస్ఆర్ఎఫ్‌కు రూ. 35,000/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 12
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టులో
- **వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in

## 200 ఖాళీలు | రాయ్‌పూర్ ఎయిమ్స్

**రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **మొత్తం పోస్టులు-** 200 (జనరల్-79, ఈడబ్ల్యూఎస్-20, ఓబీసీ-56, ఎస్సీ-29, ఎస్టీ-16)
- **పోస్టు పేరు:** స్టాఫ్ నర్స్ (గ్రేడ్ -2)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నాలుగేండ్ల బీఎస్సీ ఆనర్స్/నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్టు సర్టిఫికెట్), బీఎస్సీ నర్సింగ్ (పోస్టు బేసిక్) లేదా జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ డిప్లొమాలో ఉత్తీర్ణత. 50 బెడ్‌లు కలిగిన ఏదైన హాస్పిటల్/హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్‌గా రెండేండ్లపాటు పనిచేసిన అనుభవం ఉండాలి. నర్స్ & మిడ్‌వైఫరీలో సెంట్రల్/స్టేట్ లేదా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వం లేదా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 44,900-1,42,400/-
- **వయస్సు:** 21 నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ప్రొబేషనరీ పీరియడ్:** రెండేండ్లు




- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ.1000/-, ఎస్సీ, ఎస్టీలకు రూ. 800/- పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/ రాతపరీక్ష
- ఆన్‌లైన్ పరీక్షలో 100 ప్రశ్నలు-100 మార్కులకుగాను 90 నిమిషాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. దీనిలో సంబంధిత నర్సింగ్ సబ్జెక్టు నుంచి 80 ప్రశ్నలు, జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ జనరల్ అవేర్‌నెస్-10 ప్రశ్నలు, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అండ్ నర్సింగ్ ఇన్ఫర్మాటిక్స్-10 ప్రశ్నలు ఇస్తారు.
- అభ్యర్థులు రాత పరీక్షలో సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- ప్రతి తప్పు జవాబుకు 1/4 మార్కులను తగ్గిస్తారు.
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** www.aiimsraipur.edu.in

## ఫ్యాకల్టీ పోస్టులు

**కేంద్ర మానవ వనపరుల శాఖ పరిధిలో పనిచేస్తున్న రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం (తిరుపతి) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**


- **మొత్తం ఖాళీలు:** 42
- టీచింగ్, నాన్ అకడమిక్ పోస్టులు

RASHTRIYA SANSKRIT VIDYAPEETHA, TIRUPATI

- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిప్యూటీ లైబ్రేరియన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్.
- **విభాగాలు:** వ్యాకరణం, జ్యోతిషం, యోగా, కంప్యూటర్ సైన్స్ తదితరాలు
- **అర్హతలు:** సంస్థ నిబంధనల ప్రకారం
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 800/- (ఎస్సీ/ఎస్టీలకు రూ. 200/-)
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** రిజిస్ట్రార్, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి-517507
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** http://rsvidyapeetha.ac.in

## ఐఐసీటీలో సైంటిస్టులు

**హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- మొత్తం పోస్టుల సంఖ్య: 19 (సైంటిస్ట్ -13, సీనియర్ సైంటిస్ట్-4, ప్రిన్సిపల్ సైంటిస్ట్-2)
- **అర్హత:** కెమికల్ ఇంజినీరింగ్‌లో ఎంఈ/ఎంటెక్ లేదా పాలీమర్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ లేదా తత్సమాన సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ ఉండాలి.
- **వయస్సు:** 2019 జూలై 30 నాటికి సైంటిస్టుకు 32 ఏండ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏండ్లు, ప్రిన్సిపల్ సైంటిస్టుకు 45 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 30
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్ :** www.iictindia.org

## ఎస్‌పీఎంసీఐఎల్‌లో

**న్యూఢిల్లీలోని సెక్యూరిటీ ప్రింటింగ్ & మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్) ఖాళీగా ఉన్న టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

SECURITY PRINTING AND MINTING CORPORATION OF INDIA LIMITED

- **మొత్తం పోస్టులు:** 23
- **పోస్టు పేరు:** టెక్నికల్ ఆఫీసర్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత బ్రాంచీల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 జూలై 31 నాటికి 30 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 400/-, మిగతావారికి రూ. 100/-
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో.
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.spmcil.com.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 3 జూలై 2019


రాజశేఖర్

**పోలీస్ పాత్రలనగానే తెలుగు చిత్రసీమలో తొలుత హీరో రాజశేఖర్ గుర్తొస్తారు. విలక్షణ అభినయం, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీతో ఖాకీ కథాంశాల్లో అలవోకగా ఒదిగిపోతుంటారాయన. కుటుంబ చిత్రాల్లో కూడా తనదైన ముద్రను చాటుకున్నారు. 'గరుడవేగ' సక్సెస్‌తో తిరిగి విజయాల బాట పట్టారాయన. రాజశేఖర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కల్కి'. ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో రాజశేఖర్ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి..**

# విలన్‌గానూ నటిస్తా!

**'కల్కి' సినిమాకు ఎలాంటి స్పందన లభిస్తున్నది?**

• నా నటన, మేనరిజమ్స్‌తో పాటు పరిశోధన అధికారిగా కనిపించిన విధానానికి మంచి పేరు లభిస్తున్నది. అయితే వసూళ్ల పరంగా 60 నుంచి 70 శాతం మార్కులే వచ్చాయి. పాస్ అయ్యాం కానీ వందమార్కులు రాలేదు.

**అలా జరగడానికి కారణం ఏమిటనుకుంటున్నారు?**

• కారణం ఏమిటో తెలియదు. విశ్లేషించిన తర్వాతే ఎక్కడ తప్పులు జరిగాయో తెలుస్తాయి. ఇన్వెస్టిగేటివ్ సస్పెన్స్ థ్రిల్లర్ కథల్నివేగంగా నడిపించడం చాలా ముఖ్యం. వేగం పెంచి గ్రిప్పింగ్‌గా తెరకెక్కిస్తే సినిమా మరింత పెద్ద విజయాన్ని సాధించేది.

**పోలీస్ పాత్రకు సంబంధించిన లుక్, స్టైల్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

• పోలీస్ యూనిఫామ్ ఒంటిపై ఉంటే ప్రపంచాన్ని మర్చిపోతాను. భోజనం కూడా గుర్తుకురాదు. పోలీస్ పాత్రలకు తగినట్లుగా వ్యాయామాలు చేస్తాను. ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ నటిస్తాను.

**'గరుడవేగ' 'కల్కి' సినిమాలతో కథల విషయంలో మీరు కొత్తగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది?**

• నవతరం హీరోలతో పోటీపడుతూ సినిమాలు చేయాలంటే కొత్తగా ఆలోచించక తప్పదు. ప్రేమకథలు, డ్యూయెట్లు పాడే వయసు నాది కాదు. ఆ టైమ్ ముగిసింది. అలాంటి సినిమాల్ని ఎవరూ ఇష్టపడటం లేదు. సహజత్వాన్ని కోరుకుంటున్నారు. అందుకే నా వయసుకు తగ్గ కథల్ని ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నాను.

**ఈ సినిమా దర్శకత్వ వ్యవహారాల్లో జీవిత జోక్యం చేసుకున్నారనే వార్తలు వినిపించాయి?**

• ఓ నిర్మాతగా సినిమా బాగా రావడానికి కృషిచేసింది తప్పితే దర్శకత్వంలో తన ఇన్‌వాల్వ్‌మెంట్ లేదు. ఒకవేళ జీవిత దర్శకత్వ బాధ్యతల్లో పాలుపంచుకుంటే టైటిల్స్‌లో తన పేరు వేయకపోతే నేను ఊరుకోను. 'ఎవడైతే నాకేంటి' సినిమాను తొలుత సముద్ర దర్శకత్వంలో ప్రారంభించాం. కానీ అనివార్య కారణాల వల్ల జీవిత సినిమాను పూర్తిచేయాల్సిన అవసరం వచ్చింది. పేరు వేయద్దని తాను చెప్పినా కూడా దర్శకురాలిగా జీవిత పేరు వేశాం.

**'ఏం సెప్తిరి ఏం సెప్తిరి' అనే డైలాగ్ గురించి ప్రశాంత్‌వర్మ చెప్పగానే ఏమనిపించింది?**

• సినిమాలో ఆ డైలాగ్ రెండు సార్లు వస్తుంది. తొలుత దాని గురించి చెప్పగానే ప్రశాంత్‌వర్మ అద్భుతంగా రాశాడని అనిపించింది. తొలిసారి ఆ సీన్ చేస్తున్నప్పుడు జీవిత నా పక్కన లేదు. అదే డైలాగ్‌ను రెండోసారి చెప్పే సమయంలో జీవిత సెట్స్‌లో ఉండటంతో తనకు ఈ డైలాగ్ గురించి చెప్పాను. అది నాపై కామెడీ చేయడానికి ఉపయోగించే డైలాగ్ అని జీవిత చెప్పే వరకు నాకు తెలియదు. నా సంభాషణ అని తెలియకుండానే నటించాను.

**'గరుడవేగ-2' ఎప్పుడూ ప్రారంభం కానుంది?**

• ప్రస్తుతం ప్రవీణ్ సత్తారు కథను సిద్ధంచేస్తున్నారు. పాయింట్ విన్నాను. చాలా బాగుంది. ఈ ఏడాది చివరలో సినిమాను మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నాం.

**'కల్కి-2' సినిమా చేస్తారా?**

• కల్కి క్యారెక్టర్ కొనసాగిస్తూ సినిమాలు చేయాలనే ఆలోచన ఉంది. ఆ పాత్రను ఏ కథలోనైనా వాడుకోవచ్చు.

**బాలకృష్ణతో కలిసి మీరు ఓ సినిమా చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి?**

• అలాంటి వార్తలు చాలా వచ్చాయి. వాటిలో వాస్తవం లేదు. అలాగే విలన్‌గా నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రెగ్యులర్ విలన్ పాత్రలు కాకుండా 'ధృవ' సినిమాలో అరవింద్‌స్వామి మాదిరి ప్రతినాయకుడి పాత్రలు చేయాలని ఉంది. కథ బాగా నచ్చితే అతిథి పాత్రలు, సహాయనటుడిగా కనిపించడానికి అభ్యంతరం లేదు.

**'దొరసాని' ట్రైలర్‌లో శివాత్మిక నటన చూసి ఎలాంటి అనుభూతికి లోనయ్యారు? కూతుళ్లతో కలిసి సినిమా చేస్తారా?**

• నా ఇద్దరు కూతుళ్లతో పాటు జీవిత, నేను కలిసి ఓ సినిమా చేయాలనే ఆలోచన ఉంది. కథ కూడా సిద్ధమైంది. అయితే శివాని, శివాత్మిక కొన్ని సినిమాలు చేసిన తర్వాత ఆ సినిమాను మొదలుపెడతాం. పెద్ద బ్యానర్ ద్వారా శివాత్మిక పరిచయం కావడం ఆనందంగా ఉంది. తను ఎలా నటిస్తుందో అనే అనుమానం ఇదివరకు ఉండేది. కానీ దొరసానిలో అద్భుతంగా నటించిందని, సావిత్రిలా కనిపిస్తుందని చిత్ర బృందం ప్రశంసిస్తుండటంతో అవన్నీ తొలగిపోయాయి.

> **• సినిమాలోని యాక్షన్స్ సీక్వెన్స్ చూసి నా కూతుళ్లు మెచ్చుకున్నారు. ఇప్పడున్న హీరోలతో పోటీపడుతూ పోరాట ఘట్టాలు చేశానంటూ వాళ్ల ఫ్రెండ్స్ మెచ్చుకున్నారని చెప్పారు. ఈ వయసులో యాక్షన్ సన్నివేశాలు చేయడం కష్టమే కానీ అవి చేసే సత్తా నాకుంది.**

> **• జంతువుల్ని చంపడం పాపం అనే ఆలోచనతో రెండేళ్ల నుంచి మాంసాహారం తినడం మానేశాను. నా స్ఫూర్తితో మా పిల్లలు కూడా తినడం మానేశారు. ఇంట్లో అందరం వెజిటేరియన్స్ అయిపోయాం.**


జీవిత

• ప్రశాంత్ వర్మ లాంటి ప్రతిభావంతుడైన దర్శకుడు ఉండగా దర్శకత్వంలో నేనెందుకు జోక్యం చేసుకుంటాను. ఆ అవసరం నాకు లేదు. అనుకున్న పనులు సరైన సమయంలో పూర్తికాని పరిస్థితుల్లో దర్శకుడితో చర్చించిన అంశాల్ని జోక్యం అనుకుంటే ఎలా? అది మా సినిమాపై మేము తీసుకున్న జాగ్రత్త మాత్రమే. నేను దర్శకత్వం వహించిన సినిమాలు విజయాలు సాధించాయా? లేదా అన్నది పక్కనపెడితే నా దర్శకత్వంలో మాత్రం లోపాలు లేవు. నాకున్న పరిజ్ఞానంతో సొంత సినిమా బాగా రావడానికి చేస్తున్న కృషిని జోక్యంగా భావించడం సరికాదు. కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీస్తున్నప్పుడు దర్శకత్వం వహించాలనే కోరిక ఉంటే నేను తీస్తాను తప్ప మరొకరికి ఎందుకు అవకాశం ఇస్తాను.

• అవసరమైన చోట రొమాన్స్ పెట్టడం తప్పు కాదు. అంతేకానీ అవసరం లేకుండా మితిమీరిచూపించడం ఇబ్బందిగా ఉంది. మణిరత్నం, బాపు, విశ్వానాథ్.. ఇలా దిగ్గజ దర్శకులందరూ రొమాంటిక్ సినిమాలు చేశారు. కానీ వారి సినిమాల్లో అసభ్యత కనిపించదు. సెన్సార్ బోర్డు సభ్యురాలిగా నా దగ్గరకు వస్తున్న సినిమాలు చూస్తుంటే ఎలా స్పందించాలో తెలియడం లేదు. నేను హీరోయిన్‌గా నటించాను. నా కూతుళ్లు సినిమాలు చేస్తున్నారు. రొమాన్స్ వద్దని చెప్పడం లేదు. కుటుంబంతో కలిసి చూస్తే ఇబ్బందిగా ఫీలయ్యే పరిస్థితి రావొద్దు.

• రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సఖ్యతగా ఉండటం చాలా ఆనందంగా ఉంది. తెలంగాణ, ఆంధ్రా అనే ఫీలింగ్ లేదని అనిపిస్తున్నది. సీఎంల స్నేహసంబంధాల వల్ల తెలుగు వారందరికి మంచి జరుగుతుంది. పదవులు ఆశించి వైఎస్సార్ పార్టీకి మద్దతు ఇవ్వలేదు.

## కల్యాణ్‌రామ్ 'రావణ'?


కళ్యాణ్‌రామ్

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మెహరీన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ప్రముఖ ఆడియో కంపెనీ ఆదిత్య మ్యూజిక్ అధినేత ఉమేష్ గుప్తా నిర్మాణ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఇటీవలే ప్రారంభమైన ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. కాగా ఈ సినిమా చిత్రీకరణ దశలో వుండగానే హీరో కల్యాణ్‌రామ్ మరో చిత్రాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ఈ సినిమా ద్వారా మల్లిడి వశిష్ట దర్శకుడిగా పరిచయం కానున్నట్లు తెలుస్తున్నది. సరికొత్త నేపథ్యంలో విభిన్నమైన పాత్ర చిత్రణతో సాగే ఈ చిత్రానికి 'రావణ' అనే టైటిల్‌ని చిత్ర బృందం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనున్నట్లు చిత్ర వర్గాల సమాచారం.


**ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. సుజీత్ దర్శకుడు. ప్రస్తుతం ఆస్ట్రియాలో చిత్రీకరణ జరుగుతున్నది. ఇక్కడి ప్రకృతి సుందరమైన లొకేషన్లు తనను మంత్రముగ్ధున్ని చేశాయని ప్రభాస్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానిస్తూ షూటింగ్ లొకేషన్‌కు సంబంధించిన ఫొటోను పంచుకున్నారు.**

## పాతబస్తీలో హంగామా


రామ్, నిధి అగర్వాల్

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, నభానటేష్ కథానాయికలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'మణిశర్మ స్వరపరచిన పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తున్నది. టీజర్‌లో రామ్ కొత్త లుక్‌తో ఆకట్టుకుంటున్నాడు. హైదరాబాద్ పాతబస్తీ యువకుడిగా రామ్ చేసే హంగామా అలరిస్తుంది. అసాంఘిక శక్తుల ఆటకట్టించడానికి ఇస్మార్ట్ శంకర్ చేసిన పోరాటమేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది' అని చిత్ర బృందం తెలిపింది. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, ఆశిష్‌విద్యార్థి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్ తోట, సంగీతం: మణిశర్మ.


శ్రీవిష్ణు, వివేక్ ఆత్రేయ, విజయ్‌కుమార్, నివేథా థామస్

## సమిష్టి కృషికి దక్కిన విజయం

'సినిమా చూసి నేను నవ్వుకున్నాను. చూసిన వారంతా అద్భుతంగా ఉందని అంటున్నారు' అని అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. విజయ్ కుమార్ మన్యం నిర్మించారు. నివేథా థామస్, సత్యదేవ్, నివేతా పెతురాజ్ కీలక పాత్రలను పోషించారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర థాంక్స్‌మీట్ జరిగింది. ఈ వేడుకకు దర్శకులు తరుణ్‌భాస్కర్, శివనిర్వాణ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సినిమా చూసి బాగుందని కేటీఆర్‌తో పాటు తరుణ్‌భాస్కర్, నాని, వెంకటేష్ ప్రోత్సహించారు. విమర్శకుల ప్రశంసల్ని అందుకోవడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. కొత్తదనంతో కూడిన సినిమాల్ని ప్రేక్షకులు ఆదరించడం వల్లే వినూత్నమైన సినిమాలు వస్తున్నాయని, తన పాత్రకు మంచి స్పందన లభిస్తున్నదని ప్రియదర్శి పేర్కొన్నారు. నివేథా థామస్ మాట్లాడుతూ 'మంచి సినిమాల్ని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని ఈ సినిమా మరోసారి రుజువు చేసింది. సమిష్టి కృషికి దక్కిన విజయం ఇది' అని చెప్పింది. 'ఈ ఏడాది తమకు నచ్చిన సినిమా ఇదేనని చాలా మంది చెబుతున్నారు. కథలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెరపై ఆవిష్కరిస్తుంటారు వివేక్. తన దగ్గర నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది' అని తరుణ్ భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యదేవ్, వివేక్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజు గారి గదిలో..

థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ 'గేమ్ ఓవర్' సక్సెస్‌తో రెట్టించిన ఉత్సాహంతో వున్నారు తాప్సీ. తాజాగా ఆమె మరో థ్రిల్లర్ చిత్రానికి ఓకే చెప్పినట్లు తెలిసింది. బుల్లితెర వ్యాఖ్యాత ఓంకార్ 'రాజుగారి గది' చిత్రానికి కొనసాగింపుగా 'రాజు గారి గది-3' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తమన్నాను కీలక పాత్ర కోసం ఎంచుకున్నారు. ఈ చిత్రం ఇటీవలే మొదలైంది. అయితే అనివార్య కారణాల వల్ల తమన్నా ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలోనే తప్పుకున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ నటిస్తున్న 'బోలే చూడియా' అనే చిత్రాన్ని తమన్నా అంగీకరించారు. ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేసుకున్న ఆమె డేట్స్ సమస్య కారణంగానే 'రాజు గారి గది-3' చిత్రం నుంచి తప్పుకున్నారని తెలిసింది. దాంతో ఆమె స్థానంలో కథనాయికగా తాప్సీని దర్శకుడు ఓంకార్ ఖరారు చేయనున్నట్లు చిత్ర వర్గాల సమాచారం. ఇటీవలే ఆమెను చిత్ర బృందం కలిసిందని, త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారని తెలిసింది.


తాప్సీ


నిర్మల్‌కుమార్, ఐశ్వర్యరాజేష్, ఉదయ్‌శంకర్, భరత్‌రామ్, శ్రీరామరాజు

## రెజ్లింగ్ నేపథ్యంలో 'మిస్ మ్యాచ్'

ఉదయ్‌శంకర్, ఐశ్వర్యరాజేష్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'మిస్‌మ్యాచ్'. ఎన్.వి.నిర్మల్‌కుమార్ దర్శకుడు. అధిరోహ్ క్రియేటివ్స్ సైన్స్ పతాకంపై భరత్ రామ్, శ్రీరామరాజు నిర్మిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'తెలుగులో నా తొలి చిత్రమిది. రెజ్లింగ్ నేపథ్యంలో కథ నడుస్తుంది. ప్రేమికుల మధ్య సంఘర్షణకు కారణమేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు. 'ఐశ్వర్య రాజేష్ ఛాలెంజింగ్ రోల్‌ని పోషిస్తున్నది. క్రీడా నేపథ్యంలో రొమాన్స్, డ్రామా, ఫ్యామిలీ ఎమోషన్స్ కలబోతగా ఈ చిత్రం మెప్పిస్తుంది' అని నిర్మాతలు చెప్పారు. ఐశ్వర్యరాజేష్ మాట్లాడుతూ 'భూపతిరాజా కథ అందిస్తున్నారని తెలియగానే సినిమా ఒప్పుకున్నాను. నేను ఇప్పటివరకు చేసిన పాత్రలకు పూర్తి వైవిధ్యంగా ఉంటుంది. ఈ సినిమా కోసం రెజ్లింగ్ నేర్చుకున్నాను. 'తొలిప్రేమ' చిత్రంలోని 'ఈ మనసే..' పాటను సింగిల్ టేక్‌లో రీమిక్స్ చేశాం. ఈ పాట సినిమాకు ప్రధానాకర్షణగా ఉంటుంది' అని చెప్పింది. గొప్ప కథలో తాను భాగం కావడం ఆనందంగా ఉందని కథానాయకుడు ఉదయ్‌శంకర్ తెలిపారు. సంజయ్‌స్వరూప్, ప్రదీప్ రావత్, రూపాలక్ష్మి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: గణేష్‌చంద్ర, కథ: భూపతిరాజా, మాటలు: రాజేంద్రకుమార్, పాటలు: సిరివెన్నెల సీతారామశాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, నిర్మాతలు: జి.శ్రీరామ రాజు, భరత్‌రామ్.

## తమిళ సినిమాలో అతిథిగా..


షారుఖ్‌ఖాన్

విజయ్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న తమిళ చిత్రం 'బిగిల్'. మాఫియా కథాంశానికి క్రీడా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ అగ్ర నటుడు షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. విజయ్‌తో కలిసి ఓ పాటలో షారుఖ్‌ఖాన్ కనిపిస్తారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. షారుఖ్‌ఖాన్ నటించనున్న తొలి తమిళ చిత్రమిదే కావడం గమనార్హం. కొన్ని రోజుల క్రితం దర్శకుడు అట్లీని షారుఖ్‌ఖాన్ కలవడం చర్చనీయాంశంగా మారింది. అతిథి పాత్ర కోసం వీరిద్దరు కలుసుకున్నట్లు చెబుతున్నారు. తండ్రీకొడుకులుగా విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తున్నది.

## ఆమె కథేమిటి?

అమలాపాల్ కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'అడై' తెలుగులో 'ఆమె' పేరుతో ప్రేక్షకులముందుకురానుంది. రత్నకుమార్ దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్‌లో అమలాపాల్ బోల్డ్‌లుక్ హాట్‌టాపిక్‌గా మారింది. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలకానుంది. 'థ్రిల్లర్ డ్రామా ఇది. ఓ యువతి మానసిక సంఘర్షణకు అద్దం పడుతుంది. ప్రతి సన్నివేశం ఉత్కంఠను పంచుతుంది. అమలాపాల్ మునుపెన్నడూ చూడని వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తుంది' అని చిత్రబృందం తెలిపింది. దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ చిత్ర తెలుగు హక్కులను సొంతం చేసుకున్నారు. చరిత్ర చిత్ర ప్రొడక్షన్స్‌లో ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్ కార్తిక్ ఖన్నన్, మాటలు: రాజేష్ ఏ మూర్తి, నిర్మాతలు: రాంబాబు కల్లూరి, విజయ్, రచన-దర్శకత్వం: రత్నకుమార్.


'ఆమె' చిత్రంలో అమలాపాల్